




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY | నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

Navabhoomi daily follows..

హైదరాబాద్ | 28 సోమవారం | జులై 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 313

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatnam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur







# భారీ ఎన్‌కౌంటర్

- ఇద్దరు మహిళలతో సహా 4గురి మృతి..ఆయుధాలు స్వాధీనం
- డీఆర్జీ ఆపరేషన్ విజయవంతం
- బసాగుడలో కాల్పులు
- ఆయుధాలు స్వాధీనం
- రూ.17 లక్షల బహుమతితో ఉన్నవారు హతమవడం చర్చనీయాంశం



2

**బీజాపూర్-నవభూమిబ్యూరో**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో నక్సల్ వ్యతిరేక ఆపరేషన్లలో భద్రతా దళాలు మరో భారీ విజయాన్ని సాధించాయి. శనివారం సాయంత్రం ప్రారంభమై ఆదివారం మధ్యాహ్నం వరకు కొనసాగిన ఎదురుకాల్పుల్లో నలుగురు నక్సలైట్లు హతమయ్యారు. వీరిలో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. మరణించిన నక్సలైట్లపై మొత్తం రూ.17 లక్షల బహుమతి ప్రకటించబడిందని అధికారులు వెల్లడించారు.

బీజాపూర్ జిల్లాలోని దక్షిణ-పశ్చిమ ప్రాంతంలో గల బసాగుడ, గంగలూర్ పోలీస్ స్టేషన్ల సరిహద్దు అటవీ ప్రాంతాల్లో మావోయిస్టుల ఉనికి గురించి భద్రతా దళాలకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ సమాచారం ఆధారంగా డీఆర్జీ(డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్) బీజాపూర్ బృందం జులై 26, 2025 సాయంత్రం గాలింపు చర్యలు చేపట్టింది. ఈ ఆపరేషన్ సమయంలో పోలీసు బలగాలు, మావోయిస్టుల మధ్య తీవ్రమైన ఎదురుకాల్పులు జరిగాయి. ఆదివారం మధ్యాహ్నం వరకు

# బీజేపీతో విలీనం ఉత్తిదే!

- మేము ఎవరితోనూ కలిసే ప్రసక్తే లేదు
- స్పష్టం చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఇది బీజేపీతో పొత్తు లేదా విలీనంపై ఊహాగానాలకు బ్రేక్
- బీజేపీలో బీఆర్ఎస్ విలీనానికి ప్రయత్నాలు జరిగాయన్న
- బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ వ్యాఖ్యలతో కలకలం

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణ రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఎంపీ సీఎం రమేశ్ చేసిన "బీజేపీలో బీఆర్ఎస్ విలీనానికి ప్రయత్నాలు జరిగాయి" అనే సంచలన ఆరోపణ పెద్ద దుమారం రేపింది. దీనిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన స్పందన అనేక కోణాలను స్పష్టం చేయడంతో పాటు బీఆర్ఎస్ రాజకీయ వ్యూహాన్ని ప్రతిబింబిస్తోంది. కేటీఆర్ స్పందన "మేము ఎవరితోనూ కలిసే ప్రసక్తే లేదు" అని కేటీఆర్ నిస్సందేహంగా ప్రకటించారు. ఇది బీజేపీతో పొత్తు లేదా విలీనం గురించి జరుగుతున్న ఊహాగానాలకు బ్రేక్ వేసింది. ఈ ప్రకటన కేవలం మీడియాకు ఇచ్చిన సమాధానం మాత్రమే కాదు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు ఒక స్పష్టమైన దిశానిర్దేశం. పార్టీలో తలెత్తే అంతర్గత గందరగోళాన్ని నివారించడంతో పాటు, కార్యకర్తలకు ఆత్మవిశ్వాసాన్ని నింపే ప్రయత్నంగా దీన్ని చూడవచ్చు. తద్వారా బీఆర్ఎస్ సొంత బలంపైనే నిలబడుతుందనే సంకల్పాన్ని చాటిచెప్పారు. "పాలిచ్చే బర్రెను (బీఆర్ఎస్) పక్కనపెట్టి, దున్నపోతును (కాంగ్రెస్) తెచ్చుకున్నారు" అనే కేటీఆర్ వ్యాఖ్య తీవ్రమైన వ్యంగ్యాన్ని, విమర్శను నింపుకుంది. ఇది కాంగ్రెస్ పాలనా విధానాలను, పనితీరును ధ్వంసాత్మకంగా అభివర్ణించింది. బీఆర్ఎస్ గత ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమం, అభివృద్ధిని అందించగలిగిందని, ప్రస్తుత కాంగ్రెస్ మాత్రం పనికిమాలినదని పరోక్షంగా ఈ వ్యాఖ్య ద్వారా సూచించారు. ఈ వ్యాఖ్య బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపడంతో పాటు, బీజేపీపై విమర్శనాస్త్రంగా మారింది. కేటీఆర్ తమ ప్రభుత్వ హయాంలో "కరోనా సమయంలో కూడా అభివృద్ధిని ఆపలేదు, సంక్షేమ పథకాలు కొనసాగించాం" అని పేర్కొనడం ద్వారా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. "ఎరువుల కోసం యుద్ధం చేయాల్సి వస్తోంది" అనే వ్యాఖ్య కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ముఖ్యంగా రైతులకు ఎదురవుతున్న సమస్యలను ఎత్తిచూపింది. ఇది ప్రజల్లో ప్రస్తుత ప్రభుత్వం పట్ల అసంతృప్తిని పెంచే ప్రయత్నంగా కనిపిస్తుంది. "కేసీఆర్ మరోసారి సీఎం అయ్యాక మన కష్టాలు తొలిగిపోతాయి" అనే కేటీఆర్ తుది వ్యాఖ్య ఒక రకంగా రాబోయే ఎన్నికల ప్రచారానికి సంకేతంగా చెప్పవచ్చు. ఇది బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావాలనే బలమైన సంకల్పాన్ని

## చర్చి ప్రాంగణంలో ఐసీస్

# ఉగ్ర కాల్పులు

- ఐసీస్ కాల్పుల్లో 21 మంది మృతి
- కాంగోలోని క్యాథలిక్ చర్చి ప్రాంగణంలో కాల్పులకు తెగబడ్డ అలైడ్ డెమోక్రటిక్ ఫోర్సెస్ సభ్యులు
- ఈ ఘటనలో అనేక ఇళ్లు, షాపులు కూడా ధ్వంసం

2



**కాంగో-నవభూమిబ్యూరో**

కాంగోలో ఇస్లామిక్ స్టేట్ మద్దతు కలిగిన తిరుగుబాటుదారులు రెచ్చిపోయారు. ఆదివారం ఓ చర్చి ప్రాంగణంలో జరిపిన దాడుల్లో సుమారు 21 మంది మృతి చెందారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రశాంతత కరువవుతుందనే కామెంట్లు ఇటీవల ఎక్కువగా వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ఓ పక్క వరుస యుద్ధాలు, సరిహద్దు దేశాల మధ్య ఘర్షణలు, మరోవైపు పెరిగిపోతున్న ఉగ్రమూకలు, రెచ్చిపోతున్న తిరుగుబాటుదారులు... వెరసి అశాంతి విపరీతంగా వ్యాపించడానికి కారణాలుగా మారుతున్న పరిస్థితి. ఈ సమయంలో ఆదివారం ఓ చర్చ్ ప్రాంగణంలో కాల్పులు జరిగాయి. అవును... కాంగోలో ఇస్లామిక్ స్టేట్ మద్దతు కలిగిన తిరుగుబాటుదారులు రెచ్చిపోయారు. ఆదివారం ఓ చర్చి

## హరిద్వార్‌లో

# విషాదం

- హరిద్వార్ ఆలయంలో తొక్కిసలాట
- ఆరుగురు భక్తుల మృతి
- తీవ్ర గాయాలతో పలువురు ఆసుపత్రిలో
- శ్రావణ మాసం భక్తుల రద్దీ కారణం
- క్యూలైన్‌లో తోపులాటతో అపశృతి
- ఎమర్జెన్సీ బృందాల స్పందన వేగవంతం
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- డివిజనల్ కమిషనర్ స్పందన



2


**హరిద్వార్-నవభూమిబ్యూరో**

ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మానసాదేవి ఆలయంలో తొక్కిసలాట జరగడంతో ఆరుగురు భక్తులు చనిపోయారు. మరికొందరికి గాయాలయ్యాయని సమాచారం. శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం ఆలయానికి భక్తులు పోటెత్తారు. పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో క్యూలైన్ లో తోపులాట చోటుచేసుకుందని తెలుస్తోంది. ప్రమాదం గురించి సమాచారం అందడంతో ఎమర్జెన్సీ బృందాలు హుటాహుటిన ఆలయానికి చేరుకున్నాయి. గాయపడిన భక్తులను దగ్గర్లోని ఆసుపత్రులకు తరలించాయి.

# ఏపీకి మరో భారీ పరిశ్రమ

- రూ.20850 కోట్లతో పెట్టుబడులు
- కడప జిల్లా సున్నపురాళ్ల పల్లెలో ఇంటిగ్రేటెడ్
- స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సర్కారు గ్రీన్ సిగ్నల్
- స్టీల్ ప్లాంట్ కోసం మొత్తం 1100 ఎకరాల భూమిని
- ఎకరాకు రూ. 5 లక్షల చొప్పున కేటాయిస్తూ ఆదేశం

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో పారిశ్రామిక రంగ అభివృద్ధిపై ఫోకస్ పెట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మరో కీలక అడుగు పడింది. కడప జిల్లా సున్నపురాళ్ల పల్లెలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జేఎస్‌డబ్ల్యూ ఏపీ స్టీల్ లిమిటెడ్ ప్రతిపాదించిన ఈ ప్రాజెక్ట్ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

**భారీ పెట్టుబడులు, దశలవారీ ప్రణాళిక..**

ఈ ప్రాజెక్ట్‌ను రెండు దశల్లో పూర్తి చేయనున్నారు. మొదటి దశలో రూ. 4,500 కోట్ల పెట్టుబడితో పనులు ప్రారంభం కానున్నాయి. అనంతరం రెండో దశలో రూ. 16,350 కోట్ల పెట్టుబడితో పూర్తి స్థాయి ఉత్పత్తి ప్రారంభిస్తారు. మొత్తంగా ఈ ప్రాజెక్ట్ కోసం రూ. 20,850 కోట్ల పెట్టుబడి ప్రతిపాదించారు.


**ప్రాజెక్ట్ టైమ్‌లైన్..** ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జనవరి 2026 నాటికి మొదటి దశ పనులు ప్రారంభమవుతాయి. ఈ పనులను ఏప్రిల్ 2029 నాటికి పూర్తిచేసి ఉత్పత్తి ప్రారంభించనున్నారు. రెండో దశ పనులు జనవరి 2031 నాటికి ప్రారంభమై, ఏప్రిల్ 2034 నాటికి పూర్తవుతాయి.

**భూమి కేటాయింపు..** స్టీల్ ప్లాంట్ కోసం మొత్తం 1100 ఎకరాల భూమిని ఎకరాకు రూ. 5 లక్షల చొప్పున కేటాయించడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. భూమి కేటాయింపుతో పాటు రోడ్లు, విద్యుత్, నీటి వనరులు, డ్రైనేజ్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించబడింది. ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ ప్రకారం జేఎస్‌డబ్ల్యూ సంస్థకు పన్నుల రాయితీలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సపోర్ట్, తక్కువ ధరలకు నీరు మరియు విద్యుత్

## సరోగసి పేరుతో

# చైల్డ్ ట్రాఫికింగ్

**90వేలకు శిశువును కొని 40లక్షలకు అమ్మకం!**



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

యూనివర్సల్ సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. డిసిపి రష్మీ పెరుమాళ్ ఈ కేసులో అనేక కీలక విషయాలను వెల్లడించారు. అక్రమ సరోగసి ద్వారా చైల్డ్ ట్రాఫికింగ్ జరిగినట్టు పేర్కొన్నారు. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ లో అక్రమ సరోగసి చేసినట్టు తెలిపిన నార్త్ జోన్ డిసిపి రష్మీ పెరుమాళ్ ఈ కేసులో పిల్లల అమ్మకాల రాకెట్ ను చేదించినట్టు తెలిపారు.

**సరోగసి పేరుతో ఫెర్టిలిటీ సెంటర్ మోసం**

ఈ కేసు వివరాలను వెల్లడించిన నార్త్ జోన్ డిసిపి 2024 ఆగస్టులో సంతానం కోసం ఒక జంట యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ ను ఆశ్రయించారని, డాక్టర్ నమ్రత వారికి సరోగసి చేయించుకోవాలని సూచించారని తెలిపారు. సరోగసి ద్వారా పిల్లలను కనడానికి తమ క్లినిక్ సహాయం చేస్తుందని చెప్పగా, దీనికోసం దంపతులు 9నెలలపాటు క్లినిక్ డబ్బులు చెల్లించారు. సరోగసి ద్వారా జూన్ 2025లో విశాఖపట్నంలో ఒక మగ శిశువు జన్మించాడు.

పిల్లలు లేని జంట నుండి 35 లక్షలు వసూలు చేసిన ఫెర్టిలిటీ సెంటర్ డెలివరీ చార్జీలు చెల్లించి బిడ్డను తీసుకువెళ్లాలని ఆ దంపతులకు డాక్టర్ నమ్రత సూచించారు. వారికి బిడ్డను అప్పగించి, తప్పుడు జనన ధ్రువీకరణ పత్రాన్ని, డిఎన్‌ఏ నివేదికను కూడా వారికి అందించారు. సంతానం లేని భార్యాభర్తల అండం, వీర్యం ద్వారానే బిడ్డ పుట్టినట్లు నమ్మించే ప్రయత్నం చేశారు. ఈ ప్రక్రియలో సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ ఆ జంట నుండి 35 లక్షలకు పైగా వసూలు చేసింది.

**డీఎన్ఏ సరిపోలక కేసు పెట్టిన దంపతులు**

ఆ తర్వాత బిడ్డ డిఎన్‌ఏ ను వారు పరీక్షించగా, వారి డిఎన్‌ఏ తో సరిపోలేదు. దీంతో మోసపోయినట్టు గుర్తించిన ఆ జంట పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలో పోలీసులు కేసు నమోదు చేసి, డాక్టర్ నమ్రతను అరెస్టు చేసి విచారణ చేపట్టగా ఆ ఫెర్టిలిటీ సెంటర్ లో జరుగుతున్న మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వచ్చాయి.

డాక్టర్ నమ్రత సరోగసి ద్వారా పిల్లలను పుట్టిస్తానని చెప్పి ప్రతి క్లైంట్ నుండి 20నుండి 30లక్షల రూపాయల వరకు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. ఈ జంటకు 90వేల

# రెచ్చిపోయిన సైకో

- సూపర్ మార్కెట్‌లో కత్తి కలకలం
- 11 మంది గాయాలు
- ఆరుగురి పరిస్థితి విషమం
- మిచిగాన్ ట్రావర్స్ సిటీలో ఘటన
- రక్తపాతానంతరం నిందితుడి పరారీ
- గాయపడ్డవారిని ఆసుపత్రికి తరలింపు
- పోలీసుల విచారణ ప్రారంభం
- నిందితుడు అరెస్ట్‌తో వివరాలు వెలుగులోకి
- సాక్ష్యంగా ప్రత్యక్షదర్శి వ్యాఖ్యలు
- పరిమితి తప్పిన భయం.. ప్రజల్లో కలకలం



2

## 12వేల మంది ఉద్యోగులను తొలగించబోతున్న

# టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్

- టీసీఎస్ నిర్ణయం షాక్‌కు గురిచేసినట్లు ఉద్యోగుల స్పందన
- ఏఐ ఆధారిత భవిష్యత్‌కు మారుతున్న ఆపరేటింగ్ మోడల్
- మధ్య, సీనియర్ ఉద్యోగులే ఎక్కువగా ప్రభావితులు
- టీసీఎస్ సీఈఓ కృతివాసన్ ప్రకటన హైలైట్
- ఉద్యోగులకు మానవతా దృక్పథంతో నష్ట నివారణ చర్యలు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

భారతదేశపు అతిపెద్ద సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ షాకింగ్ న్యూస్ చెప్పింది. టెక్నాలజీలో వస్తున్న వేగవంతమైన మార్పులను ఎదుర్కోడానికి 2 శాతం మంది ఎంప్లాయిస్ అంటే, దాదాపు 12వేల మంది ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించింది. సాంకేతికతలో వస్తున్న అంతరాయాల కారణంగా భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యకు దిగాల్సి వచ్చిందని అంటోంది. దీని ప్రభావం ఇండియాతోపాటు, వివిధ దేశాలలో పనిచేస్తున్న ఉద్యోగులపై ఉండనుంది. తొలగింపు ప్రక్రియ 2026 ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్ 2025 నుండి మార్చి 2026 వరకు) జరుగుతుందని సమాచారం. కంపెనీ సీఈవోగా తాను తీసుకోవలసిన అత్యంత కఠినమైన

## కొండాపూర్‌లో

# రేవ్ పార్టీ భగ్నం

- రేవ్ పార్టీ కలకలం - ఏక్‌నాథ్ ఖడ్సే అల్లుడు అరెస్టు
- పుణెలో స్టూడియో అపార్ట్‌మెంట్‌లో పోలీసులు దాడి
- మొత్తం ఏడుగురు అరెస్టు- డ్రగ్స్, లిక్కర్ స్వాధీనం
- 29వ తేదీ వరకు నిందితులకు పోలీస్ కస్టడీ
- హైదరాబాద్ కొండాపూర్‌లో మరో రేవ్ పార్టీ భగ్నం
- 9 మందిని అరెస్టు -డ్రగ్స్, కార్లు స్వాధీనం
- ప్రాంజల్ ఖేవాల్కర్ పేరు బయటకు రావడంతో రాజకీయ దుమారం




**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

హైదరాబాద్ లోని కొండాపూర్ లో రేవ్ పార్టీ కలకలం రేపింది. శనివారం రాత్రి ఎస్వీ నిలయం అపార్ట్ మెంట్ లో కొంతమంది రేవ్ పార్టీకి ఏర్పాట్లు చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి పార్టీని భగ్నం చేశారు. పార్టీ నిర్వాహకులు సహా మొత్తం 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరంతా ఆంధ్రప్రదేశ్ కు చెందిన వారేనని సమాచారం. విజయవాడకు చెందిన నాయుడు అలియాస్ వాసు, శివం రాయుడు ఏపీ నుంచి సంపన్న యువకులను పిలిపించి వీకెండ్ లో రేవ్ పార్టీలు నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. అపార్ట్‌మెంట్ లో సోదాలు నిర్వహించగా.. 2.080 కేజీల గంజాయి, 50 ఓజీ కుష్ గంజాయి, 11.57 గ్రాముల మ్యాజిక్ ముష్రూమ్, 1.91 గ్రాముల డ్రగ్స్ లభించినట్లు తెలిపారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో కింగ్ కెన్ షేర్ రాహుల్, ఆర్గనైజర్లు ప్రవీణ్ కుమార్ అలియాస్ మన్నే, అప్పికోట్ల అశోక్ కుమార్, సమ్మెల సాయికృష్ణ, హిట్ జోసఫ్, తోట కుమారస్వామి, అడపా యశ్వంత్, శ్రీదత్, నంద, సమతా, తేజ ఉన్నారు. మరో ముగ్గురు పరారయ్యారని, వారిపైనా కేసు నమోదు చేశామని అధికారులు తెలిపారు.

## బీజేపీ వైపుచూస్తున్న

# మల్లారెడ్డి



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

కమలం పెద్దలతో చర్చిస్తున్న మాజీ మంత్రి? అపోజిషన్‌లోకి వచ్చినప్పటి నుంచి కన్‌ఫ్యూజన్‌లో ఉన్న మాజీ మంత్రి మల్లారెడ్డి ఎట్టకేలకు ఓ నిర్ణయానికి వచ్చారని ప్రచారం జరుగుతోంది. అపోజిషన్‌లోకి వచ్చినప్పటి నుంచి కన్‌ఫ్యూజన్‌లో ఉన్న మాజీ మంత్రి మల్లారెడ్డి ఎట్టకేలకు ఓ నిర్ణయానికి వచ్చారని ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ ఓడిపోయిన తర్వాత కాంగ్రెస్ లో చేరాలని విశ్వప్రయత్నం చేసిన మల్లారెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడ్డుగా నిలిచారు. దీంతో మల్లారెడ్డి ప్లాన్ బి అమలులోకి తెచ్చారని అంటున్నారు. రాష్ట్రంలో అధికార పార్టీని కాదని ఇప్పుడు కేంద్రంలో అధికార పార్టీ బీజేపీతో టచ్‌లోకి వెళ్లారని అంటున్నారు. బండి సంజయ్‌తో మల్లారెడ్డి కోడలు భేటీ అయినట్లు ప్రచారం జరుగుతోంది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పక్కచూపులు చూస్తున్నారన్న ప్రచారానికి ఊతమిచ్చేలా ఇటీవల చోటుచేసుకున్న ఓ సంఘటనను పరిశీలకులు ఉదహరిస్తున్నారు. ప్రస్తుతానికి మల్లారెడ్డి గులాబీ పార్టీలో ఉన్నప్పటికీ, పార్టీ మారిపోవాలనే

# అస్త్ర సన్యాసం?

- రాజకీయాలకు మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి టాటా
- గత ఎన్నికలకు ముందు బీజేపీలో చేరిన కిరణ్‌కుమార్‌రెడ్డి
- రాజంపేట పార్లమెంట్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ,ఓటమి
- రాజ్యసభకు ప్రయత్నాలు..ఫలించకపోవడంతో నిరాశ
- ఏపీ బీజేపీ అధ్యక్షుని పదవి రాకపోవడంతో రాజకీయాలకు దూరం

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. 2014లో రాష్ట్ర విభజనకు ముందు కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వానికి సారథ్యం వహించిన కిరణ్ కుమార్ రెడ్డి రాష్ట్ర విభజనకు నిరసనగా తన పదవికి రాజీనామా చేశారు. అనంతరం పార్టీకి రాజీనామా చేసి సొంత పార్టీ పెట్టుకున్నారు. 2014 ఎన్నికల్లో ఆయన పార్టీ సక్సెస్ కాకపోవడంతో దాదాపు ఐదేళ్లు రాజకీయ విరామం తీసుకున్నారు. 2018 చివర్లో కాంగ్రెస్‌లో చేరినా అక్కడ ఆయన సెకెండ్ ఇన్నింగ్స్ కూడా ఆశాజనకం గా లేకపోవడంతో గత ఎన్నికల ముందు బీజేపీలో చేరారు. గత ఎన్నికలకు ముందు కమలం కండువా కప్పుకున్న కిరణ్ కుమార్ రెడ్డి రాజంపేట నుంచి ఎంపీగా పోటీ చేశారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా కూటమి హవా చూపినా, రాజంపేటలో మాత్రం కిరణ్ కుమార్ రెడ్డి గట్టెక్కలేకపోయారు. తన ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి మిథున్ రెడ్డిపై 77 వేల తేడాతో

## నవ వార్త



# ప్రముఖ కవి అఫ్సర్ మహమ్మద్‌కు సినారే సారస్వత పరిషత్తు అవార్డ్



**హైదరాబాద్-నవభూమి:**అబిడ్స్ తిలక్‌రోడ్డులోని తెలంగాణ సారస్వత పరిషత్తులో శనివారంనాడు సాయంత్రం 7గంటలకు జరిగిన కార్యక్రమంలో ప్రముఖ కవి అఫ్సర్ మహమ్మద్‌కు సినారే తెలంగాణ సారస్వత పరిషత్తు అవార్డును ప్రముఖ సినీ దర్శకులు సి.నరసింగరావు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షత వహించారు. ఆచార్య చెన్నయ్య సభకు స్వాగతం పలికారు. డాక్టర్ సినారే 94వ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సినారే కుటుంబ సభ్యులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా అఫ్సర్‌కు శాలువా కప్పి,మెమొంటోతో పాటు పాతికవేల రూపాయల నగదు, ప్రశంసా పత్రాన్ని కూడా అందజేశారు. ఈ సందర్భంగా సినారేతో తనకున్న అనుబంధాన్ని అఫ్సర్ గుర్తు చేసుకున్నారు.ఆధునిక కవిత్వం..పరిణామాలపై ప్రసంగిస్తూ ఈ తరం కవులు అద్భుతంగా రాస్తున్నారన్నారు.ఈ సందర్భంగా కవులు పసునూరి శ్రీధర్‌బాబు,శ్రీనివాసగౌడ్ కవిత్వంలో చక్కని ప్రయోగాలు చేస్తున్నారని వారి పేర్లను ఉదహరించారు. సినారే గురించి చెబుతూ ఆధునిక కవిత్వంలో సినారే అనేక ప్రయోగాలు చేశారన్నారు. పాఠం కంటే పాటకు ప్రాధాన్యత ఇచ్చేవారన్న విమర్శలను సినారే ఎదుర్కొన్నారన్న అఫ్సర్ వ్యాఖ్యలను ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ఖండించారు.

## భారీ ఎన్‌కౌంటర్

**(1వపేజీ తరువాయి)**కొనసాగిన ఈ ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మరణించారు.

**హతమైన మావోయిస్టులు వీరే..**

బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ మాట్లాడుతూ మరణించిన మావోయిస్టులు దక్షిణ సబ్ జోనల్ బ్యూరోకు చెందినవారని వెల్లడించారు. వారి వివరాలు, వారిపై ప్రకటించిన బహుమతులు ఇలా ఉన్నాయి. మరణించిన వారిలో ముగ్గురు ఏరియా కమిటీ సభ్యులు,ఒక పార్టీ సభ్యుడు ఉన్నారు, ఇది మావోయిస్టు సంస్థకు పెద్ద దెబ్బ అని చెప్పవచ్చు.

హుంగా, (ఏరియా కమిటీ సభ్యుడు): ప్లాటూన్ నంబర్ 10, దక్షిణ సబ్ జోనల్ బ్యూరోకు చెందిన ఇతనిపై రూ.5 లక్షల బహుమతి ఉంది.

లక్కే, (ఏరియా కమిటీ సభ్యురాలు): ప్లాటూన్ నంబర్ 30, దక్షిణ సబ్ జోనల్ బ్యూరోకు చెందిన ఈమెపై రూ.5 లక్షల బహుమతి ఉంది.

భీమే, (ఏరియా కమిటీ సభ్యురాలు): దక్షిణ సబ్ జోనల్ బ్యూరోకు చెందిన ఈమెపై ?5 లక్షల బహుమతి ఉంది.

నిహాల్ అలియాస్ రాహుల్, పార్టీ సభ్యుడు: (సంతోష్, బ్యూరో కమ్యూనికేషన్ టీమ్ హెడ్ గార్డ్) ఇతనిపై రూ.2 లక్షల బహుమతి ఉంది.

**ఎన్‌కౌంటర్ స్థలంలో ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం**

ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో భద్రతా దళాలు విస్తృతమైన గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ సందర్భంగా భారీ మొత్తంలో ఆయుధాలు, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. వీటిలో ఒక ఎస్ఎల్ఆర్(సెల్ఫ్-లోడింగ్ రైఫిల్), ఒక (ఇండియన్ స్మాల్ ఆర్మ్స్ సిస్టమ్) రైఫిల్, ఒక 303 రైఫిల్, ఒక 12 బోర్ గన్ (బ్యారల్ గ్రెనేడ్ లాంచర్), సింగిల్ షాట్ ఆయుధాలు, భారీగా పేలుడు పదార్థాలు, నక్సల్ సంబంధిత ఇతర వస్తువులు ఉన్నాయి. ఈ ఆయుధాల స్వాధీనంతో నక్సలైట్ల కార్యకలాపాలకు మరింత అడ్డుకట్ట పడినట్లయింది.బస్తర్ రేంజ్ ఐజీ సుందర్రాజ్ మాట్లాడుతూ.. భద్రతా దళాలు 2024లో సాధించిన నిర్ణయాత్మక ముందంజను 2025లో కూడా కొనసాగిస్తున్నాయని తెలిపారు. బస్తర్ డివిజన్‌లో నిషేధిత, చట్టవిరుద్ధమైన మావోయిస్టు సంస్థకు వ్యతిరేకంగా ఆపరేషన్లు జరుగుతున్నాయన్నారు. జనవరి 2024 నుంచి జులై 2025 వరకు, మొత్తం 425 మంది మావోయిస్టులు ఎన్ కౌంటర్ లో హతమయ్యారు. ఇది భద్రతా దళాల ప్రభావవంతమైన వ్యూహం, సాహసోపేతమైన చర్యలు, ప్రజల మద్దతుకు స్పష్టమైన నిదర్శనమని ఆయన అన్నారు.

## హరిద్వార్‌లో విషాదం

**(1వపేజీ తరువాయి)**ఈ ఘటనలో గాయపడిన భక్తులలో కొందరి పరిస్థితి సీరియస్ గా ఉందని వైద్యులు తెలిపారు. దీంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మానసా దేవి ఆలయంలో తొక్కిసలాట జరిగి ఆరుగురు చనిపోయిన విషయాన్ని గర్వాల్ డివిజనల్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే ధ్రువీకరించారు. విషయం తెలిసిన వెంటనే ఆలయం వద్దకు బయలుదేరానని, ఘటనా స్థలాన్ని పరిశీలించాక ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

## బీజేపీ వైపుచూస్తున్న మల్లారెడ్డి

**(1వపేజీ తరువాయి)**విషయమై కొన్ని నెలలుగా తర్జనభర్జన పడుతున్నారని చెబుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సత్సంబంధాలు ఏర్పరుచుకునేలా ప్రయత్నాలు చేసినా, అవి ఫలించకపోవడంతో తదుపరి ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు చూస్తున్నట్లు తెలుస్తోంది. అయితే మల్లారెడ్డి బీజేపీ పెద్దలతో టచ్లోకి వెళ్లారా? లేక బీజేపీ పెద్దలే ఈ దిశగా చొరవ చూపారా? అన్నది మాత్రం కచ్చితంగా తెలియడం లేదు. కానీ, ఇదే సమయంలో బీజేపీ నేత, కేంద్ర మంత్రి బండి సంజయ్ తో మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి భేటీ కావడం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. మల్లారెడ్డితోపాటు ఆయన అల్లుడు కూడా ప్రస్తుతం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగా ఉండగా, ప్రీతిరెడ్డి బీజేపీ నేతలతో సమావేశమవడం రాజకీయ ప్రాధాన్యం ఉన్న విషయం అంటున్నారు. అంతేకాకుండా బీజేపీ జెండాలతో బండి సంజయ్, ప్రీతిరెడ్డి ఫ్లెక్సీలు ముద్రించడం కూడా చర్చకు దారితీస్తోంది. ప్రస్తుతానికి ప్రీతిరెడ్డికి ఏ పార్టీతో సంబంధం లేదు. కానీ, ఆమె బీజేపీ నాయకురాలిగా ఎలివేట్ అయ్యేలా ఆ ఫ్లెక్సీలు ముద్రించారని చెబుతున్నారు. ఇక మల్లారెడ్డి బీజేపీలోకి వెళ్లే క్రమంలోనే ముందుగా తన కోడలు ప్రీతిరెడ్డిని ఆ పార్టీకి దగ్గర చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో విద్యాసంస్థలు, ఇతర వ్యాపారాలు ఉన్న మల్లారెడ్డి ముందుగా కాంగ్రెస్ పార్టీలో చేరాలని భావించారు. అయితే గతంలో సీఎం రేవంత్ రెడ్డిపై ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో మల్లారెడ్డి చేరికకు సీఎం రేవంత్ రెడ్డి క్లియరెన్స్ ఇవ్వలేదని అంటున్నారు. నిజానికి రేవంత్ రెడ్డి, మల్లారెడ్డి టీడీపీలోనే రాజకీయాలు ప్రారంభించారు. అప్పటి నుంచే ఇద్దరి మధ్య గ్యాప్ ఉందని చెబుతారు. రాష్ట్ర విభజన తర్వాత రేవంత్ కాంగ్రెస్ లోకి వెళ్లగా మల్లారెడ్డి బీఆర్ఎస్ లో చేరారు. గులాబీ పార్టీలో మంత్రిగా పనిచేసిన మల్లారెడ్డి అప్పట్లో పీసీసీ చీఫ్ గా ఉన్న రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడేవారు. కొన్నిసార్లు వ్యక్తిగత విమర్శలకు వెళ్లడంతో ఇద్దరి మధ్య గ్యాప్ వచ్చిందని చెబుతున్నారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చెడిపోయిన సంబంధాలను తిరిగి పునరుద్ధరించేందుకు మల్లారెడ్డి విశ్వప్రయత్నాలు చేశారు. కానీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం చల్లారలేదని అంటున్నారు. దీంతో మల్లారెడ్డి రాజకీయ భవిష్యత్తు కోసం బీజేపీ వైపు చూస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

## 12వేల మంది ఉద్యోగులను తొలగించబోతున్న



**(1వపేజీ తరువాయి)**ఒకటి అని చెప్పిన కృతివాసన్.. ముఖ్యంగా ఇది మధ్య, సీనియర్ స్థాయి ఉద్యోగులపై ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. కొత్త టెక్నాలజీలను, ముఖ్యంగా TCS ఇంకా ఆపరేటింగ్ మోడల్ లో మార్పుల కారణంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని తెలిపారు. 'కొత్త సాంకేతికత కారణంగా పని చేసే విధానాలు మారుతున్నాయి.. మనం భవిష్యత్తుకు సిద్ధంగా, చురుగ్గా ఉండాల్సిన అవసరం ఉంది' అని ఆయన అన్నారు.కాగా, జూన్‌తో ముగిసిన తాజా త్రైమాసికంలో TCS ఉద్యోగుల సంఖ్య 6,13,000 గా ఉంది. దీని ప్రకారం 2 శాతం తగ్గింపు అంటే, దాదాపు 12,200 మందికి పైగా ఉద్యోగులను ఈ తాజా నిర్ణయం ప్రభావితం చేస్తుంది. 'బలమైన ముందుకు తీసుకెళ్లడానికి మేము తీసుకోవలసిన కష్టమైన నిర్ణయం ఇది' అని కృతివాసన్ అన్నారు. అందుకే ఈ ప్రక్రియను సాధ్యమైనంత మానవతాదృక్పథంతో చేయడానికి కంపెనీ కృషి చేస్తోందని చెప్పారు.

### ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువకుడి కోసం..

# కన్న బిడ్డను బస్టాండ్‌లో వదిలేసి వెళ్లిన తల్లి





**నల్లగొండ-నవభూమి:** ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువకుడి మోజులో పడిన ఓ మహిళ కన్న కొడుకునే కాదనుకుంది. ఇంట్లో నుంచి పారిపోయి వచ్చిన మహిళ.. ఐదేళ్ల కుమారుడిని అనాథగా బస్టాండ్‌లో వదిలేసి ప్రియుడితో వెళ్లిపోయింది. బిక్కుబిక్కుమంటూ బస్టాండ్‌లో ఏడుస్తూ కూర్చున్న చిన్నారిని స్థానికులు గమనించి ఆరా తీయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. నల్గొండ బస్టాండ్‌లో ఈ దారుణం జరిగింది.హైదరాబాద్‌కు చెందిన పాతికేళ్ల మహిళకు ఇన్‌స్టాగ్రామ్‌లో నల్గొండకు చెందిన ఓ యువకుడితో పరిచయం ఏర్పడింది. ఇన్‌స్టాగ్రామ్‌లో తరచూ చాటింగ్ చేసుకోవడం ద్వారా ఇద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. అది కాస్త ప్రేమగా మారింది. ఈ క్రమంలో ఇద్దరూ కలుసుకోవాలని అనుకున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఆ యువకుడిని కలవాలనే ఆశతో తన ఐదేళ్ల కొడుకును వెంటబెట్టుకుని నల్గొండకు వచ్చింది. బస్టాండ్‌లో దిగిన వెంటనే సదరు యువకుడికి ఫోన్ చేయడంతో బైక్‌పై వచ్చాడు. అక్కడకు వచ్చిన తర్వాత యువకుడు తన వెంటన రమ్మని బలవంతం చేశాడు. దీంతో అతనితోనే వెళ్లిపోవాలని సదరు మహిళ కూడా భావించింది. అయితే ఆమెకు కన్న బిడ్డనే అడ్డంకిగా కనిపించాడు. ప్రియుడి మోజులో పడిన ఆ మహిళ.. కన్నబిడ్డను దిక్కు లేని అనాథగా బస్టాండ్‌లో వదిలేసింది. బస్టాండ్‌లోని ఒక బెంచి మీద కూర్చోబెట్టి.. యువకుడి బైక్‌పై వెళ్లిపోయింది.అమ్మా అమ్మా అని బిక్కుబిక్కు మంటూ బస్టాండ్‌లో ఏడ్చుకుంటూ ఉండిపోయిన బిడ్డను గమనించిన తోటి ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆర్టీసీ సిబ్బంది నల్గొండ టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు చిన్నారి చెప్పిన వివరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. అక్కడి పరిసరాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ క్రమంలో ఓ యువకుడి బైక్‌పై మహిళ వెళ్లడం గమనించి.. ఆమె ఆచూకీని కనిపెట్టారు. ప్రేమ పేరుతో మహిళను తీసుకెళ్లిన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే మహిళ భర్తకు సమాచారం అందించి, బిడ్డను అప్పగించారు. మహిళకు కౌన్సిలింగ్ ఇచ్చి.. భర్త, కుమారుడితో వెళ్లాలని

# ఇంటి స్థలం లేని వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు..

### ఆగస్టు 15 వరకే ఛాన్స్..



**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణ రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గొప్ప ప్రయోజనం దక్కనుంది. ఇప్పటికే ఇంటి స్థలం ఉన్నవారికి ఈ పథకం కింద రూ.5 లక్షలు మంజూరు చేసిన ప్రభుత్వం.. ఇప్పుడు ఇంటి స్థలం లేని వారికి శుభవార్త చెప్పింది. ఈ లబ్ధిదారులను ఎల్2 కేటగిరీ కింద చేర్చి.. రెండో జాబితాలో వారికి ఇళ్లను కేటాయిస్తామని పేర్కొంది.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సంబంధించి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఒక కీలక ఆదేశం జారీ చేశారు. ఆగస్టు 15 లోగా వారికి అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సచివాలయంలో శనివారం ఉమ్మడి వరంగల్ జిల్లా సమగ్రాభివృద్ధిపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో భాగంగా.. ఇంటి స్థలాలు లేని అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, వారికి ఈ అసంపూర్తి డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఆగస్టు 15 లోగా కేటాయించాలని మంత్రి సూచించారు. ఈ అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను పూర్తి చేసుకోవడానికి ప్రభుత్వమే రూ.5 లక్షల వరకు ఆర్థిక సాయాన్ని అందిస్తుందని మంత్రి వెల్లడించారు. ఇది లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవడానికి గొప్ప ఊరటనిస్తుంది.

ముఖ్యంగా, డబుల్ బెడ్‌రూం ఇళ్లకు ఎప్పుడు దరఖాస్తు చేసుకున్నారన్నది ప్రధానం కాదని.. తాజా దరఖాస్తులను పరిశీలించి కేటాయింపులు చేయాలని మంత్రి కలెక్టర్లకు స్పష్టం చేశారు. ఈ నిర్ణయం పాత దరఖాస్తుదారులతో పాటు.. కొత్తగా అర్హత సాధించిన వారికీ ప్రయోజనం చేకూరుస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న తీరుకు ఇది ఒక నిదర్శనంగా నిలుస్తుంది.

ఈ పథకం అమలు ద్వారా రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుపేదలకు సొంతింటి కల నెరవేరుతుంది. ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నివసించే పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. సొంత ఇల్లు కలిగి ఉండటం అనేది ఒక ప్రాథమిక అవసరం కాబట్టి.. ఈ పథకం ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పును తీసుకువస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది.


ఇంటి నిర్మాణం పూర్తైన తర్వాత.. లబ్ధిదారులు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కూడా ఇది తోడ్పడుతుంది. ఇదిలా ఉండగా.. డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించిన తర్వాత.. వాటిని రెంట్ కి ఇచ్చే వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకునేందుకు రెడీ అయింది.

## రేషన్ కార్డు దారులకు శుభవార్త.. ఆరోగ్య శ్రీలో పేర్లు నమోదు.. అర్హులు వీరే..



**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణలో కొత్తగా రేషన్ కార్డులు పొందిన వారందరికీ ఆరోగ్యశ్రీ సదుపాయం అందించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రయత్నాలు మొదలుపెట్టింది. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా రేషన్ కార్డుల్లో పేరు నమోదైన ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ వర్తిస్తుందన్న విషయం తెలిసిందే. ఈ నిర్ణయం కొత్తగా అర్హత సాధించిన లక్షలాది మందికి ఆర్థికంగా ఎంతో ఆదుకుంటుంది.ఈ ఏడాది జనవరి 1 నాటికి రాష్ట్రంలో 89,95,282 రేషన్ కార్డులు ఉన్నాయి. వాటిలో 2.81 కోట్ల మంది సభ్యులుగా నమోదయ్యారు. వీరందరూ ఇప్పటికే ఆరోగ్యశ్రీ పోర్టల్‌తో అనుసంధానమై ఉన్నారు. ఇప్పుడు కొత్తగా రేషన్ కార్డులు అందుకున్న వారికి కూడా ఈ సౌకర్యం అందుతుంది. వీరందరికీ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులలో నిబంధనల ప్రకారం.. చికిత్సలు పొందే అవకాశం ఉంటుంది.జనవరి 26 నుండి రాష్ట్రంలో కొత్తగా రేషన్ కార్డుల పంపిణీ మొదలైంది. ఇప్పటివరకు సుమారు 6 లక్షల కంటే ఎక్కువ కొత్త రేషన్ కార్డులు జారీ అయ్యాయి. దీనితో రాష్ట్రంలో మొత్తం కార్డుల సంఖ్య 95,56,625 కు పెరిగింది. ఈ కొత్త కార్డుల్లో 3.10 కోట్ల మంది లబ్ధిదారులుగా నమోదయ్యారు. కొత్తగా చేరిన ఈ 30 లక్షల మంది అర్హుల వివరాలను ఆరోగ్యశ్రీ పోర్టల్‌లోకి నమోదు చేస్తున్నారు. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు అధికారులు ఈ చర్యలను వేగవంతం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 2023 డిసెంబర్ నుండి ఇప్పటివరకు 10.72 లక్షల మందికి ఆరోగ్యశ్రీ సేవలు అందించినట్లు మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. వైద్య సేవల బిల్లుల కింద ప్రభుత్వం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.1,590 కోట్లకు పైగా చెల్లించింది. సగటున 22 శాతం మేర చికిత్స ఖర్చులు పెరగడంతో పాటు.. ప్రతి నెలా ఆస్పత్రులకు బిల్లుల కింద రూ.100 కోట్ల వరకు చెల్లిస్తుండటంతో.. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్‌లో చేరడానికి ప్రైవేటు ఆస్పత్రులు కూడా ఆసక్తి చూపుతున్నాయని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం 461 ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులలో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఈ చర్యలు ప్రజలకు.. ముఖ్యంగా కొత్తగా అర్హత పొందిన వారికి, మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చాయి. ఆర్థిక భారాన్ని తగ్గించాయి. కొత్తగా రేషన్ కార్డులు వచ్చిన వారికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం, రూ.500 గ్యాస్ సిలిండర్ పథకాలకు కూడా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

# అస్త్ర సన్యాసం?



**(1వపేజీ తరువాయి)**ఓడిపోయారు. రాజంపేట తన సొంత ప్రాంతం అయినప్పటికీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కిరణ్ కుమా ర్ రెడ్డి అటువైపు చూడలేదు. దాదాపు 14 నెలలుగా ఆయన రాజంపేట నియోజకవర్గంలోని తన సొంత గ్రామానికి సైతం రాలేదని చెబుతున్నారు. ఎక్కువగా బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లోనే గడుపుతున్నట్లు సమాచారం. దాదాపు పదేళ్ల విశ్రాంతి రావడంతో ఇక రాజకీయాలు చేయడం కన్నా విరామం తీసుకోవడమే బెటర్ అన్న ఆలోచనకు వచ్చారని అంటున్నారు.కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన కిరణ్ కుమార్ రెడ్డి లోక్ సభ ఎన్నికల్లో ఓడిన తర్వాత బీజేపీ ద్వారా రాజ్యసభకు వెళ్లాలని ప్రయత్నించినట్లు చెబుతున్నారు. రాష్ట్రంలో కూటమి సర్కారు ఉండటంతో బీజేపీ పెద్దలు తనను రాజ్యసభకు ప్రమోట్ చేస్తారని కొద్దికాలం ఆయన తీవ్ర ప్రయత్నాలు చేశారన్న ప్రచారం జరిగింది. ఏపీ నుంచి కాకపోయినా పక్క రాష్ట్రం నుంచి అయినా అవకాశం వస్తుందన్న ఆలోచనలో ఆయన ఉండేవారని అంటున్నారు. రాష్ట్రంలో బీజేపీ ఎదగాలంటే తనలాంటి సీనియర్ల సేవలు అవసరమని భావించిన కిరణ్ కుమార్ రెడ్డి తనకు పదవి ఉంటే ప్రజల్లోకి వెళ్లడానికి బాగుంటుందని పార్టీలో ప్రతిపాదించారని చెబుతున్నారు. అయితే వైసీపీ నుంచి రాజీనామా చేసిన రాజ్యసభ సభ్యులను పార్టీలో చేర్చుకుని తిరిగి వారికే అవకాశం ఇచ్చిన బీజేపీ.. కిరణ్ విషయంలో ఎటూ తేల్చలేదని అంటున్నారు. దీంతో నిరాశ చెందిన ఆయన రాష్ట్రానికి కూడా రావడం మానేశారని అంటున్నారు. బీజేపీ అధ్యక్ష పదవిపైనా ప్రచారం కిరణ్ కుమార్ రెడ్డి సీనియార్టీ, ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం వల్ల ఆయనకు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కట్టబెడతారని కొద్దిరోజులు ప్రచారం జరిగింది. పురందేశ్వరి స్థానంలో కిరణ్ కు అవకాశం ఇస్తారని, ఆయన సామాజికవర్గాన్ని ఆకర్షించడంతోపాటు రాష్ట్రంలో బలపడేందుకు ఉపయోగపడుతుందని కిరణ్ అభ్యర్థిత్వంపై కమలం పార్టీ ఆసక్తిగా ఉందని ఆ మధ్య ప్రచారం జరిగింది. అయితే బీజేపీ పెద్దలు ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న వారికే అవకాశం ఇవ్వడంతో కిరణ్ కుమార్ రెడ్డి పేరు వెనక్కి వెళ్లింది. ఇలా బీజేపీలో తన ప్రయాణం సాఫీగా లేకపోవడం, క్షేత్రస్థాయి రాజకీయాలకు గ్యాప్ రావడంతో రాజకీయాల నుంచి విరమించుకోవడమే మంచిదన్న నిర్ణయానికి ఆయన వచ్చారని అంటున్నారు. అయితే ఆయన రాజకీయాల నుంచి విశ్రమించాలన్న ఆలోచనలో ఉన్నారన్న ప్రచారంపై స్నేహితులు, అనుచరులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రాజకీయాల్లో ఉన్న నేతలు 75, 80 ఏళ్ల వయసులోనూ పదవుల కోసం ప్రయత్నాలు చేస్తుంటే 64 ఏళ్ల వయసులోనే కిరణ్ కుమార్ రెడ్డి విరమించుకోవాలని నిర్ణయించుకోవడంపై ఆశ్చర్యం వ్యక్తమవుతోంది.

## బీజేపీతో విలీనం ఉత్తిదే!

**(1వపేజీ తరువాయి)**ప్రదర్శించడంతో పాటు, కేసీఆర్ నాయకత్వంపై తమకున్న విశ్వాసాన్ని చాటింది. ప్రజల కష్టాలను తీర్చడానికి బీఆర్ఎస్ ప్రభుత్వమే సరైనదని పరోక్షంగా ప్రజలకు సందేశం పంపారు. బీఆర్ఎస్ కేటీఆర్ ప్రకటనల్లో స్పష్టత, వ్యంగ్యం, రాజకీయ వ్యూహం మేళవించి ఉన్నాయి. ఇది బీఆర్ఎస్‌ను బీజేపీతో కలిపే అన్ని వదంతులకు చెక్ వేసినప్పటికీ, సీఎం రమేశ్ వ్యాఖ్యలపై సరైన స్పందన లేదు. ఆయన వ్యాఖ్యలను ఖండించలేదు. రాజకీయంగా మరింత లోతైన ప్రణాళికలలో భాగమా అనేది కాలమే చెప్పాలి. అయితే ప్రస్తుతం బీఆర్ఎస్ నాయకత్వం తమ సొంత బలంపైనే నడవాలనుకుంటోందనేది మాత్రం కేటీఆర్ వ్యాఖ్యల ద్వారా స్పష్టమైంది. ఈ పరిణామాలు తెలంగాణ రాజకీయాలను మరింత ఆసక్తికరంగా మార్చనున్నాయి.

## ఏపీకి మరో భారీ పరిశ్రమ

**(1వపేజీ తరువాయి)**కేటాయింపులు అందించనున్నారు. రోడ్ల విస్తరణ, రైల్వే కనెక్టివిటీ, ట్రాన్స్‌మిషన్ లైన్ల నిర్మాణం వంటి అంశాలపై కూడా ప్రభుత్వం దృష్టి సారించింది.

ఈ స్టీల్ ప్లాంట్ ప్రాజెక్ట్ ద్వారా ప్రత్యక్షంగా 5,000 మందికి.. పరోక్షంగా 25,000 మందికి పైగా ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఏపీ ప్రభుత్వం వెల్లడించింది. స్థానిక యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ ద్వారా ఉద్యోగావకాశాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.

ఈ మేరకు ప్రాజెక్ట్ విజయవంతంగా పూర్తి కావడానికి విద్యుత్, జలవనరులు, పరిశ్రమలు.. రెవెన్యూ, ఆర్థిక శాఖ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఏపీఐఐసీ వీసీ చైర్మన్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ ప్రాజెక్ట్ మానిటరింగ్ బాధ్యతలు చేపట్టనున్నారు. స్టీల్ ప్లాంట్ స్థాపనతో కడప జిల్లా పరిశ్రమల హబ్‌గా అభివృద్ధి చెందనుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సీమలో ఆర్థిక వృద్ధి, ఇన్వెస్ట్మెంట్ ల ఆకర్షణ, ఉపాధి సృష్టి వంటి రంగాల్లో మైలురాయిగా నిలుస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

## చర్చి ప్రాంగణంలో ఐసీస్ ఉగ్ర కాల్పులు

**(1వపేజీ తరువాయి)**ప్రాంగణంలో జరిపిన దాడుల్లో సుమారు 21 మంది మృతి చెందారు. తూర్పు కాంగో కోమాండాలోని ఓ క్యాథలిక్ చర్చి ప్రాంగణంలో అలైడ్ డెమోక్రటిక్ ఫోర్సెస్ (ఏడీఎఫ్) సభ్యులు తెల్లవారుజామున ఒంటిగంట సమయంలో కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో అనేక ఇళ్లు, షాపులు కూడా ధ్వంసమయ్యాయి. ఈ సందర్భంగా స్పందించిన పౌర సమాజ సమన్వయకర్త డైయుడోన్ దురంతబో... సాయుధ తిరుగుబాటుదారులు సుమారు 21 మందిని కాల్చిచంపారని.. అందులో మూడు మృతదేహాలు కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయని.. అనేక ఇళ్లు, దుకాణాలు దహనమయ్యాయని.. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇదే సమయంలో... ఈ ఘటన అత్యంత దారుణమని దురంతబో తెలిపారు. భద్రతా అధికారులు అంతా ఉన్న పట్టణంలో ఇలాంటి పరిస్థితి ఏర్పడటం నమ్మశక్యంగా లేదని.. ఈ పరిణామల నేపథ్యంలో ఎంతోమంది పౌరులు ఆ ప్రాంతం నుండి పారిపోవడం ప్రారంభించి బునియా వైపు వెళ్తున్నారని అన్నారు. మరోవైపు ఈ దాడులను కాంగో సైనిక ప్రతినిధి ఒకరు ధ్రువీకరించారు. కాగా... ఇస్లామిక్ స్టేట్ తో ముడిపడి ఉన్న అలైడ్ డెమోక్రటిక్ ఫోర్సెస్ తిరుగుబాటు సంస్థ.. ఉగాండా, కాంగో సరిహద్దు ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో సామాన్య ప్రజలే లక్ష్యంగా అనేక సంవత్సరాలుగా దాడులకు పాల్పడుతోంది. ఈ విధంగా... 2013 నుంచి ఇప్పటివరకు సుమారు 6,000 మందిని వీరు బలిగొన్నట్లు నివేదికలు ఉన్నాయి.

## రెచ్చిపోయిన సైకో

**(1వపేజీ తరువాయి)**వాల్‌మార్ట్ సూపర్ మార్కెట్‌లో సైకో దారుణానికి ఒడిగట్టాడు. సరుకులు కొనడానికి వచ్చిన వారిపై కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో మొత్తం 11 మంది గాయపడ్డారు. వారిలో ఆరుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇక, ఈ సంఘటన అమెరికాలోని మిచిగాన్ రాష్ట్రంలో శనివారం చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. ట్రావర్స్ సిటీలో వాల్‌మార్ట్ సూపర్ మార్కెట్ ఉంది. శనివారం పెద్ద సంఖ్యలో జనం మార్కెట్‌కు వచ్చారు.

తమకు అవసరమైన సరుకులు తీసుకోవటంలో బిజీ అయిపోయారు. ఇలాంటి సమయంలో.. ఏమైందో ఏమో తెలీదు కానీ, ఓ దుర్మార్గుడు దారుణానికి ఒడిగట్టాడు. కత్తితో అక్కడున్న వారిపై దాడి చేయటం మొదలెట్టాడు. చేతికి అందిన వారిపై విచక్షణా రహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. దాడి అనంతరం సైకో అక్కడినుంచి పారిపోయాడు. ఇక, గాయపడ్డ వారిని అక్కడే ఉన్న వారు వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు.ప్రస్తుతం వారు నార్తర్న్ మిచిగాన్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయపడ్డ వారిలో ఆరుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడ్ని అతి తక్కువ సమయంలోనే అదుపులోకి తీసుకున్నారు. అతడ్ని విచారిస్తున్నారు. ట్రావర్స్ సిటీకి 25 మైళ్ల దూరంలో ఉండే హానర్ ప్రాంతానికి చెందిన 36 ఏళ్ల టిఫనీ డిఫెల్ సంఘటనపై మాట్లాడుతూ.. 'దారుణం జరిగిన సమయంలో నేను పార్కింగ్ ప్లేస్‌లో ఉన్నా. అది చాలా భయంకరమైన పరిస్థితి. నేను, నా సోదరి గజగజ వణికిపోయాము' అంటూ వాపోయింది.

## సరోగసి పేరుతో చైల్డ్ ట్రాఫికింగ్


**(1వపేజీ తరువాయి)**రూపాయలిచ్చి కొనుగోలు చేసిన శిశువును 40లక్షలకు విక్రయించినట్టు తెలిపారు. సరోగసి ద్వారా బిడ్డలను పుట్టిస్తున్నానని చెప్పి చైల్డ్ ట్రాఫికింగ్ కు పాల్పడుతున్నారని డిసిపి రష్మీ వెల్లడించారు. లైసెన్సు లేకుండానే చికిత్సలు చేస్తున్నట్టు గుర్తించామని పేర్కొన్నారు.

పోర్న్ వీడియోలు చూపించి వీర్య సేకరణ.. టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్లో దారుణాలు

పోర్న్ వీడియోలు చూపించి వీర్య సేకరణ.. టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్లో దారుణాలు..8మంది ముఖ్య నిందితులు అరెస్ట్..చిన్న పిల్లలను కొనుగోలు చేసి, సరోగసి ద్వారా పుట్టిన బిడ్డలని నమ్మిస్తూ డాక్టర్ నమ్రత మోసం చేస్తుందని పేర్కొన్నారు. గతంలో డాక్టర్ నమ్రతా పై విశాఖపట్నం టూ టౌన్ పిఎస్, మహారాణిపేట పిఎస్, గోపాలపురం పిఎస్, గుంటూరులోని కొత్తపేట పిఎస్ లలో కేసులు నమోదయ్యాయని గుర్తించారు. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ రిజిస్ట్రేషన్ ను రద్దు చేసినట్టుగా తెలిపారు. అయినప్పటికీ నమ్రత మరో సర్టిఫైడ్ డాక్టర్ సూరి పేరును ఉపయోగించి ఈ దందా నిర్వహిస్తున్నట్లుగా డిసిపి రష్మీ పెరుమాళ్ వెల్లడించారు. ఈ కేసులో 8 మంది ముఖ్య నిందితులను అరెస్ట్ చేసినట్టుగా తెలిపారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్
సోమవారం
28 । జులై । 2025

# ట్రిపుల్ మర్డర్ షాక్.. తల్లిదండ్రులు, సోదరిని గొడ్డలితో నరికి చంపిన వ్యక్తి




**లక్నో-నవభూమి:** ఒక వ్యక్తి తన తల్లిదండ్రులు, సోదరిని గొడ్డలితో నరికి చంపాడు. భూ వివాదం కారణంగా ఈ హత్యలకు పాల్పడ్డాడు. ట్రిపుల్ మర్డర్ విషయం తెలుసుకుని స్థానికులు షాక్ అయ్యారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం దిలియా గ్రామంలో దారుణ హత్యలు జరిగాయి. భూ వివాదం కారణంగా ఒక వ్యక్తి తన



తల్లిదండ్రులు, సోదరిని గొడ్డలితో నరికి చంపాడు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయాడు.కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ముగ్గురి మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్రిపుల్ మర్డర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుడ్ని అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు. మరోవైపు ట్రిపుల్ మర్డర్ సంఘటన స్థానికంగా కలకలం రేపింది.

# ఆపరేషన్ సింధూర్‌పై రేపటి నుంచి లోక్‌సభలో చర్చ




**న్యూఢిల్లీ-నవభూమి:** సోమవారం (జూలై 28) నుంచి ఆపరేషన్ సింధూర్ పై చర్చ జరగనుంది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తాజాగా వెల్లడించాయి. లోక్‌సభలో ఆపరేషన్ సింధూర్‌పై చర్చ కోసం కేంద్రం ఏకంగా 16 గంటల సమయం కేటాయించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో ఈ చర్చ జరగనుంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చర్చను ప్రారంభించనున్నారు.రాజ్యసభలో కూడా ఆపరేషన్ సింధూర్‌పై చర్చ జరగనుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. రాజ్యసభలో జూలై 29 నుంచి 9 గంటలపాటు దీనిపై చర్చ జరుపనున్నట్లు వెల్లడించింది. రెండు సభల్లోనూ చర్చకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమాధానం ఇస్తారు. కాగా ఆపరేషన్ సింధూర్‌పై చర్చకు విపక్షాలు ఎప్పటి నుంచో పట్టుపడుతున్నాయి. భారత్, పాక్ మధ్య తానే కాల్పుల విరమణ ఒప్పందం కుదిర్చానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే కామెంట్స్ చేస్తుండటంపై కేంద్ర జవాబుచెప్పాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తున్నారు.ఈ నేపథ్యంలో రేపు లోక్‌సభ సమావేశాలు వాడీవేడిగా జరిగే అవకాశం ఉంది. కాగా ఏప్రిల్ 22న ఉగ్రవాదులు జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో టూరిస్టులపై కాల్పులు జరిపి 26 మందిని దారుణంగా చంపేశారు. దాంతో ఈ దాడికి ప్రతీకారంగా భారత్.. ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసింది.

# 13 ఏళ్ల తర్వాత.. తొలిసారి మాతోశ్రీలోకి అడుగుపెట్టిన రాజ్ ఠాక్రే



**ముంబై-నవభూమి:** మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) చీఫ్ రాజ్ ఠాక్రే 13 ఏళ్ల తర్వాత ఆదివారం తొలిసారి ముంబైలోని మాతోశ్రీలోకి అడుగుపెట్టారు. శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. సోదరులైన ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రేలు బాలాసాహెబ్ చిత్రం ముందు ఫొటో దిగారు. 'నా అన్నయ్య శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే పుట్టినరోజు సందర్భంగా, దివంగత గౌరవనీయ బాలాసాహెబ్ ఠాక్రే నివాసం అయిన మాతోశ్రీని సందర్శించా. నా శుభాకాంక్షలు తెలియజేశా' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. ఎంఎస్ఎస్ నేతలు బాలా నందగావ్కర్, నితిన్ సర్దేశాయ్ కూడా రాజ్ ఠాక్రే వెంట ఉన్నారు.

కాగా, రాజకీయ విభేదాల కారణంగా 2006లో మాతోశ్రీని రాజ్ ఠాక్రే వీడారు. ఆ తర్వాత మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) పార్టీని ఏర్పాటు చేశారు. 2012లో బాలాసాహెబ్ ఠాక్రే మరణించినప్పుడు చివరిసారి మాతోశ్రీకి ఆయన వచ్చారు. 13 ఏళ్ల తర్వాత తొలిసారి మాతోశ్రీని ఆయన సందర్శించారు.మరోవైపు మహారాష్ట్రలోని ప్రాథమిక స్కూళ్లలో తప్పనిసరిగా హిందీ భాషను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం వివాదానికి దారి తీసింది. ఈ నేపథ్యంలో మరాఠీ గుర్తింపు కోసం పోరాటంలో భాగంగా ఉద్ధవ్, రాజ్ ఠాక్రేలు రెండు దశాబ్దాల తర్వాత తొలిసారి ఒకే రాజకీయ వేదికపైకి వచ్చారు. వర్లిలో జరిగిన విజయోత్సవ ర్యాలీలో కలిసి ప్రసంగించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని వారిద్దరూ నిర్ణయించారు.

# గుజరాత్‌లో భారీ వర్షాలు.. ఇళ్లలోకి వరదనీరు



**అహ్మదాబాద్-నవభూమి:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం ప్రభావంతో రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు గుజరాత్‌లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. అహ్మదాబాద్ , పటాన్‌లోని సిధ్‌పూర్ పట్టణాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో వరదలు పోటెత్తాయి.వరద చేరడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. దాంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మరోవైపు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు ప్రవహించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరదలు, ఈదురుగాలుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు, టెలీకమ్యూనికేషన్‌కు అంతరాయం ఏర్పడింది.

# గ్యాస్ మెకానిక్‌గా నటించిన వ్యక్తి.. ప్రొఫెసర్ భార్యపై అత్యాచార యత్నం




**భువనేశ్వర్-నవభూమి:** ఒక వ్యక్తి గ్యాస్ మెకానిక్‌గా నటించాడు. యూనివర్సిటీలోని క్వాటర్స్‌లోకి వచ్చాడు. గ్యాస్ సిలిండర్ తనిఖీ పేరుతో ప్రొఫెసర్ ఇంట్లోకి ప్రవేశించాడు. ఒంటరిగా ఉన్న ప్రొఫెసర్ భార్యపై అత్యాచారానికి ప్రయత్నించాడు. బీజేపీ పాలిత ఒడిశాలో ఈ సంఘటన జరిగింది. శనివారం మధ్యాహ్నం బాలాసోర్ జిల్లాలోని ఫకీర్ మోహన్ విశ్వవిద్యాలయంలోని క్వాటర్స్‌లోకి ఒక వ్యక్తి ప్రవేశించాడు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇంటికి వెళ్లి డోర్ బెల్ నొక్కాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న ప్రొఫెసర్ భార్య తలుపు తెరిచింది.

కాగా, ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ చెకప్ కోసం వచ్చినట్లు ఆ వ్యక్తి చెప్పాడు. ఇంట్లోకి ప్రవేశించిన తర్వాత మెయిన్ డోర్ లాక్ చేశాడు. ప్రొఫెసర్ భార్యపై అత్యాచారానికి యత్నించాడు. అతడి బారి నుంచి తప్పించుకున్న ఆ మహిళ మరో గదిలోకి వెళ్లి డోర్ లాక్ చేసింది. తన భర్తకు ఫోన్ చేసి ఈ విషయం చెప్పింది. అలాగే సహాయం కోసం కేకలు వేసింది.మరోవైపు వర్సిటీ క్వాటర్స్ గేటు వద్ద ఉన్న భద్రతా సిబ్బంది అలెర్ట్ అయ్యారు. ఆ ఇంటికి చేరుకున్నారు. పారిపోయేందుకు ప్రయత్నించిన ఆ వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నీలగిరి ప్రాంతంలో నివసించే శంకర్ పాత్రగా నిందితుడ్ని గుర్తించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు. కాగా, ఆ యూనివర్సిటీ ప్రాంగణంలో అధికారిక గృహాలతో పాటు లేడీ హాస్టల్స్ కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ సంఘటన కలకలం రేపింది.

# పెళ్లికి ముందు హెచ్ఐవీ టెస్ట్ తప్పనిసరి.. రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం




**మేఘాలయ-నవభూమి:** పెళ్లికి ముందు హెచ్ఐవీ/ ఎయిడ్స్ పరీక్షలను తప్పనిసరి చేసే కొత్త చట్టాన్ని మేఘాలయ తీసుకురానుంది దేశంలో మొదటిసారిగా ఈ చట్టాన్ని గోవా అమల్లోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. తమ రాష్ట్రంలోనూ తీసుకొస్తున్నట్టు మేఘాలయ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి మాజెల్ అంపైన్ లైంగ్డో ప్రకటించారు. ఇప్పటికే గోవాలో అమల్లో ఉన్న ఈ విధానం మేఘాలయలో కూడా ప్రయోజనకరంగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. మంత్రి లైంగ్డో మీడియాతో మాట్లాడుతూ.. "గోవా తరహాలో మేం కూడా పెళ్లికి ముందు హెచ్ఐవీ/ ఎయిడ్స్ పరీక్షను తప్పనిసరి చేసే చట్టాన్ని తీసుకొస్తున్నాం... ఇది మా సమాజాలకు ఎంతో మేలుచేస్తుంది" అని అన్నారు. ఇక, ప్రపంచ వ్యాప్తంగా హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాప్తి ఆందోళన కలిగిస్తోంది. ఈ మహమ్మారి నియంత్రణకు ఇప్పటి వరకూ ఎటువంటి టీకాలు, ఔషధాలు అందుబాటులో లేనప్పటికీ నివారణే ముఖ్యమని వైద్యులు, నిపుణులు సూచిస్తున్నారు. ఏటా ప్రపంచవ్యాప్తంగా ఎయిడ్స్‌తో 4 కోట్ల మరణాలు సంభవిస్తున్నాయి.రాష్ట్రంలో హెచ్ఐవీ వ్యాప్తి అత్యంత ఆందోళన కలిగిస్తోందని పేర్కొంటూ ఇటీవల మేఘాలయ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఎంఏసీఎస్) నివేదిక హెచ్చరించింది. ఈ నేపథ్యంలో పెళ్లికి ముందు యువతీయువకులు హెచ్ఐవీ పరీక్షలు తప్పనిసరిగా చేసుకునేలా చట్టంపై నిర్ణయం తీసుకున్నట్టు ఆమె తెలిపారు. ముఖ్యంగా తూర్పు ఖాసీ హిల్స్ జిల్లాలో గతేడాది 3,432 హెచ్ఐవీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి, ఇది ముందు సంవత్సరంతో పోల్చితే రెట్టింపు. వీరిలో కేవలం 1,581 మంది మాత్రమే యాంటీ రెట్రోవైరల్ థెరపీ (ఏఆర్టీ) చికిత్స పొందుతున్నారని మంత్రి లైంగ్డో వెల్లడించారు. హెచ్ఐవీ ఎయిడ్స్ రావడానికిగల కారణాలుమేఘాలయ డిప్యూటీ సీఎం ప్రెస్టోన్ త్యిన్సోంగ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించి.. హెచ్ఐవీ/ ఎయిడ్స్‌పై సమగ్ర విధానం రూపొందించాలని నిర్ణయించారు. ఆరోగ్య శాఖకు దీనిపై క్యాబినెట్ నోట్ తయారు చేయాలని సూచించారని మంత్రి తెలిపారు. "రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా అధికారులు, వైద్య నిపుణులతో చర్చలు జరిపి, అక్కడి పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక వ్యూహాలు రూపొందించనున్నాం.. జైంతియా హిల్స్ ప్రాంతంలో అత్యధిక కేసులు ఉన్నాయ" అని మంత్రి వివరించారు. కాగా, ఇటీవల దేశంలో హెచ్ఐవీ బాధితుల సంఖ్యను తెలుసుకోడానిక ప్రోగ్రామాటిక్ మ్యాపింగ్ పాపులేషన్ సైజ్ అండ్ ఎస్టిమేషన్ (పీఎంపీఎస్ఈ) సర్వేలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి.

హెచ్ఐవీ పరీక్షలు చేసుకుని.. పాజిటివ్‌గా నిర్ధారణ అయినవారిని తప్పకుండా చికిత్స వ్యవస్థలోకి తీసుకురావాలి...సరైన రీతిలో ఈ వ్యాధికి చికిత్స తీసుకుంటే మరణముప్పు ఉండదని మంత్రి స్పష్టం చేశారు. ఎంఏసీఎస్ నివేదిక ప్రకారం.. అరక్షిత లైంగిక సంబంధాలే రాష్ట్రంలో హెచ్ఐవీ వ్యాప్తికి ప్రధాన కారణమని వెల్లడించింది.

# హరిద్వార్ ఆలయంలో తొక్కిసలాటకు కారణం ఏంటి?




**హరిద్వార్-నవభూమి:** ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ మానసా దేవి ఆలయం మెట్ల మార్గంలో ఆదివారం ఉదయం జరిగిన తొక్కిసలాటలో 8 మంది భక్తులు ప్రాణాలు కోల్పోగా.., మరో 34 మంది గాయపడ్డారు. ప్రమాదంలో 8 మంది చనిపోయినట్టు హరిద్వార్ జిల్లా కలెక్టర్ మయూర్ దిక్షిత్ ధ్రువీకరించారు. గాయపడినవారిలో మరో ఇద్దరు భక్తుల పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని మెరుగైన వైద్యం కోసం ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. మిగతావారికి జిల్లా ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోంది. క్షతగాత్రుల్లో 20 మంది పురుషులు, 8 మంది మహిళలు, ఏడుగురు చిన్నారులు ఉన్నారు. శ్రావణమాసం నేపథ్యంలో ఉత్తరాదిలో ఆలయాలను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుంటారు.

వప్రాథమిక సమాచారం ప్రకారం.. ఆలయ మెట్ల సమీపంలో ఓ ఓవర్‌హెడ్ విద్యుత్ వైర్ తెగి నడకదారిపై పడినట్లు ఒక పుకారు వ్యాపించడంతో గందరగోళం, ఆందోళన నెలకొని తొక్కిసలాటకు దారితీసింది. విద్యుత్ వైర్ తెగిపడి విద్యుదాఘాతం జరిగిందా? లేక కేవలం పుకారేనా? అన్న విషయంపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే, ఒకరు మాత్రమే కరెంట్ షాక్‌కు గురై కాలిన గాయాలతో బాధపడుతున్నట్టు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. మిగతావారంతా తొక్కిసలాట వల్లే గాయపడ్డారు. శ్రావణమాసంలో కన్వర్ యాత్రికులు పవిత్ర జలాలను తీసుకెళ్లడానికి హరిద్వార్‌కు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఈ క్రమంలోనే మానసా దేవి దర్శనం కోసం పోటెత్తారు.హరిద్వార్ నగర పోలీస్ స్టేషన్ ఇంఛార్జ్ రితేశ్ సహా మాట్లాడుతూ.. 'కరెంట్ తీగ పడిన దృశ్యం కనిపించగానే ఒక్కసారిగా జనాలు పరుగులు తీయడంతో తొక్కిసలాట జరిగింది' అని వివరించారు. మరోవైపు, ఈ దుర్ఘటన అనంతరం ఉత్తరాఖండ్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ మానసా దేవి ఆలయ పరిసరాల్లోని అన్ని విద్యుత్ ప్యానెల్లు, తీగలను తనిఖీలు నిర్వహించింది. యూపీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ.. 'విద్యుత్ తీగ తెగిపడిందనేది తప్పుడు సమాచారం.. మా విద్యుత్ లైన్లు అన్నీ పూర్తిగా ఇన్సులేట్‌తో ఉన్నాయి... ఎక్కడా ఓపెన్ వైర్లు లేవు.. విద్యుత్ షాక్ వల్ల ఎవ్వరూ గాయపడలేదు. రద్దీ, నియంత్రణ లోపం వల్లే ఈ విషాదకర సంఘటన జరిగినట్టు కనిపిస్తోంది' అని పేర్కొన్నారు.

ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఈ ఘటనపై స్పందిస్తూ.. "హరిద్వార్ మానసా దేవి ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటన అత్యంత బాధాకరం. ఎస్డీఆర్ఎఫ్, స్థానిక పోలీసులు, ఇతర రెస్క్యూ బృందాలు అక్కడ సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. జిల్లా అధికార యంత్రాంగంతో నిరంతరం మాట్లాడుతూ పరిస్థితిని తెలుసుకుంటున్నాం... క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను" అని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

# ప్రియుడితో కలిసి భర్తను చంపించిన భార్య..

## పోలీసులకు పట్టించిన బాటిల్ మూత, చెప్పు..



**బెంగళూరు-నవభూమి:** దక్షిణ బెంగళూరు జిల్లాలోని కన్వా డ్యామ్ సమీపంలోని ఓ నిర్మానుష్య ప్రదేశం.. ఓ మృతదేహం నెలపై పడి ఉంది. దానికి కాస్త దూరంలో కారు.. మృతదేహం పక్కనే ఓ ఖాళీ పాయిజన్ బాటిల్.. శవం వద్ద విలపిస్తున్న మృతుడి ఇల్లాలు.. నన్ను అన్యాయం చేసి అప్పుడే వెళ్లిపోయావా అంటూ ఆమె ఏడుస్తున్న వైనం అక్కడి వారిని కంటతడి పెట్టిస్తోంది. అతనెవరో ఆత్మహత్య చేసుకుని చనిపోయాడట, ఆ ఇల్లాలుకు ఎంత కష్టమొచ్చింది గుమికూడిన జనంలో నుంచి వినిపిస్తున్న మాటలు.. అంతలోనే పోలీస్ జీప్ అక్కడికి వచ్చి ఆగింది. పోలీస్ జీపులో నుంచి ఇన్‌స్పెక్టర్ బీకే ప్రకాష్, ఎస్ఐ సహానా పాటిల్ కిందకు దిగారు. సరాసరి మృతదేహం వద్దకు చేరుకున్నారు. ఆ తర్వాత చనిపోయిన వ్యక్తిని భార్యను ఒకే ఒక ముఖ్యమైన ప్రశ్న అడిగారు.. " పాయిజన్ బాటిల్ క్యాప్ (మూత) ఎక్కడా?" అని..మృతదేహం చుట్టుపక్కల ఎక్కడా పాయిజన్ బాటిల్ మూత కనిపించలేదు.. ఒకవేళ అతను విషం తాగి చనిపోయాడని అనుకుంటే.. పక్కనే పాయిజన్ బాటిల్ మూత ఉండాలి కదా.. పోలీసుల ప్రశ్న ప్లస్ అనుమానం ఇదీ.. అయితే పోలీసుల ప్రశ్నకు మృతుడి భార్యతో పాటుగా అక్కడున్న వారెవరి వద్దా సమాధానం లేదు. దీంతో చుట్టూ నిశ్శబ్దం అలుముకుంది.. పోలీసుల మదిలో అనుమానం బీజం మొలకెత్తింది. దీనికి తోడు మృతుడి కాలుకి ఒకే ఒక చెప్పు ఉండటం పోలీసులు గుర్తించారు. ఇది కూడా వారిలో అనేక సందేహాలు రేకెత్తించింది. ఒకవేళ ఎవరైనా ఇతన్ని చంపారని అనుకుంటే.. ఒక్క చెప్పుతోనే ఎందుకు చంపుతారు? అనే ప్రశ్న పోలీసుల మెదళ్లలో మొదలైంది.చనిపోయిన వ్యక్తి పేరు లోకేష్ కుమార్. వయసు 45 ఏళ్లు. కృష్ణపురదొడ్డి గ్రామానికి చెందినవాడు. మకాలీ గ్రామపంచాయతీ మాజీ ప్రెసిడెంట్ కూడా. అతనికి రెండు చికెన్ షాపులు ఉన్నాయి. ఒకటి చన్నపట్నలో ఉంటే మరొకటి సుంకదకట్టెలో ఉంటుంది. లోకేష్ కుమార్ భార్య పేరు చంద్రకళ.. గ్రామ పంచాయతీ మెంబర్‌గా పనిచేస్తున్నారు. చనిపోయిన భర్త లోకేష్ కుమార్‌ను చూసి గుండెలు పగిలేలా రోదిస్తోంది చంద్రకళ.ఒక రోజు తర్వాత.. జూన్ 24వ తేదీ.. చంద్రకళ చన్నపట్నలో ఒక ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ విలేకర్ల సమావేశంలో ఆమె తన భర్తను తలుచుకుని గుండెలు పగిలేలా విలపించారు. ఇంతలోనే షాకింగ్ న్యూస్.. చనిపోయిన లోకేష్ కుమార్ కుటుంబం పోలీసులను ఆశ్రయించింది.. చంద్రకళకు వేరొకరితో సంబంధం ఉందనే ఆరోపణలు చేస్తూ..పోలీసులను ఆశ్రయించింది. ఈ విషయాన్ని లోకేష్ కుమార్ ఇటీవలే కనిపెట్టాడని అతని కుటుంబం పోలీసులకు తెలియజేసింది. దీంతో కథ మరో మలుపు తిరిగింది. భర్త చనిపోయాడని విలపిస్తున్న భార్య.. ఆ భార్యపై అత్తింటి కుటుంబం ఆరోపణలు.. పోలీసుల అడుగులు ఎటువైపు?పోస్టుమార్టం నివేదిక.. విస్తుపోయే విషయాలు..

అయితే ఈలోపే పోలీసుల చేతికి పోస్టుమార్టం నివేదిక అందింది. అందులో విషయాలు పోలీసులను షాక్‌కు గురిచేశాయి. చనిపోయింది పాయిజన్ కారణంగానే అని పోస్టుమార్టం నివేదిక తేల్చింది. విషం తాగటంతోనే చనిపోయినప్పటికీ.. తాగిన తీరుపైనే పోస్టుమార్టం నివేదికలో అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆత్మహత్య చేసుకోవాలని విషం తాగినట్లైతే.. విషం నేరుగా కడుపులోకి వెళ్తుంది కానీ.. లోకేష్ కుమార్ విషయంలో అలా జరగలేదు. విషంలో ఎక్కువ భాగంగా ఛాతీ వద్దే ఉండిపోయింది. దీంతో లోకేష్ కుమార్‌తో ఎవరైనా బలవంతంగా విషం తాగించారా అనే అనుమానాలు పోలీసులలో మొదలయ్యాయి. దీంతో మరోసారి వేరే ప్రైవేట్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహిస్తే.. అక్కడ కూడా ఇవే ఫలితాలు వచ్చాయి. "లోకేష్ స్వచ్ఛందంగా విషాన్ని మింగి ఉండవచ్చు లేదా బలవంతంగా తీసుకుని ఉండొచ్చు" అంటూ పోస్టుమార్టం నివేదిక వచ్చింది.

# రేవ్ పార్టీపై పోలీసులు రైడ్.. మాజీ మంత్రి అల్లుడుతో పాటు పలువురు అరెస్ట్



**ముంబై-నవభూమి:** రేవ్ పార్టీపై పోలీసులు రైడ్ చేశారు. మాజీ మంత్రి అల్లుడుతో పాటు పలువురిని అరెస్ట్ చేశారు. డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. అయితే దీని వెనుక రాజకీయ దురుద్దేశం ఉన్నదా? అన్నది దర్యాప్తు చేయాలని ఆ మాజీ మంత్రి డిమాండ్ చేశారు. మహారాష్ట్రలోని పూణేలో ఈ సంఘటన జరిగింది. ఖరడి ప్రాంతంలోని స్టూడియో అపార్ట్‌మెంట్‌లో రేవ్ పార్టీ జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో క్రైమ్ బ్రాంచ్ పోలీసులు రైడ్ చేశారు. మద్యం, గంజాయి, హుక్కా వంటి మాదకద్రవ్యాల పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు మహిళలు, ఐదుగురు పురుషులతో సహా ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు.కాగా, మహారాష్ట్ర మాజీ మంత్రి, ఎన్సీపీ (ఎస్పీ) సీనియర్ నేత ఏక్‌నాథ్ ఖడ్సే అల్లుడు ప్రాంజల్ ఖేవాల్కర్ కూడా రేవ్ పార్టీలో అరెస్టైన వారిలో ఉన్నారు. ఏక్‌నాథ్ ఖడ్సే కుమార్తె రోహిణి ఖడ్సే ప్రతిపక్ష ఎన్సీపీ (ఎస్పీ) మహిళా విభాగానికి రాష్ట్ర అధ్యక్షురాలు. ఈ నేపథ్యంలో పోలీసుల రైడ్ రాజకీయంగా కలకలం రేపింది. పోలీస్ చర్య వెనుక రాజకీయ ఉద్దేశం ఉన్నదా? అన్నది దర్యాప్తు చేయాలని మాజీ మంత్రి ఏక్‌నాథ్ ఖడ్సే డిమాండ్ చేశారు. అయితే ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే వారికి ఈ దాడి ఒక సందేశమని శివసేన (యూబీటీ) ఉప నాయకురాలు సుష్మా అంధారే విమర్శించారు.

# బ్రిటిష్ విస్కీకి అతిపెద్ద మార్కెట్‌గా భారత్.. ఏటా 22కోట్ల లీటర్లు తాగేస్తున్నారు..!



**లండన్-నవభూమి:** బ్రిటిష్ విస్కీకి ప్రపంచంలోనే అతిపెద్ద వినియోగదారు మార్కెట్‌గా భారత్ మారింది. స్కాచ్ విస్కీ అసోసియేషన్ అండ్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్రిటిష్ ఇండస్ట్రీ డేటా ప్రకారం.. భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద విస్కీ వినియోగ దేశంగా నిలిచింది. ప్రతి సంవత్సరం 220 మిలియన్ (22కోట్లు) లీటర్లకుపైగా విస్కీని వినియోగిస్తుంది. యూకే నుంచి భారత్ ప్రతి సంవత్సరం దాదాపు రూ.13వేలకోట్ల విలువైన జానీ వాకర్, చివాస్ రీగల్, బాలంటైన్స్, గ్లెన్‌ఫిడిచ్, ది మకాల్లన్ వంటి ప్రీమియం, ప్రామాణిక స్కాచ్ బ్రాండ్‌లను దిగుమతి చేసుకుంటుంది. స్కాచ్ విస్కీపై 150శాతం దిగుమతి సుంకాన్ని క్రమంగా 75శాతానికి, అంతకంటే తక్కువకు తగ్గించడానికి భారత్ అంగీకరించింది. భారత్-యూకే మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే.ఈ ఇందులో భాగంగానే సుంకాన్ని తగ్గించేందుకు భారత్ అంగీకరించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దాంతో భారత మార్కెట్‌లో స్కాచ్ రిటైల్ ధరలు 10 నుంచి 30 శాతం తగ్గుతాయని భావిస్తున్నారు. దాంతో జానీ వాకర్ బ్లాక్ లేబుల్, గ్లెన్‌ఫిడిచ్ వంటి ప్రీమియం విస్కీల ధరలు సైతం సాధారణ వినియోగదారులకు అందుబాటులోకి వస్తాయి. స్కాచ్ విస్కీ అసోసియేషన్ ప్రకారం.. పన్ను తగ్గింపుతో భారతదేశంలో స్కాచ్ అమ్మకాలు 20నుంచి 25 శాతం వరకు పెరిగే అవకాశాలున్నది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ ప్రకారం.. భారత్ ఏటా రూ. 2.5 లక్షల కోట్లకుపైగా పన్ను ఆదాయాన్ని సంపాదిస్తుంది. ఇందులో ఎక్కువ భాగం విదేశీ బ్రాండ్ల నుంచే వస్తుంది. ధరల తగ్గింపు నేపథ్యంలో కొంత వరకు పన్నులు తగ్గించే అవకాశం ఉంటుందని.. డిమాండ్ పెరుగుదలతో మొత్తం అమ్మకాలు పెరిగి ఆదాయం పెరగవచ్చని అంచనా వేస్తున్నారు.

# పేదలపైనే జీఎస్టీ భారం..

**న్యూఢిల్లీ-నవభూమి:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) భారం అల్పాదాయ వర్గాలవారిపై తీవ్రంగా ఉంటున్నది. అదే సమయంలో సంపన్నులకు కార్పొరేట్ పన్ను రూపంలో వేలాది కోట్ల రూపాయల ప్రయోజనం దక్కుతున్నది. అధిక ఆదాయ వర్గాలపై ఎక్కువ పన్నును విధించడమే పురోగామి విధానం అవుతుంది. కానీ నరేంద్ర మోదీ ప్రభుత్వం పేదలను మోది, పెద్దలను ముద్దాడుతున్నది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ (ఎన్ఐపీఎఫ్‌పీ)కి చెందిన సచ్చిదానంద ముఖర్జీ విడుదల చేసిన అధ్యయన నివేదిక మోదీ ప్రభుత్వ తీరును ఎండగట్టింది. ఈ నివేదికలో దేశంలోని వినియోగదారులను మూడు వర్గాలుగా విభజించారు.

అట్టడుగు నుంచి 50 శాతం మంది, మధ్యలోని 30 శాతం మంది, అగ్ర భాగంలోని 20 శాతం మంది అనే మూడు వర్గాలుగా వీరిని పేర్కొన్నారు. వీరిపై జీఎస్టీ భారం ఎలా పడుతున్నదీ వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని అట్టడుగు 50 శాతం మంది, మధ్యలోని 30 శాతం మంది జీఎస్టీ భారంలో 31 శాతం చొప్పున భరిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లోని అట్టడుగు 50 శాతం మందిపై 29 శాతం, మధ్యలోని 30 శాతం మందిపై 30 శాతం పన్ను భారం పడుతున్నది. అగ్ర భాగంలోని 20 శాతం మందిలో గ్రామీణులు మొత్తం జీఎస్టీ 37 శాతం చెల్లిస్తుండగా, పట్టణవాసులు 41 శాతం చెల్లిస్తున్నారు.జీఎస్టీ విధానం ఓ మోస్తరుగా ప్రగతిశీలంగా ఉందని, దీనిలో ఉన్నత వర్గాల నుంచి సంపదను సమాజంలోని తక్కువ ఆదాయంగల వర్గాలవైపు మళ్లించే అవకాశం ఉందని ఈ అధ్యయనం వెల్లడించింది. జీఎస్టీ విధానాన్ని ప్రక్షాళన చేయాలనే చర్చ జరుగుతున్నపుడు ఈ అధ్యయనం జరిగింది. 12 శాతం పన్ను పరిధిలోకి వచ్చేవాటిని 5 శాతం లేదా 18 శాతం విభాగాల్లోకి విభజించి, 12 శాతం శ్లాబును రద్దు చేయాలనే ప్రతిపాదన వచ్చింది. ఈ అధ్యయనం 390 వస్తువులను 9 కేటగిరీలుగా విభజించింది.గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నెలవారీ తలసరి వ్యయం (ఎంపీసీఈ)లో 45 శాతం 'మినహాయింపు', 'మినహాయింపు నుంచి 5 శాతం' జీఎస్టీ పరిధిలోకి వచ్చే వస్తువులపైనేనని చేస్తున్నారని ఈ అధ్యయనంలో వెల్లడైంది.

# పైకప్పు కూలుతోందని చెబితే.. పట్టించుకోకుండా టీచర్ పోహా తింది..: రాజస్థాన్ విద్యార్థిని



**ఝలావర్-నవభూమి:** రాజస్థాన్‌లోని ఝలావర్ జిల్లాలో పాఠశాల భవనం కూలిన ఘటనలో ఏడుగురు విద్యార్థులు మృతి చెందగా.. 27 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రస్తుతం వీరంతా ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. భవనం శిథిలావస్థలో ఉందని విద్యార్థులు ముందే ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలుస్తోంది. ప్రమాదానికి కొన్ని క్షణాల ముందు కూడా పైకప్పు నుంచి రాళ్లు పడుతున్న విషయాన్ని ఉపాధ్యాయురాలికి చెప్పినా.. ఆమె నిర్లక్ష్యం వహించారని ఓ విద్యార్థిని ఆరోపించింది. పోహా తింటూ తాను చెప్పిన మాటలను అసలు పట్టించుకోలేదని.. దాని వల్లే అనేక మంది చనిపోయినట్లు వెల్లడించింది.రాజస్థాన్‌లోని ఝలావర్ జిల్లా పిప్లోడి గ్రామంలో శుక్రవారం జరిగిన హృదయ విదారక ఘటన గురించి అందరికీ తెలిసిందే. ఒక్కసారిగా బడి భవనం కుప్పకూలగా.. ఏడుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. 27 మంది తీవ్రంగా గాయపడి ప్రస్తుతం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అయితే ఈ ఘటనలో గాయాలపాలై ప్రాణాలతో బయటపడ్డ ఓ విద్యార్థిని ప్రమాద క్షణాలను గుర్తు చేసుకుంటూ సంచలన విషయాలను బయట పెట్టింది. పాఠశాల భవనం పైనుంచి కంకర రాళ్లు పడడం గుర్తంచానని.. అదే విషయాన్ని ఉపాధ్యాయురాలుకి కూడా చెప్పినట్లు పేర్కొంది. కానీ అప్పుడు ఆమె పోహా తింటూ తాను చెప్పిన విషయాన్ని పట్టించుకోలేదని.. ఆ తర్వాత కాసేపటికే పైకప్పు కూలిందని చెప్పుకొచ్చింది. ఆయన అప్పుడే స్పందించి ఉంటే పిల్లలంతా ప్రాణాలతో బయట పడేవారని వెల్లడించింది.సంఘటన జరిగిన తీరును ఒక విద్యార్థిని కన్నీటిపర్యంతమై వివరించింది. ముఖ్యంగా శుక్రవారం రోజు ఉదయం అసెంబ్లీకి కొన్ని నిమిషాల ముందే తమను ఉపాధ్యాయురాలు ఓ గదిలే వేచి ఉండమని చెప్పినట్లు పేర్కొంది. అప్పుడే పైకప్పు నుంచి చిన్న చిన్న కంకర రాళ్లు పడడం ప్రారంభం అయిందని వివరించింది. ఆ విషయం గుర్తించిన వెంటనే తాను ఉపాధ్యాయురాలికి ఆ విషయం చెప్పానని.. కానీ ఏమీ పడట్లేదు మీరు కూర్చోమని చెప్పిందని వెల్లడించింది. అయితే ఆ సమయంలో టీచర్ పోహా తింటోందని.. పేర్కొంది. ఆమె తాను చెప్పిన మాటలు పట్టించుకుని ఉంటే ప్రమాదం నుంచి అంతా బయట పడేవాళ్లని చెప్పింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 | హైదరాబాద్ సోమవారం 28 । జులై । 2025



## మాకు అంతా ఇక మంచే... మాతోశ్రీకి రాజ్ రాకపై ఉద్ధవ్



ముంబై-నవభూమి: మాతోశ్రీనివాసానికి తన సోదరుడు రాజ్ ఠాక్రే వచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పడం చాలా ఆనందంగా ఉందని శివసేన సుప్రీం ఉద్ధవ్ ఠాక్రే చెప్పారు. తమ సోదరులిద్దరికీ భవిష్యత్తు బాగుంటుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఉద్ధవ్ 65వ పుట్టినరోజు సందర్భంగా ఆయన నివాసమైన మాతోశ్రీకి రాజ్ ఠాక్రే ఆదివారంనాడు వచ్చారు. ఆరేళ్ల తర్వాత మాతోశ్రీకి రాజ్ ఠాక్రే రావడం ఇదే మొదటిసారి. సోదరుల ఇద్దరూ ఎంతో ఆత్మీయంగా పలకరించుకుంటూ పండుగ వాతావరణాన్ని తలపించారు.

అనంతరం మీడియాతో ఉద్ధవ్ ఠాక్రే మాట్లాడుతూ, చాలాకాలం తర్వాత తాము కలుసుకున్నామని, ఇద్దరూ ఎక్కడైతే పెరిగి పెద్దవాళ్లమయ్యామో అక్కడ కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఇక మంచి భవిష్యత్తు ఉంటుందని తాము ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు.

ఉద్ధవ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం సోదరులిద్దరూ దివంగత బాల్‌ఠాక్రే చిత్తరువు బ్యాక్‌గ్రౌండ్‌లో ఫోటోలు దిగారు. ఆ ఫోటను రాజ్ ఆ తర్వాత సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'నా పెద్ద సోదరుడు, శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు చెప్పేందుకు బాల్ ఠాక్రే నివాసమైన మాతోశ్రీకి వెళ్లాను' అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.



## ఆదివాసుల మతం ఏమిటి

పదిమంది బతుకుల్లో ఒకరి గొంతు వినిపించకపోతే అది మౌనం కాదు... మూలపాలనను నిలువరించే నిశ్శబ్ద అణచివేత.అది మా ఇల్లు కాదు... అది మమతల గూటి. గోడల మధ్య గలిగే గుళ్ళు, తలుపుల వెంట బతుకే దేవతగా కనిపించే పూర్వీకుల స్థలం. కానీ, ఒక్కోసారి అక్కడ అడుగుపెట్టే ప్రభుత్వ అధికారులకు ఇది ఓ గణాంకపు 'ఇనపపెట్టె' మాత్రమే. వారికెదురైనప్పుడల్లా మా మతం ఏమిటని అడుగుతారని భావించే ప్రతి ఆదివాసీ బిడ్డకు ఒక నిరాశే ఎదురవుతుంది. ఎందుకంటే వారు మతం ఏమిటని అడగరు... అనుమానాలు లేకుండా "హిందూ" అని నమోదు చేస్తారు. ఇది ఓ అప్రశ్నిత ఆమోదం కాదు. ఇది మత స్వాతంత్రాన్ని కాలరాయడమే. 2021లో జరగాల్సిన జనాభా గణనను కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు 2027లో నిర్వహించబోతోంది. ఇది మామూలు గణన కాదు. ఈసారి కులాలను కూడా నమోదు చేస్తామని కేంద్రం ప్రకటించింది. అయితే అదే సమయంలో ఆదివాసులు గతంలో ఉండే Other Religions and Persuasions (ORP) అనే విభాగం నుంచి తొలగించి... వారిని హిందూ మతంలో విలీనం చేయాలన్న చర్చ మొదలవ్వడం సడెన్ కాదు అది సావకాశంగా రూపొందించిన సంస్కృతీకరణ మిషన్.

**ఆర్టికల్ 25ను ధ్వంసం చేసే దిశగా..?**

మన రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రకారం... ప్రతి పౌరుడికి తనకు నచ్చిన మతాన్ని అనుసరించగల హక్కు ఉంది. అదే హక్కు ఇప్పుడు మేధో రాజకీయాల ఎదుట ముసుగవుతోంది. వందలాది మత విభాగాలు వా్రా కేటగిరీలో తమ ఉనికిని నమోదు చేసుకుంటూ వస్తుంటే... ఆదివాసులు మాత్రమే ఎందుకు హిందూత్వ బాహుపాశంలోకి లాగబడాలి?ఇది మతమే కాదు, గొప్ప రాజకీయ ఎత్తుగడ. ఎందుకంటే మత గణాంకాలు ఓట్లుగా మారుతాయి. ఓట్లు అధికారంగా మారతాయి. అందుకే ఆదివాసుల మతాన్ని ఓ ప్రత్యేక మతంగా గుర్తించకుండా హిందూ మతంలో కలిపేయడం **అనేది ఒక రాజకీయం ఒక వ్యూహం.**

మతాన్ని సాంఘిక మౌలికత కాదు, రాజకీయ ఆయుధంగా భావించిన "హిందుత్వ" సిద్ధాంతంలో... "భారత దేశాన్ని పితృభూమిగా, పుణ్యభూమిగా పరిగణించేవారే హిందువులు" అన్న నిర్వచనం ఇచ్చారు. ఇదే నిర్వచనం ఆదివాసుల ఉనికిని మింగివేసే ప్రణాళికకు మార్గం వేసింది.వాస్తవానికి ఆదివాసుల మత విశ్వాసాలు, ప్రకృతి ఆరాధన, ఆత్మల పూజ, పూర్వీకుల పవిత్రత వంటి మూలమైన భావాలతో ముడిపడి ఉన్నాయి. కానీ, ఇవన్నీ హిందూ మతంలోని "శివుడు", "కాళి", "హనుమాన్" రూపాల్లో కలిసిపోయినట్లుగా తీర్చిదిద్దినట్టయింది. ఆదివాసి దేవతలకు సంస్కృతీకరించిన పేర్లు పెట్టడం, వాటిని హిందూ గణానికి కలుపుకోవడం... ఇదంతా సమర్థంగా సాగుతున్న మత రాజకీయ యంత్రాంగానికి నిదర్శనం.భారతదేశంలో మత గణన 1871లో మొదలైంది. బ్రిటిష్ పాలకులు అప్పట్లో ఇస్లామేతర మతాలను "పెగానిజం"గా పేర్కొన్నారు. బహుళ దేవతల ఆరాధన, ప్రకృతిని పూజించడాన్ని ఒక మతంగా గుర్తించడానికి వీలు లేకుండా, వీటన్నింటినీ "హిందూ" అనే పేరు క్రింద కలిపి వేశారు. దీంతో ఆదివాసుల మత విశ్వాసాలు ఒక చీకటి మూలకోణంలో నిలబడ్డాయి.1871 నుంచి 1921 వరకూ వారి మతాన్ని Animist, తర్వాత Tribal Religionఅని పేర్కొన్నారు. కానీ 1951లో ఏకంగా వీటినన్నింటినీ తొలగించి, హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, జైన అనే ఆరు మతాలు మాత్రమే గుర్తించారు. మిగతా వారందరిని ORP కేటగిరీలో చేర్చారు. ప్రస్తుతం ఆ ORPని కూడా రద్దు చేసి, వారిని హిందువులుగా కలిపేయాలన్న కేంద్ర ఆలోచన మత స్వాతంత్రంపై ఘాతుకం.

**జానపద భాషలు, మతాలు, సంస్కృతులపై దాడి**

ఆదివాసుల భాషలు, సంస్కృతులు పెద్దగా లిఖిత రూపం లేని జానపద జీవనాన్ని ప్రతిబింబిస్తాయి. కానీ మత రాజకీయాలు అబద్ధంగా ఆధునికతను ప్రచారం చేస్తూ ఈ భాషలను, మతాలను అపనిందిస్తూ తొలగించేందుకు పన్నాగం చేస్తున్నాయి. భాషను తొలగిస్తే భవిష్యత్తును తొలగించినట్లే. మతాన్ని తొలగిస్తే చరిత్రనే చెరిపేసినట్లే.ఒకే దేశంలో... ఒకే ప్రాంతంలో... ఒకే ప్రభుత్వం నుంచి ఆదివాసుల మతాన్ని గుర్తించడానికి అనేక ఆంక్షలు, కానీ హిందూత్వంగా లిపికరించడానికి మాత్రం సర్వసౌలభ్యం. ఇది చర్చించాల్సిన విషయమే కాదు... దీనికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన సమయం ఇది.చోటా నాగ్‌పూర్, మధ్య భారతంలో చాలామంది ఆదివాసులు తమ మతాన్ని సర్ణ మతంగా నమోదు చేస్తున్నారు. ఇది ప్రకృతి ఆరాధన, ఆత్మల పవిత్రత, వృక్షాలకు గౌరవం, నదుల పట్ల భక్తి వంటి విశ్వాసాలపై ఆధారపడి ఉంది. ఇది ఖచ్చితంగా హిందూ మతంతో సమానంగా ఉండదు. కానీ జనగణనలో మత గణాంకాలను ఓ మతంగా వంచించడం, వారిపై ఒక అసత్య ముసుగు కప్పడమే.

**మతం ఓ గుర్తింపు కాదు -ఓ ప్రతిఘటన**

ఆదివాసుల మతాన్ని గుర్తించకపోవడమంటే... వాళ్ళని ఈ దేశ చరిత్ర నుంచి తీసేయడం. వాళ్ల దేవతలు, వాళ్ల పండుగలు, వాళ్ల నృత్యాలు, వాళ్ల తాలూకు జీవన తత్వం అన్నీ కలిసి ఒక తరం గుర్తింపును ఏర్పరుస్తాయి. అది గుర్తించకపోతే అది గుర్తుపెట్టుకునే సామాజిక సంకల్పాన్ని మనం కోల్పోతున్నట్టే.ఇప్పుడు ప్రశ్న మనదే. మనం ప్రజాస్వామ్య భారతదేశాన్ని కాపాడాలంటే... మత స్వాతంత్ర్యాన్ని కాపాడాలి. మత గణాంకాల పేరుతో ఆమోదం లేకుండా మతాల మార్పును నిరసించాలి. ఒక ఆదివాసి బాలుడు తన మతాన్ని తానే చెబుతున్నదానికి అడ్డుపడే వ్యవస్థ ప్రజాస్వామ్యం కాదు, ఆధిపత్యం.మత స్వేచ్ఛ అన్నది కేవలం నియమం కాదు... మూల విలువ. ఆ విలువను ఆదివాసులు గెలిపించుకుంటేనే చాలు.

# వెనిజులా విప్లవ వేగుచుక్కగో చావెజ్



లాటిన్ అమెరికాలో సైమన్ బొలివర్, ఫెడల్ కాస్ట్రో, చేగువేరాల తర్వాత విప్లవోద్యమస్ఫూర్తిని రగిలించిన విప్లవ వీరుడు హ్యూగో చావెజ్. ఆయన అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని అడుగడుగున ప్రతిఘటించి విప్లవ చోదక శక్తిగా ప్రభవించిప్రత్యామ్నాయ సారధిగా పరిణమించి వెనిజులాలో నయా వలసవాద రాజకీయాలనుఅంతమొందించి ప్రపంచానికి ప్రత్యామ్నాయ మార్గదర్శనం చేశారు. సైనిక తిరుగుబాటుతోవెలుగులోకి ప్రసరించిననూ క్రమంగా ఆయన ప్రజాస్వామిక పంథాని అనుసరించి వెనిజులాలో సోషలిస్టు పాలనకు మార్గాన్ని సుగమం చేసి సరికొత్త చరిత్రను సృష్టించారు.సామాన్య మధ్య తరగతి ఉపాధ్యాయ కుటుంబంలో ఇలెనా ఫ్రియాస్ డి చావెజ్, హ్యూగో డి లాస్ రేయాస్ చావెజ్ అనే దంపతులకు 1954, జూలై 28 నాడు హ్యూగో చావెజ్జన్మించారు. ఆయన సైనిక అకాడెమీలో చేరి 1975 లో పట్టభద్రులయ్యారు. ఆయనగెరిల్లా నిరోధక కార్యకలాపాల నిమిత్తం నియమింపబడి చురుకైన పాత్రనునిర్వహించడమే కాకుండా అధ్యాపకులుగా విధులు నిర్వర్తించి కొత్త తరం సైనికులను,అధికారులను తీర్చిదిద్దారు. పేద వర్గాల నుంచి వచ్చిన సైనికాధికారుల ప్రజాస్వామిక ఆశయాలు, ఆకాంక్షలకు ప్రతిరూపంగా 1987 డిసెంబర్ 17 న బోలివర్ విప్లవోద్యమం-ని ఆవిర్భవింపజేయడంలో చావెజ్ విశేష కృషి చేశారు.హ్యూగో చావెజ్ బృంద సభ్యులు ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని కూలదోసిప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరణకు పిడికిలి బిగించారు. సైన్యంలో కేవలం పది శాతంమద్దతు కలిగి ఉన్న చావెజ్ వారి సహాయంతో అధికారాన్ని హస్తగతం చేసుకోవాలని ఆయన నిర్ణయం తీసుకున్నారు. 1992 డిసెంబర్ లో సైనిక తిరుగుబాటుచేయాలనుకున్న చావెజ్ పథకం విఫలమైననూ ఆయన ప్రజల్లో పెద్ద కదలికతీసుకువచ్చారు. సైనిక తిరుగుబాటులో పాల్గొన్న అనేక మంది అధికారులు మరియుసైనికులు చెరసాలపాలు అయ్యారు. చెరసాలలో ఉండగానే



చావెజ్ తీక్షణమైన అధ్యయనంచేసి విప్లవాన్ని సమర్ధిస్తూ ముందుకు వచ్చిన వారంతా ఆకలితో ఉన్నవారేనని,విప్లవక్రమం సాధించకుండా వెనిజులా ఎదుర్కొంటున్న సంక్షోభం నుండి బయటపడదు అని చావెజ్ గ్రహించి విప్లవక్రమం లక్ష్యాలను సాధించడానికి సైన్యాన్ని ఒక వాహకంగాఎంచుకున్నారు.చావెజ్ నిర్బంధం నుండి విడులయ్యాక సైన్యం వెలుపల కూడా ఉద్యమాన్ని బలోపేతంచేశాడు. ప్రజాస్వామిక కార్యాచరణ (ఎ. డి) పార్టీ మరియు ప్రజాస్వామిక రాజకీయఎన్నికల సంఘటనా మండలి ( కోపి) పార్టీలు విశ్వసనీయతను కోల్పోవుతున్ననేపథ్యంలో ఎన్నికల పంథాను ఎంచుకోవడం మేలు అని ఉద్యమ నాయకత్వంభావించింది. చావెజ్ తో పాటు ఇతర విప్లవ ఉద్యమ నాయకులు దేశమంతా పర్యటించి ఆయా సముదాయాలతో చర్చలు జరిపి రిపబ్లిక్ ఉద్యమాన్నిస్థాపించి దానికి రాజకీయవేదికను కల్పించారు. 1997, ఏప్రిల్ 19 న జరిగిన బొలివేరియన్-200 మహాసభల సందర్భంగా పార్లమెంట్ రాజకీ యాల్లో పాల్గొనాలన్న నిర్ణయాన్ని చావెజ్ బృందసభ్యులు తీసుకు న్నారు. తదుపరి 1998 డిసెంబర్ లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో చావెజ్56 శాతం ఓట్లు తెచ్చుకొని అధ్యక్షుడుగా విజయం సాధించి వెనిజులాలో సరికొత్తచరిత్రను సృష్టించారు.సైన్యాన్ని వాహకంగా చేసుకొని అధ్యక్షుడుగా విజయం సాధించిన చావెజ్ పేదలకుగృహవసతి కల్పించడం, వైద్యం, పౌష్టికాహారం తదితర సేవలను అందించడం లాంటి ప్రజాసంక్షేమ కార్యక్రమాల అమలుకు సైన్యాన్ని సమీకరింపజేశారు. విద్య, వైద్యం, ఉపాధి,గృహావసతి, మరియు ఆహార వసతి లను ప్రజలందరికీ మౌలిక హక్కులుగా రాజ్యాంగంలోపొందుపరిచారు. మళ్ళీ 2000 జూలై నెలలో జరిగిన ఎన్నికల్లో చావెజ్ అనుకూల శక్తులువిజయం సాధించడంతో చావెజ్ తిరిగి రెండవసారి అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ఆయన2001 నవంబర్ లో ప్రజోపయోగ భూసంస్కరణలు, చమురు వనరుల స్వాధీనం, సూక్ష్మ వనరుల స్వాధీనం తదితర కీలకాంశాల ఉత్తర్వులను పార్లమెంట్ లో నెగ్గించుకున్నారు.యూనివర్సిటీ స్థాయి వరకు ఉచిత విద్యావకాశాలు కల్పింపజేశారు. ఆయన ప్రధానపదవులు అన్నింటిలోనూ విప్లవ చైతన్యం గల అధికారులను నియమించి చమురు,బంగారు గనులు మొదలైన ప్రకృతిపరమైన సహజ వనరులను అన్నింటినీ ప్రభుత్వఆధీనంలోకి తీసుకువచ్చి జాతికి అంకితం చేశారు.చావెజ్ ను 2002, ఏప్రిల్ 11 న సైనికావాసాల నడుమ టియునా కోటలో 20మందితో కూడిన సైనిక ముఠా నిర్బంధిననూ కొందరు అధికారుల చొరవ, ప్రజాబలంఅయిననూ సురక్షితంగా రక్షించగలిగింది. 2002, ఏప్రిల్ 11 సైనిక ముఠా తిరుగుబాటుతోఅన్యాయంగా గద్దెదింపబడిన చావెజ్ కేవలం 48 గంటల్లోనే తిరిగి అధికారాన్ని హస్తగతంచేసుకోవడం ప్రపంచ చరిత్రలోనే అరుదైన సంఘటనగా నిలిచింది.

2005 లో చావెజ్ మొదటిసారిగా 21 వ శతాబ్ది సోషలిజం అన్ని నినదించిననూ తాను అని, కమ్యూనిస్ట్ అని చెప్పుకోలేదు.ఆయనపై సైమన్ బొలివర్ ప్రభావంఅత్యధికంగా ఉండడంతో తానొక బొలివేరియన్‌నని, ఒక విప్లవకారుడు నని మాత్రమే ఆయన ప్రస్తావించుకున్నారు. వెనిజులా దేశ సౌభాగ్యం కోసం బొలివేరియన్ మార్గంసరిపోతుందని ఆయన విశ్వసించారు.2006 డిసెంబర్ లో జరిగిన ఎన్నికల్లో చావెజ్ 63 శాతం ఓట్లు తెచ్చుకొని తిరిగి మూడవసారి అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ఈ క్రమంలోనే వామపక్ష శక్తులన్నింటినీ ఒకేతాటిపైకి తీసుకువచ్చి యునైటెడ్ సోషలిస్ట్ పార్టీ ఆఫ్ వెనిజులాని చావెజ్ స్థాపించారు.అలాగే మరోసారి 2012 లో జరిగిన ఎన్నికల్లో ప్రతిపక్షాల కుట్రలు, మీడియా విష ప్రచారాలు అన్నింటిని చావెజ్ అవలీలగా అధిగమించి 53 శాతం ఓట్లు సాధించి తిరిగినాల్గవసారి అధ్యక్షుడుగా ఎన్నిక కాబడి విజయధంకా మ్రోగించారు. చావెజ్ నాలుగుపర్యాయాలు అధ్యక్షుడుగా కొనసాగిననూ ఆయన తననెప్పుడు అధ్యక్షుడుగాభావించుకోలేదు. ఆయన అతి నిరాడంబర జీవితాన్ని గడిపారు. చావెజ్ వెనిజులాస్థితిగతులను సునిశితంగా అధ్యయనం చేసి సరైన విప్లవ క్రమాన్ని అనుసరించడంలోకృతకృత్యులై విజయాన్ని సాధించారు. వెనిజులా విప్లవ పోరాటంలో చావెజ్ క్రియాశీలపాత్రని నిర్వహించారు. ప్రపంచీకరణ విధానాలకు ప్రత్యామ్నాయ బాటను చూపి ఆచరించితన పద్నాలుగు ఏళ్ల పాలనను జనరంజకంగా తీర్చిదిద్దిన బొలివేరియన్ సోషలిస్ట్ గా చావెజ్ చరిత్ర పుటల్లో నిలిచిపోయారు.

వెనిజులాలో అమెరికన్ వలసవాద ఆధిపత్యాన్ని అంతమొందించి పేద ప్రజల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తూ ప్రత్యామ్నాయ నేతగా ప్రజా హృదయాలను గెలుచుకున్న హ్యూగో చావెజ్ ని కాన్సర్ వ్యాధి కబళించడంతో 2013, మార్చి 5 నతుదిశ్వాస విడిచారు. నేడు చావెజ్ లేని వెనిజులా, చావెజ్ లేని లాటిన్ అమెరికా, చావెజ్ లేని ప్రపంచాన్ని ఊహించుకోవడం ఎంత మాత్రం సాధ్యం కాదు. చావెజ్ మరణించిననూ, తరాలు అంతరించిననూ ఆయన చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ప్రజా హృదయాలలో మెదలాడుతూనే ఉంటాయి. ఆఖరి క్షణం వరకు జనహితం కోసం కృషి చేసిన చావెజ్ ప్రపంచ చరిత్రలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకొని ఆదర్శ నేతగా కీర్తి పతాకాలు అందుకొని జయకేతనంతో ప్రభవించారు. హ్యూగో చావెజ్ కాన్సర్ వ్యాధితో కనుమూసిననూ ఆయన నేడు ప్రజా హృదయాలలో చిరస్మరణీయంగా వెనిజులా విప్లవ వేగుచుక్కగా వెలుగొందుతూనే ఉన్నారు.

( జూలై 28 హ్యూగో చావెజ్ 71 వ జయంతి )

– జె.జె.సి.పి. బాబూరావు
రీసెర్చ్ స్కాలర్,
సెల్: 94933 19690.

# మాటలతో మెరుగైన సంబంధాలు :ప్రభావవంతమైన కమ్యూనికేషన్



మానవ సంబంధాలు నమ్మకం, గౌరవం, పరస్పర అవగాహనపై నిర్మితమైనవి. ఈ బంధాలను బలపరిచే ప్రధాన శక్తి సమర్థవంతమైన సంభాషణ. మాటల ద్వారా మన భావాలను, అభిప్రాయాలను, అవసరాలను స్పష్టంగా తెలియజేయగలిగితే, అపార్థాలను నివారించవచ్చు. సంబంధాలలో మౌనం లేదా తప్పుగా అర్థం చేసుకునే మాటలు తరచూ సమస్యలకు దారితీస్తాయి. ప్రభావవంతమైన సంభాషణ అనేది కేవలం మాట్లాడడం మాత్రమే కాదు,వినడం, అర్థం చేసుకోవడం, సానుభూతితో స్పందించడం కూడా ఇందులో భాగం. ఓపికగా వినడం ఎదుటివారికి గౌరవం ఇవ్వడాన్ని సూచిస్తుంది.

సంబంధాల్లో సమస్యలు తలెత్తే ప్రధాన కారణాల్లో ఒకటి ..మన భావాలను చెప్పే విధానం. చాలా సార్లు మనం బాధపడినప్పుడు నేరుగా ఆరోపణలుగా మాట్లాడుతాము. ఉదాహరణకు, నీవు ఎప్పుడూ నన్ను పట్టించుకోవు,నువ్వు నా మాట వినవు, నీ వల్లే అన్నీ చెడిపోతున్నాయి వంటి మాటలు మనం ఆవేశంలో అంటాము. అయితే ఇలాంటి మాటలు అవతలి వ్యక్తిని బాధపెట్టి, సమస్యను ఇంకా పెద్దదిగా మారుస్తాయి. బదులుగా అదే విషయాన్ని కొంచెం సున్నితంగా, బాధ్యతగా చెప్పగలిగితే, సమస్యపై చర్చ జరిగే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు, కొన్ని సార్లు నీవు బిజీగా ఉన్నప్పుడు నాకు ఒంటరితనంగా అనిపిస్తుంది, లేదా ఈ విషయంపై నీ అభిప్రాయం కూడా వినాలని ఉంది అని చెప్పడం వల్ల మన భావాలు అవమానంగా కాకుండా అవగాహనతో వ్యక్తమవుతాయి. మాటల శైలిలో చిన్న మార్పు.. ఒక వాక్యంలో ఒక్క పదం మారినా సంబంధాల్లో పెద్ద తేడాను తీసుకురాగలదు. మన భావాలను నొప్పించకుండా చెప్పడం ఒక కళ. ఆ కళను మనం నేర్చుకుంటే, సంబంధాలు మరింత గాఢంగా మారతాయి. మనసులో బాధ ఉన్నప్పటికీ, మాటల్లో నెమ్మదితనం ఉంటే అవతలి వ్యక్తి మన మాటలను అర్థం చేసుకునే అవకాశం పెరుగుతుంది.మాట మారితే మనసు మారుతుంది. మనసు మారితే సంబంధం మారుతుంది. సంబంధం బలపడితే జీవితం బాగుపడుతుంది.



డాక్టర్ జాన్ గాట్మన్, అమెరికాలోని వాషింగ్టన్ యూనివర్సిటీకి చెందిన ప్రముఖ సంబంధాల పరిశోధకుడు, 40 సంవత్సరాలకు పైగా దంపతుల సంభాషణ శైలిని అధ్యయనం చేసి, వారి సంబంధ భవిష్యత్తును అత్యధిక ఖచ్చితత్వంతో అంచనా వేయగలిగారు. ఆయన పరిశోధనలు సంభాషణలో ఫోర్ హార్స్‌మెన్ (క్రిటిసిజం, కాంటెంప్ట్, డిఫెన్సివ్‌నెస్, స్టోన్‌వాలింగ్) అనే నాలుగు ప్రతికూల లక్షణాలు సంబంధ వైఫల్యానికి దారితీస్తాయని సూచిస్తాయి. ఈ లక్షణాలను నివారించడం ద్వారా దంపతులు తమ సంబంధాన్ని బలోపేతం చేసుకోవచ్చు. అలాగే, సంభాషణలో సానుకూల భావోద్వేగాలు, గౌరవం, సానుభూతి ఉన్న జంటలు ఎక్కువ కాలం సంతోషంగా ఉంటారని గాట్మన్ గుర్తించారు.భారతదేశంలో సంభాషణ సమస్యలు భార్యాభర్తల మధ్య మాత్రమే కాక, తల్లిదండ్రులు, పిల్లలు, సోదరులు, స్నేహితులు, కుటుంబ సభ్యుల మధ్య కూడా విభేదాలకు కారణమవుతున్నాయి. అధ్యయనాలు సూచించిన ప్రకారం, నగరీకరణ, ఆధునిక జీవనశైలి, పనిభారం వంటి అంశాలు కుటుంబ సభ్యుల మధ్య రోజువారీ సంభాషణలను తగ్గిస్తున్నాయి, ఇది భావోద్వేగ అనుబంధాలను దూరం చేస్తుంది. డిజిటల్ సాధనాలు వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సమాచార మార్పిడిని వేగవంతం చేసినప్పటికీ, మనసును తట్టే లోతైన సంభాషణలను తగ్గించాయి. తక్షణ ప్రతిస్పందనలు, ఎమోజీలతో నిండిన సందేశాలు వ్యక్తిగత సానుభూతి, ప్రత్యక్ష సంభాషణల స్థానాన్ని ఆక్రమించాయి ఫలితంగా సంబంధాలలో ఆత్మీయత తగ్గుతోంది. ఈ సమస్యను అధిగమించడానికి, ప్రతిరోజూ కుటుంబ సభ్యులతో కనీసం 15-20 నిమిషాలైనా ఆప్యాయతతో మాట్లాడే అలవాటును పెంపొందించుకోవాలి. ముఖాముఖి సంభాషణలు మానవ సంబంధాలకు నిజమైన ఊపిరిని అందిస్తాయి. ప్రేమ, ఓపిక, గౌరవంతో మాట్లాడే మనసు పెరిగితే, దూరమైన సంబంధాలు కూడా సన్నిహితమవుతాయి.

సమర్థవంతమైన సంభాషణలో ఎదుటివారు మాట్లాడుతున్నప్పుడు శ్రద్ధగా వినడం, ఫోన్ లేదా ఇతర పరధ్యానాలను పక్కన పెట్టడం, వారి మాటలను మీ సొంత మాటల్లో సంక్షిప్తంగా చెప్పడం ద్వారా అర్థం చేసుకున్నట్లు నిర్ధారించడం ముఖ్యం. ఆరోపణలు చేయకుండా, మీ భావాలను నేరుగా, గౌరవంగా వ్యక్తీకరించండి. సరైన సమయం, వాతావరణం ఎంచుకోవడం కూడా అవసరం. సంబంధాలు బాగుండాలంటే మనం ఎప్పటికప్పుడు మన మనసులో ఉన్నది నిజంగా, స్పష్టంగా చెప్పడం అవసరం. అలా చెప్పేటప్పుడు ఎదుటివారిని నొప్పించకుండా, శాంతంగా చెప్పడం చాలా ముఖ్యం.మనం చెప్పే తీరే ఆ సంబంధపు స్థిరత్వాన్ని నిర్ణయిస్తుంది. ఏం చెప్పాలో కాదు, ఎలా చెప్పామనేది ఎక్కువ గుర్తుండిపోతుంది. మనం వినే విధానం కూడా అంతే ముఖ్యం.మధ్యలో అడ్డుపడకుండా, పూర్తిగా వినాలి. అప్పుడే ఎదుటివారు మనతో మాట్లాడాలని ఫీలవుతారు. ఒకరినొకరు అర్థం చేసుకునే ప్రయత్నం చేయడం వల్లే సంబంధాలు బలంగా మారతాయి.సంభాషణలో బాడీ లాంగ్వేజ్ ,స్వరం కీలక పాత్ర పోషిస్తాయి. ఐ కాంటాక్ట్, సౌమ్యమైన స్వరం, సానుకూల శరీర భాష ఉపయోగించండి.

భారతదేశంలో, నగరీకరణ, ఆధునిక జీవనశైలి సంబంధ సమస్యలను పెంచుతున్నాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఆర్థిక ఒత్తిడి, సాంస్కృతిక మార్పులు, సాంకేతికత ప్రభావం వల్ల దంపతుల మధ్య సంభాషణ లోపాలు సంబంధ వైఫల్యాలకు దారితీస్తున్నాయి. కుటుంబ సభ్యులతో, ముఖ్యంగా పిల్లలతో, ఓపికగా వినడం వారి అభిప్రాయాలను గౌరవించడం వారిలో నమ్మకాన్ని పెంచుతుంది. అలసత్వంతో స్పందించడం లేదా అగౌరవంగా మాట్లాడడం వల్ల పిల్లలు మౌనంగా మారవచ్చు, ఇది సంబంధాలను దెబ్బతీస్తుంది.

మాటలు శక్తివంతమైన ఆయుధం, అవి గాయపరచగలవు, చికిత్స చేయగలవు, బంధాలను బలపరచగలవు. ప్రేమతో, ఓపికతో, గౌరవంతో మాట్లాడినప్పుడు, అవి అనుబంధాన్ని అభివృద్ధి చేస్తాయి. చిన్న ప్రశంసలు, సానుభూతితో కూడిన మాటలు, ధైర్యాన్ని నూరిపోసే వాక్యాలు సంబంధాలపై చిరస్థాయి ప్రభావాన్ని చూపగలవు. ప్రతిరోజూ కొద్దిసేపు ప్రేమగా మాట్లాడడం ద్వారా బంధాలను నిలబెట్టవచ్చు. ఒకరినొకరు వినగలగడం, అర్థం చేసుకోవడం అనేది మాటల గొప్పతనాన్ని తెలియజేస్తుంది. ప్రేమను గుండెల్లో దాచుకున్నా ఉపయోగం లేదుదానిని మాటల రూపంలో వ్యక్తపరిచినప్పుడే బంధం సజీవంగా మారుతుంది!

మహమ్మద్ అక్బర్
జర్నలిస్ట్, నవభూమి దినపత్రిక
మహబూబాబాద్

## 'తడిగా మిగిలిన క్షణం'

(ప్రేమ కవిత)

ఎందుకో ఎదురుచూపులు,
వెళుతూ తిరిగిచూస్తావేమోనని...
గడిచిన ప్రతి శ్వాస వెనుక,
నీ ఊహలు ఓ గాలిపటంగా ఎగురుతున్నాయి.

నీ మౌనపు వెన్నెల విందులో,
నా హృదయ స్పందన ఓ లయగా
వినిపిస్తుంది నిశ్శబ్ద గీతంగా
నీ అడుగుల మురిపెంగా!

కనుల చెమ్మకు కరువేముంది?
నువ్వు లేని ప్రతి క్షణం
ఓ సముద్రం గుండెల్లో నిలిచిన నీటి బొట్టే.

కాలమంతా రాలిపోతే,
కలల తోటల చట్రం విడిపోతే,
నీ మది సుగంధమే పూల రంగులా
నా జీవన దీపాన వాలుతుంది.

-షహనాజ్

భక్తి


# పత్రం పుష్పం ఫలం తోయం



'మరింత అభివృద్ధి చెందాలి, రక్షణతో, భద్రతతో ఉండాలి' అనే కోరికను మనం వదిలేస్తే... మనల్ని, మన కుటుంబాలను, మన సంస్థలను ఎవరు చూసుకుంటారు?... కోరికలను వదులుకోవాలని ఎవరైనా బోధించినప్పుడు మనలో సాధారణంగా కలిగే భయం ఇది. ఇది సహజంగా, తార్కికంగా కనిపిస్తుంది. తన భక్తులు ఇలాంటి భయాన్ని అధిగమించడం కోసం నిశ్చల చిత్తంతో తనను ధ్యానించేవారి యోగక్షేమాలను తనే వహిస్తానని (యోగ క్షేమమ్ వహామ్యహమ్) శ్రీ కృష్ణుడు హామీ ఇచ్చాడు. ఇక్కడ 'యోగం' అంటే కలయిక. ఎవరైతే నిశ్చలమైన బుద్ధితో భగవంతుడితో ఐక్యత సాధిస్తారో... వారి ఎదుగుదలకు, సంక్షేమానికి హామీ, అన్నిటికన్నా శక్తివంతుడైన భగవంతుడి కృప లభిస్తుంది."గ్రహ దేవతలను పూజించేవారు... వారిని చేరుకుంటారు. పితృదేవతలను ఆరాధించేవారు వారి దగ్గరకు వెళ్తారు, భూతప్రేతాల్ని అర్చించేవారు అలాంటి వాటిలోనే పుడతారు" అని శ్రీకృష్ణుడు స్పష్టం చేశాడు. అంటే కోరికలు తీర్చుకోవడానికి చాలామంది వివిధ దేవతలను ఆశ్రయిస్తారు. కానీ కోరికలు వదులుకున్నవారు ఆయనను చేరుకుంటారు. వారి శ్రేయస్సును ఆయన నిర్ధారిస్తాడు.కాగా 'శ్రద్ధ' అనేది భగవద్గీత సారాంశం. భగవదారాధనలో శ్రద్ధ ప్రధానమని శ్రీకృష్ణుడు చెబుతున్నాడు. ఆకులు, పువ్వులు, ఫలాలు, ఆఖరికి నీరైనా సరే (పత్రం, పుష్పం, ఫలం తోయం) ... పూర్తి భక్తి భావంతో, శ్రద్ధతో సమర్పిస్తే... వాటిని తాను ఆనందంగా స్వీకరిస్తానని చెప్పాడు. కాబట్టి భగవంతుడి ప్రసన్నతను పొందడానికి వేరే దేనికోసం వెతకాల్సిన అవసరం లేదు. మన చుట్టూ సులువుగా లభించే మామూలు వస్తువులను భక్తిగా సమర్పిస్తే చాలు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9
హైదరాబాద్
సోమవారం
28 । జులై । 2025

## ప్రొడ్యూసర్‌ను చెప్పుతో కొట్టిన నటి



**ముంబై-నవభూమి:** ఇటీవల 'సో లాంగ్ వ్యాలీ' మూవీ ప్రీమియర్ సందర్భంగా షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. సినీ డైరెక్టర్, ప్రొడ్యూసర్ అయిన కరణ్ సింగ్‌ను నటి రుచి గుజ్జర్ నలుగురిలో చెప్పుతో కొట్టింది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట కలకలం రేపుతోంది.
వీడియోలో కనిపించినదాని ప్రకారం, మూవీపై నిరసన తెలిపేందుకు కొందరు అక్కడకు వచ్చి నినాదాలు చేశారు. వారితో పాటు వచ్చిన నటి రుచి తొలుత ప్రొడ్యూసర్‌తో వాగ్వాదానికి దిగింది. ఈ క్రమంలో కరణ్ సింగ్‌ను ఆమె చెప్పుతో కొట్టింది.కరణ్ సింగ్ గతేడాది తన వద్ద డబ్బు తీసుకుని ఆ తరువాత మోసం చేశాడని రుచి గుజ్జర్ ఆరోపించింది. ఓ ప్రాజెక్టు కోసం రూ.23 లక్షలు తీసుకున్నాడని చెప్పింది. ఓ హిందీ టీవీ సీరియల్ ప్రొడ్యూస్ చేస్తున్నట్లు కరణ్ తెలిపాడని ఆరోపించింది. అది సోనీ టీవీలో ప్రసారమవుతుందని చెప్పినట్లు వెల్లడించింది. 'సహ నిర్మాతగా నన్ను చేర్చుకుంటానని అన్నాడు. నా కంపెనీ ఎస్‌ఆర్ ఈవెంట్స్ ఎంటర్‌టెయిన్మెంట్ ద్వారా పలు విడతల్లో డబ్బు చెల్లించా. కానీ ప్రాజెక్టు ప్రారంభం కాలేదు. డబ్బులు తిరిగిచ్చేయాలని అడిగినా అతడు వాయిదా వేస్తూ వచ్చాడు. ఆ డబ్బును సో లాంగ్ వ్యాలీకి మళ్లించినట్టు నాకు ఆ తరువాత తెలిసింది. మళ్లీ నేను డబ్బులు తిరిగివ్వమని కోరితే అతడు బెదిరింపులకు దిగాడు' అని ఆమె ఆరోపించింది.ఈ విషయంలో కరణ్ సింగ్‌పై ఒషివారా పోలీస్ స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ దాఖలైనట్టు ముంబై పోలీసులు తెలిపారు. రుచి ఫిర్యాదు మేరకు గురువారమే ఎఫ్‌ఐఆర్ నమోదైందని ఓ అధికారి పేర్కొన్నారు. ప్రాజెక్టు ప్రారంభం కాకపోయినా కరణ్ సింగ్ మాత్రం తనకు డబ్బు వెనక్కు ఇవ్వట్లేదంటూ ఆమె ఫిర్యాదు చేశారని అన్నారు. కరణ్ సింగ్‌పై మరో కేసు కూడా దాఖలు చేస్తామని నటి తరపు లాయర్ పేర్కొన్నారు.

## జన్ సురాజ్ ఓట్లు చీల్చే పార్టీ.. కానీ ట్విస్ట్ ఉంటుంది




పాట్నా: ఈ ఏడాది చివర్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండటంతో పార్టీల ప్రచార వేడి క్రమంగా పెరుగుతోంది. ప్రముఖ ఎన్నికల వ్యూహకర్తగా పేరుతెచ్చుకుని కొద్దికాలం క్రితం రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ప్రశాంత్ కిషోర్ తన రాజకీయ పార్టీ 'జన్ సురాజ్'పై గట్టి అంచనాలే పెట్టుకున్నారు. తాజాగా ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీ 'జన్ సురాజ్'ను 'ఓట్లను చీల్చే' పార్టీగా అభివర్ణించారు. కానీ ఇందులో ఒక ట్విస్ట్ కూడా ఉంటుందన్నారు.'జన్ సురాజ్ ఓట్లను చీల్చే పార్టీ. కానీ మేము చాలా ఓట్లు చీల్చుకుంటాం..అంతిమంగా ఎన్నికల్లో గెలుస్తాం' అని ప్రశాంత్ కిషోర్ తెలిపారు. తమ పార్టీ రాష్ట్ర రాజకీయ డైనమిక్స్‌లో గణనీయంగా మార్పులు తీసుకువస్తుందని చెప్పారు. జన్ సురాజ్ ప్రభావంతో చిన్న పార్టీల వర్గాలు, సపోర్ట్ బేస్ ఇప్పటికే తమ క్యాంపులోకి వచ్చేసిందని, చిన్న పార్టీలు ఉనికి కోల్పోయినందున వాటి గురించి ప్రజలు చర్చించుకోవడం మానేశారని అన్నారు. ప్రస్తుతం బీహార్‌లో రాజకీయ సంభాషణలన్నీ ఆర్జేడీ సారథ్యంలోని కూటమి, బీజేపీ-జేడీయూ కూటమి, జన్ సురాజ్ చుట్టూనే నడుస్తున్నాయని తెలిపారు.రెండో దెబ్బ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ జేడీయూపై పడుతుందని, జేడీయూ కార్యకర్తలు, మద్దతుదారులు, ఓటర్లు పెద్ద సంఖ్యలో జన్ సురాజ్ వైపు మళ్లుతున్నారని ప్రశాంత్ కిషోర్ చెప్పారు. జన్ సురాజ్ ఊపు ఇదేవిధంగా కొనసాగితే మూడో దెబ్బ బీజేపీపై పడుతుందని అన్నారు. రెండు రకాల బీజేపీ మద్దతుదారులు జన్‌సురాజ్ వైపు మొగ్గుచూపుతున్నారని, నాయకత్వంపైన, లోకల్ స్థాయిలో పనితీరుపై భ్రమలు తొలగిపోయిన వారు, పైస్థాయిలో మోదీ బాగా పనిచేస్తున్నప్పటికీ రాష్ట్ర స్థాయిలో వైవిధ్యం కోరుకుంటున్న వారు ఈ జాబితాలోకి వస్తారని చెప్పారు.ముస్లిం ఓటు బ్యాంకు సంప్రదాయంగా లాలూ ఆర్జేడీకి విధేయంగా ఉంటుందని, 30 ఏళ్లుగా ఇదే జరుగుతోందని, అయితే వారంతా ఇప్పుడు తమ వైపు మళ్లే అవకాశాలు ఉంటాయని చెప్పారు.
ప్రశాంత్ కిషోర్ తీసుకువచ్చిన 'జన్ సురాజ్' ఉద్యమం రాష్ట్ర ప్రజలను ఆకర్షించిందనే చెప్పాలి. అయితే, ఇదంతా ఓట్లుగా మార్చుకోగలదా అనే ప్రశ్న కూడా ఉంది. ప్రశాంత్ కిషోర్ నిజాయితీ, అభ్యుదయ స్థాయి నుంచి చేపడుతున్న ప్రచారం బీహార్ రాజకీయాలపై ఏమేరకు ప్రభావం చూపనుందనే చర్చ కూడా జరుగుతోంది. ఆర్జేడీ సారథ్యంలోని మహాఘట్‌బంధన్, ఎన్డీయే కూటమి మధ్య పొత్తులు ఖరారై పోటీ రెండు కూటముల మధ్యే ఉంటుందని అనుకుంటున్న తరుణంలో జన్ సురాజ్ తెరపైకి వచ్చింది. దీంతో ప్రధాన పార్టీల సంప్రదాయ ఓట్ బ్యాంకును ఆ పార్టీ ఏమేరకు గండికొట్టనుందనేది ఆసక్తికరంగా మారుతోంది.

## ఎంతకు తెగించార్రా.. ఆడాళ్ల స్కీమ్‌లో మగాళ్లు..



తక్కువ ఆదాయం కలిగిన ఆడవాళ్లను ఆర్థికంగా ఆదుకునేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం 'లడ్కీ బెహన్ యోజన' స్కీమ్ ప్రవేశపెట్టింది. అర్హులైన ఆడవాళ్లకు నెలకు 1500 రూపాయలు అందిస్తోంది. 21 నుంచి 65 సంవత్సరాల వయసు కలిగిన వారికి ఆర్థికసాయం చేస్తోంది. మహారాష్ట్రలో మహాయుతి కూటమి అధికారంలోకి రావడానికి ఈ పథకం కూడా ఓ కారణం. అయితే, అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకం కారణంగా ప్రభుత్వం విమర్శల పాలు అవుతోంది. ప్రభుత్వం మీద ఏకంగా భారీగా ఆర్థిక భారం పడుతోంది.లడ్కీ బెహన్ యోజన కింద ప్రభుత్వం 24.1 మిలియన్ మంది అర్హులైన ఆడవారికి వారికి 3,700 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది. గత సంవత్సరం 1,640 కోట్లు ఖర్చు అయ్యాయి. అయితే, 24.1 మిలియన్లలో ఐదు లక్షల మంది అనర్హుల్ని ప్రభుత్వం గుర్తించింది. అంతేకాదు.. సాధారణంగా ఇంట్లో ఒక మహిళ ఉంటే 1500 రూపాయలు వస్తాయి. అదే ఇద్దరు ఉంటే 3000 వేలు వస్తాయి. ఇలా ఎంత మంది ఉంటే అన్ని 1500 రూపాయలు వస్తాయి. ఇంట్లో ఒకరి కంటే ఎక్కువ మంది ఆడవాళ్లు ఉండటం వల్ల అదనంగా 1,196 కోట్ల రూపాయలు ఖర్చయింది.ఆడాళ్ల స్కీములో మగాళు ..ఆడవాళ్ల కోసం ప్రవేశపెట్టిన ఈ స్కీముకు మగాళ్లు కూడా అప్లై చేసుకున్నారు. ఫేక్ ఐడీలు సృష్టించి పథకానికి అర్హత పొందారు. దాదాపు 14,298 మంది మగాళ్లు ఫేక్ గుర్తింపుతో ఈ పథకం కింద ఆర్థికసాయం పొందారు. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా 10 నెలల పాటు ప్రతీ నెలా 1500 రూపాయలు పొందారు. వీరి కారణంగా ప్రభుత్వానికి 21.44 కోట్లు అదనంగా ఖర్చు అయింది. పది నెలల తర్వాత 'ది ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్' ఆ 14 వేల మంది గుట్టురట్టయింది. వారిని పథకం నుంచి తొలగించారు.

## నకిలీ రాయబార కార్యాలయం కేసులో వెలుగులోకి షాకింగ్ వాస్తవాలు.. రూ.300 కోట్లకు పైగా..



ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్‌లో నకిలీ కార్యాలయం కేసు దర్యాప్తులో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. సుమారు రూ.300 కోట్ల విలువైన కుంభకోణంతో సంబంధాలు ఉన్నట్లు తేలింది. ఈ కార్యాలయాన్ని నడిపే హర్షవర్ధన్ జైన్ పదేళ్లలో సుమారు 162 విదేశీ పర్యటనలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. వివరాల్లోకి వెళితే..
ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో రెండు అంతస్తుల లగ్జరీ భవనాన్ని 'వెస్టార్కిటికా' రాయబార కార్యాలయంగా నడుపుతున్న హర్షవర్ధన్ జైన్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అమెరికాకు చెందిన ట్రావిస్ మెక్‌హెన్రీ అనే వ్యక్తి 2001లో వెస్టార్కిటికా అనే దేశాన్ని స్థాపించాడు. అయితే వెస్టార్కిటికాను ఏ దేశం గుర్తించలేదు. ఇలా ఉండగా హర్షవర్ధన్ ఈ దేశానికి బారన్‌గా పనిచేసుకుని ఘజియాబాద్‌లో రాయబార కార్యాలయం తెరిచాడు. విదేశాల్లో పని ఇప్పిస్తామంటూ యువకులను ఆకర్షించడానికి ఉద్యోగాల రాకెట్ నడుపుతున్నాడని విచాణలో తేలింది. రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ఇతర ప్రముఖులతో మార్ఫింగ్ చేసిన ఫొటోలు పెట్టుకుని మోసం చేస్తున్నట్లు గుర్తించారు.ఈ కేసు విచారణలో రోజుకో షాకింగ్ ట్విస్టులు వెలుగులోకి వస్తున్నాయి. హర్షవర్ధన్‌కు సుమారు రూ.300 కోట్ల కుంభకోణంలో సంబంధం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. అలాగే ఇతడికి అంతర్జాతీయ హై ప్రొఫైల్స్ కలిగిన వ్యక్తులతో సంబంధాలు ఉన్నట్లు తేలింది. అదేవిధంగా ఇతడికి దుబాయ్‌లో 6, మారిషస్‌లో ఒకటి, యూకేలో 3, భారత్‌లో ఒక బ్యాంకు అకౌంట్ ఉన్నట్లు గుర్తించారు. ఈ నకిలీ రాయబార కార్యాలయాన్ని2017 నుంచి కొనసాగిస్తున్నట్లు తెలిసింది.

## బట్టతల శాపం కాదు వరం.. నెలకు రూ.50 వేలు సంపాదిస్తున్న వ్యక్తి




**అలప్పుజా-నవభూమి:** బట్టతల ఉంటే అదృష్టమని అంతా చెబుతారు. కానీ బట్టతల ఉన్నవారికి అవమానాలే ఎదురవుతూ ఉంటాయి. అందుకే చాలా మంది రకరకాల నూనెలు, షాంపూలు వాడుతూ ఉంటారు. మరికొందరైతే విగ్గులు పెట్టుకోవడం, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసుకోవడం, రకరకాల ట్రీట్‌మెంట్లు తీసుకుంటూ ఉంటారు. తల మీద వెంట్రుకలు లేకపోతే.. ఈ సమాజంలో పరువు పోతుందని భయపడి.. ఒక రకమైన అభద్రతా భావానికి లోనవుతూ ఉంటారు. మనసుంటే మార్గం ఉంటుంది అన్నట్లుగా కళ్లతో కాకుండా మనసుతో పెట్టి చూస్తే.. అన్నీ పాజిటివ్‌గానే ఉంటాయి అని చెప్పడానికి ఈ సంఘటనే నిదర్శనం. ఎందుకంటే సాధారణంగా బట్టతల ఉన్నవారు నామోషీగా ఫీల్ అయితే.. ఈ వ్యక్తి మాత్రం బట్టతలనే.. తన ఆదాయ వనరుగా మార్చుకున్నాడు. దీంతో నెలకు రూ.50 వేలు ఆర్జిస్తూ.. బట్టతల ఉన్నవారికి ఒక ట్రెండ్ సెట్టర్‌గా నిలిచాడు. తన బట్టతలను ఒక అడ్వర్టైజ్‌మెంట్ బోర్డ్ (బిల్ బోర్డు)గా మార్చేసి.. డబ్బులు సంపాదిస్తున్నాడు. అతడే కేరళకు చెందిన వ్లాగర్ షఫీక్ హాషీమ్.మహిళలకైనా, పురుషులకైనా జుట్టు అనేది అందం. కానీ కొందరు పురుషులకు 30 ఏళ్లు దాటగానే బట్టతల వచ్చేస్తుంది. దీంతో చాలా నిరుత్సాహపడిపోతూ ఉంటారు. తోటివాళ్లు బట్టతల అని వెక్కిరిస్తుంటే.. లోలోపల, మానసికంగా చాలా కుంగిపోతారు. ఇక అలాంటివాళ్లు గర్వంగా తలెత్తుకునేలా చేస్తున్నాడు షఫీక్ హాషీమ్. కంటెంట్ క్రియేటర్, ట్రావెల్ వ్లాగర్ అయిన షఫీక్ హాషీమ్.. తన బట్టతలతో అద్భుతాన్ని సృష్టిస్తూ.. అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాడు. కేరళలోని అలప్పుజా జిల్లాకు చెందిన 36 ఏళ్ల షఫీక్ హాషీమ్.. తన బట్టతలపై ఒక కంపెనీ లోగోను వేసుకుని.. దానికి ప్రమోషన్ చేస్తూ డబ్బులు సంపాదిస్తున్నాడు.

**3 నెలలకు రూ.50 వేలు**

సరికొత్త ఆలోచనలు, వినూత్న పద్ధతులతో డిజిటల్ కంటెంట్ క్రియేటర్లు.. తమ ఫాలోయింగ్‌ను పెంచుకోవడమే కాకుండా.. ప్రమోషన్లు, యాడ్స్ చేసి డబ్బులు వెనకేసుకుంటున్నారు. తనకు తానే సరికొత్త బ్రాండ్‌గా మారిపోయి షఫీక్ హాషీమ్ అందరి చూపు తనవైపు తిప్పుకుంటున్నాడు. బట్టతలను ఒక అడ్వర్టైజింగ్ బోర్డుగా మార్చేసిన షఫీక్ హాషీమ్.. మొదటి కాంట్రాక్ట్‌ను 3 నెలల కాలానికి ఒక కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఇందుకోసం ఆ కంపెనీ.. షఫీక్ హాషీమ్‌కు రూ.50 వేలు చెల్లించనుంది. కొచ్చికి చెందిన ఒక హెయిర్ అండ్ స్కిన్ క్లినిక్‌కు సంబంధించిన లోగోను తాత్కాలికంగా టాటూ రూపంలో తన బట్టతలపై వేయించుకున్నాడు. ఇక తాను తీసే వీడియోల్లో ఈ బ్రాండ్ ప్రమోషన్ చేయనున్నాడు.

**హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్**

మొదట బట్టతల కారణంగా తాను చాలా ఇబ్బందికి గురయ్యానని.. దీంతో తాను హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసుకునేందుకు సిద్ధమైనట్లు షఫీక్ హాషీమ్ వెల్లడించాడు. అదే సమయంలో తనకు ఈ ఆలోచన వచ్చిందని తెలిపాడు. చాలా లోతుగా ఆలోచించిన తర్వాత.. బట్టతల సహజమైందని.. అందులో సిగ్గుపడాల్సింది ఏం లేదని తాను గ్రహించినట్లు పేర్కొన్నాడు. అందుకే తాను దాన్ని ఉపయోగించుకుని.. డబ్బు సంపాదించే ఒక ఆదాయ మార్గంగా మార్చుకోవాలని అనుకున్నట్లు షఫీక్ చెప్పాడు. ఇక తన పని చాలా సులువు అని.. తాను యూట్యూబ్ వీడియోలు తీసే సమయంలో తన బట్టతలపై యాడ్స్ కోసం రకరకాల బ్రాండ్‌లను ఆహ్వానించడమేనని వెల్లడించాడు. ఈ బంపరాఫర్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన తర్వాత.. అది చాలా వేగంగా మీడియా, కార్పొరేట్ సంస్థలకు చేరి.. వారిని ఆకర్షించిందని చెప్పుకొచ్చాడు.

**బట్టతల లాభదాయకమే!**

సదరు కంపెనీతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా.. వచ్చే 3 నెలల పాటు తన బట్టతలపై ఆ కంపెనీ యాడ్ స్పష్టంగా కనిపించేలా వీడియోలు తీస్తానని షఫీక్ హాషీమ్ తెలిపాడు. యూజర్ల దృష్టిని ఆకర్షించేందుకు తన బట్టతలకు ప్రాముఖ్యత ఇస్తానని చెప్పాడు. అయితే తన బట్టతలపై వేసుకున్న తాత్కాలిక టాటూను తొలగించడం పెద్ద కష్టమేమీ కాదని వెల్లడించాడు. కొన్ని రసాయనాల ఉపయోగించి.. సులభంగా తొలగించవచ్చని.. కానీ ఈ ఆలోచన మాత్రం పర్మినెంట్‌గా ఉంటుందని చెప్పాడు. ఇలా బ్రాండ్ ప్రమోషన్స్ కోసం బట్టతలను ఇలా అద్దెకు ఇచ్చిన తొలి వ్యక్తిని దేశంలో, ప్రపంచంలోనే తానే అనుకుంటున్నానని వివరించాడు.

**ఆలోచన వెనుక అద్భుతం**

తాను బట్టతలను బిల్ బోర్డుగా మార్చడం డబ్బులు సంపాదించడానికో లేక సోషల్ మీడియా, మీడియాలో వైరల్ కావడం కోసం కాదని.. మనిషి రంగును, వేషాన్ని, ఆకారాన్ని ఈ సమాజం చూసే చూపును మార్చడం కోసమని.. మనలో ఉన్న లోపాలను ఎదుటి వారు హేళన చేయకుండా, వాటి వల్ల మనం ఆత్మస్థైర్యం కోల్పోకుండా.. ఆత్మవిశ్వాసంతో మనలో ఉన్న లోపాన్ని ఎలా బలంగా మార్చుకోవచ్చో నిరూపించడమే తన ఉద్దేశ్యమని షఫీక్ హాషీమ్ వెల్లడించాడు.

**కాలేజీ రోజుల నుంచే!**

తాను కాలేజీ చదివే రోజుల నుంచే బట్టతల ఉండేదని షఫీక్ హాషీమ్ స్పష్టం చేశాడు. అయితే అప్పుడు ఫ్రెండ్స్ సరదాగా తనను బట్టతల విషయంలో ఆటపట్టించేవారని పేర్కొన్నాడు. దాన్ని తాను ఎప్పుడూ సీరియస్‌గా తీసుకోలేదని.. బట్టతల ఉన్నవారంతా ఇప్పుడు రకరకాల ట్రీట్‌మెంట్లు, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసుకుంటుంటే.. ఉన్న బట్టతల నుంచే డబ్బులు ఎందుకు సంపాదించకూడదు అని తాను అనుకున్నట్లు చెప్పాడు. మొదట తన ఆలోచనను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది వైరల్ అయిందని.. అది చివరికి ఓ సంస్థకు చేరి.. తనతో ఒప్పందం జరిగినట్లు వెల్లడించాడు.
షఫీక్ హాషీమ్‌కు '70%mm Vlogs అనే ఒక యూట్యూబ్ ఛానెల్ ఉంది. ఆ ఛానెల్‌కు 28 వేల మందికి పైగా సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. కేరళ, సౌదీ అరేబియాలో ఒకప్పుడు ప్రోగ్రామ్ ప్రొడ్యూసర్, డిజిటల్ కంటెంట్ క్రియేటర్‌గా పనిచేసిన షఫీక్ హాషీమ్.. అదే అనుభవంతో ఇప్పుడు యూట్యూబ్ ఛానెల్‌ను నడుపుతూ.. ఇలాంటి వినూత్న ఆలోచనలకు శ్రీకారం చుడుతున్నాడు. రానున్న రోజుల్లో ఇలాంటివే మరిన్ని యాడ్స్ రావాలని కోరుకుంటున్నాడు.

## లొకేషన్ హిస్టరీ మిస్ మ్యాచ్.. మెడిక్లైమ్ తిరస్కరించిన బీమా కంపెనీ..!



**అహ్మదాబాద్-నవభూమి:** గుజరాత్‌కు చెందిన ఒక వ్యక్తికి బీమా కంపెనీ ఊహించని షాక్ ఇచ్చింది. అనారోగ్యానికి గురైన అతడు ఆసుపత్రిలో చికిత్స పొందిన తర్వాత మెడిక్లెయిమ్ కోసం బీమా కంపెనీకి దరఖాస్తు చేసుకున్నాడు. అయితే, లొకేషన్ హిస్టరీ సరిగ్గా లేదనే కారణంతో అతడి అభ్యర్థనను ఇన్సూరెన్స్ కంపెనీ తిరస్కరించింది. దీంతో అవాక్కైన బాధితుడు చివరకు వినియోగదారుల ఫోరంను ఆశ్రయించాడు. అక్కడ అతడికి అనుకూలంగా తీర్పు వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. వల్సద్ జిల్లా సిల్వసాకు చెందిన వల్లభ్ మట్కా అనే వ్యక్తి గో డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలో పాలసీ తీసుకున్నాడు.గతేడాది సెప్టెంబర్‌లో న్యుమోనియా రావడంతో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నాడు. డిశ్చార్జ్ అయిన తర్వాత మెడికల్ బిల్లులు (రూ.48,251) క్లెయిమ్ కోసం బీమా కంపెనీకి పంపించాడు. అయితే, గూగుల్ టైమ్‌లైన్ (లొకేషన్ హిస్టరీ) సరిపోవడం లేదని కంపెనీ క్లెయిమ్‌ను తిరస్కరించింది. దీనిపై వల్లభ్ వల్సాద్ జిల్లా వినియోగదారుల కోర్టులో ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ చేపట్టిన కన్స్యూమర్ కోర్టు.. బీమా కంపెనీకి నోటీసులు పంపింది. ఆసుపత్రి బిల్లులు, కేసు వివరాలు, గూగుల్ టైమ్‌లైన్ స్టేట్‌మెంట్‌లో చాలా తేడాలు ఉన్నాయని ఫోరం దృష్టికి బీమా కంపెనీ తీసుకువచ్చింది.అతడు చికిత్స సమయంలో ఫోన్ తన దగ్గరే ఉందని చెప్పాడని, కానీ గూగుల్ టైమ్‌లైన్ ప్రకారం అతడి గూగుల్ మ్యాప్‌లో ఆసుపత్రి లొకేషన్ కనిపించలేదని కంపెనీ తెలిపింది. అయితే, ఆసుపత్రి రికార్డులను పరిశీలించిన వినియోగదారుల ఫోరం అతడు ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నట్టు నిర్ధారించింది. "ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకున్నట్లు ఇన్సూరెన్స్ కంపెనీ పేర్కొంది. అయినప్పటికీ, ఈ క్లెయిమ్‌ను తిరస్కరించేందుకు గూగుల్ టైమ్‌లైన్ పేరుతో తప్పుడు కారణం చూపుతున్నట్లు కనిపిస్తోంది' అని ఫోరం అభిప్రాయపడింది.చివరికి, క్లెయిమ్‌ను పరిష్కరించాలని, అలాగే 8 శాతం వడ్డీ చెల్లించాలని బీమా కంపెనీని అదేశిస్తూ జులై 14న తీర్పు వెల్లడించింది. గూగుల్ టైమ్‌లైన్ ఆధారంగా క్లెయిమ్‌ను తిరస్కరించడం సరికాదని ఫోరం స్పష్టం చేసింది. ఆసుపత్రి రికార్డులు, ఇతర ఆధారాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. బీమా కంపెనీ తీరును తప్పుబట్టి బాధితుడికి న్యాయం చేసింది.

## ఎన్‌సీఈఆర్‌టీ కొత్త సిలబస్‌లో ఆపరేషన్ సిందూర్, చంద్రయాన్..!





**శ్రీనగర్-నవభూమి:** దేశంలోని విద్యార్థులకు దేశభక్తి, జాతీయ భద్రత, సైనిక వ్యూహం, దౌత్యం ప్రాముఖ్యతను బోధించాలని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ప్రత్యేక మాడ్యూల్‌ను సిద్ధం చేస్తోంది. ఈ మాడ్యూల్ రెండు భాగాలుగా విభజిస్తారు. ఒకటి 3- 8 తరగతుల విద్యార్థుల కోసం, మరొకటి 9 నుండి 12 తరగతుల విద్యార్థుల కోసం రూపొందిస్తారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత సైన్యం చూపిన ధైర్యసాహసాలతో పాటు ఆదిత్య ఎల్1, చంద్రయాన్ అంతరిక్ష మిషన్లు, ఇటీవల శుభాన్షు శుక్లా 'అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)'కు వెళ్లిన అంశాలను కొత్త సిలబస్‌లో చేర్చనున్నారు.
ఆపరేషన్ సిందూర్ అంశాన్ని పాఠ్యాంశంలో చేర్చాలనే ఆలోచనతో ఉన్నట్లు గతంలోనే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ప్రకటించారు. భావిభారత పౌరులైన విద్యార్థుల్లో దేశభక్తిని, జాతీయ భావనను పెంపొందించాలనే లక్ష్యంతో తాజాగా ఎన్‌సీఈఆర్‌టీ కీలక ముందడుగు వేసింది. ప్రిలిమినరీ స్థాయి నుంచి ఉన్నత స్థాయి విద్యార్థుల వరకూ ఆపరేషన్ సిందూర్‌పై ప్రత్యేక సిలబస్ రూపకల్పనకు సన్నాహాలు చేస్తోంది. ఒక్కో మాడ్యూల్ 8 నుంచి 10 పేజీల వరకూ ఉంటుంది. ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లో పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత భారత్ అనుసరించిన వ్యూహాత్మక, సైనిక ప్రతిస్పందన, దౌత్యపరమైన చిక్కులు, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకున్న చర్యలను పాఠ్యాంశాల్లో కవర్ చేస్తారు.వర్షాకాల సమావేశాల సందర్భంగా వారం రోజుల పాటు పార్లమెంటు కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్ పై సోమవారం నుంచి లోక్‌సభలో ప్రత్యేక చర్చ ప్రారంభం కానుంది. ఈ ఆపరేషన్ పై అధికారిక చర్చ జరగాలని ప్రతిపక్షాలు సైతం సెషన్ మొదటి రోజున గట్టిగా డిమాండ్ చేశాయి. మూడు రోజుల పాటు కొనసాగే 16 గంటల చర్చలో రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కీలక ప్రసంగాలు చేసే అవకాశం ఉంది.నాగుపామును కొరికిన చంటి పిల్లాడు.. పాము మృతి.. బాబు సేఫ్ బీహార్‌లోని పశ్చిమ చంపారన్ జిల్లా బేతియా నగరంలో ఓ అద్భుతం జరిగింది. కాటేసేందుకు వచ్చిన నాగుపామును ఓ ఏడాది పసిబిడ్డ కొరకడంతో ఆ పాము అక్కడికక్కడే మరణించింది.

## దేశంలోనే పేద రైతు.. వార్షిక ఆదాయం రూ.3గా ఇన్‌కమ్ సర్టిఫికెట్ జారీ



**భోపాల్-నవభూమి:** ఒక రైతు వార్షిక ఆదాయం కేవలం రూ.3. ఈ మేరకు ఇన్‌కమ్ సర్టిఫికెట్‌లో పేర్కొన్నారు. అధికారులు జారీ చేసిన ఈ ఆదాయ ధృవీకరణ పత్రం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో అతడ్ని దేశంలోనే పేద రైతుగా నెటిజన్లు అభివర్ణించారు. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో ఈ సంఘటన జరిగింది. సత్నా జిల్లా కోఠి తహసీల్ పరిధిలోని నయాగావ్ గ్రామానికి చెందిన 45 ఏళ్ల రాంస్వరూప్ రైతు. ఆదాయ ధృవీకరణ పత్రం కోసం అతడు దరఖాస్తు చేశాడు. జూలై 22న తహసీల్దార్ సౌరభ్ ద్వివేది సంతకంతో ఇన్‌కమ్ సర్టిఫికెట్ జారీ అయ్యింది. రైతు రామ్‌స్వరూప్ వార్షిక ఆదాయాన్ని రూ.3గా ఇందులో పేర్కొన్నారు. ఈ సర్టిఫికెట్ ప్రకారం రాంస్వరూప్ నెలకు 25 పైసలు సంపాదిస్తున్నట్లు తెలుస్తున్నది.
కాగా, ఈ ఆదాయ ధృవీకరణ పత్రం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో విమర్శలు వెల్లువెత్తాయి. మధ్యప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వంపై ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మండిపడింది. 'మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ పాలనలో, భారతదేశంలో అత్యంత పేద వ్యక్తిని మేం కనుగొన్నాం. వార్షిక ఆదాయం కేవలం రూ.3, ఇది షాకింగ్ కాదా? ప్రజలను పేదలుగా మార్చే లక్ష్యం? ఎందుకంటే ఇప్పుడు కుర్చీ కూడా కమీషన్ తింటున్నది' అని ఆరోపించింది.మరోవైపు ఈ ఇన్‌కమ్ సర్టిఫికెట్‌పై విమర్శలు రావడంతో సంబంధిత అధికారులు స్పందించారు. 'క్లరికల్ ఎర్రర్' వల్ల ఇలా జరిగిందని వివరణ ఇచ్చారు. కొత్త ఆదాయ ధృవీకరణ పత్రాన్ని జూలై 25న జారీ చేశారు. రాంస్వరూప్ వార్షిక ఆదాయం రూ.30,000గా అందులో పేర్కొన్నారు. అంటే ఆ రైతు నెల సంపాదన రూ.2,500కు పెరిగింది.

## ఫేక్ పాస్‌పోర్ట్‌తో టర్కీకి పారిపోయి.. పెళ్లిచేసుకున్న హమాస్ చీఫ్ యహ్యా సిన్వార్ భార్య!




**గాజా-నవభూమి:** గత 21 నెలలుగా గాజాలో హమాస్, ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ సైన్యం దాడిలో హతమైన హమాస్ మాజీ చీఫ్ యహ్యా సిన్వార్ భార్య సమర్ మహమ్మద్ అబూ జమర్ గాజా నుంచి పారిపోయి ప్రస్తుతం టర్కీలో వేరే జీవితం గడుపుతోందని ఇజ్రాయెల్ మీడియా సంస్థ వైనెట్ సంచలన నివేదిక వెలువరించింది. గతేడాది అక్టోబర్ 16న ఇజ్రాయెల్ సైన్యం యహ్యా సిన్వార్‌ను హత్య చేసిన విషయం తెలిసిందే. గాజాలోని ఇస్లామిక్ యూనివర్సిటీ నుంచి సమర్ జమర్ థియాలజీలో మాస్టర్స్ డిగ్రీ చేశారు. ఆమె నకిలీ పాస్‌పోర్టు సహాయంతో తన పిల్లలను తీసుకుని రఫా సరిహద్దుల నుంచి ఈజిప్టుకి, అక్కడి నుంచి టర్కీకి చేరిందని సమాచారం. "ఆమె ఇక్కడ (గాజా) లేదు - టర్కీలో పిల్లలతో కలసి ఉంది.. భారీ మొత్తంలో డబ్బు, హైలెవల్ సహకారం లేకుంటే ఇది సాధ్యం కాదు" అని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇరాన్‌లో హమాస్ అధినేత ఇస్మాయిల్ హనియేను ఇజ్రాయెల్ సైన్యం హత్య చేసిన తర్వాత సిన్వార్ బాధ్యతలు చేపట్టారు.సిన్వార్ మరణం తరువాత మరో మహిళ పేరున నకిలీ పాస్‌పోర్ట్‌తో గాజా నుంచి టర్కీకి పారిపోయి మళ్లీ వివాహం చేసుకున్నారని నివేదిక పేర్కొంది. హమాస్ రాజకీయ విభాగం నేత ఫాతీ హమ్మాద్ ఆమె గాజా దాటేందుకు ఏర్పాటు చేశాడని తెలిపింది. హమ్మాద్ ఇప్పటికే హమాస్ నేతల కుటుంబాలను గాజా నుంచి తరలించే ప్రయత్నాల్లో కీలక పాత్ర పోషిస్తున్నట్టు గతంలో ఆరోపణలు వచ్చాయి.వైనెట్ నివేదక ప్రకారం.. హమాస్ వర్గాలు 2023 చివరిలోనే తమ కీలక నేతల కుటుంబాలను గాజా నుంచి తరలించేందుకు ప్రత్యేక వ్యవస్థను నిర్మించాయి. ఇందుకోసం నకిలీ డాక్టర్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టులు, ప్రత్యేక వాహనాలు వాడతారని పేర్కొంది. యహ్యా సిన్వార్ సోదరుడు మహమ్మద్ సిన్వార్ భార్య నజ్వా కూడా ఇదే మార్గంలో గాజా నుంచి పారిపోయినట్టు తెలుస్తోంది.ఇజ్రాయెల్ దళాలు 2024 అక్టోబరు 16న రఫా నగరంలోని తాల్ అల్-సుల్తాన్ అనే ప్రాంతంలో తనిఖీలు చేస్తున్న సమయంలో శిథిలమైన భవనంలో గాయాలతో ఉన్న సిన్వార్‌ను డ్రోన్ ద్వారా గుర్తించారు. ఈ వీడియోను ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) విడుదల చేసింది. ఒక కుర్చీలో కూర్చొన్న సిన్వర్.. కర్రను డ్రోన్ మీదకు విసిరిన దృశ్యాలు వీడియోలో రికార్డయ్యాయి. అనంతరం జరిపిన కాల్పుల్లో తలపై బుల్లెట్ తగిలి సిన్వార్ మరణించాడు.
కాగా, గత 21 నెలలుగా ఇజ్రాయెల్ దాడులతో గాజా పూర్తిగా ధ్వంసమైంది. ఇప్పటి వరకూ 58 వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థల ప్రకారం గాజాలో ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. శిశువులు సహా 111 మంది ఆకలితో మరణించారు. అలాగే, సాయం కోసం వచ్చిన వారిలో 1,060 మంది దాడుల్లో మృతిచెందగా.. 7,200 మందికిపైగా గాయపడ్డారు. 71 వేల మంది బాలలు, 17 వేల మంది గర్భిణీ/ తల్లులు అత్యవసర పోషణ అవసరంలో ఉన్నారు.

## నాగుపామును కొరికిన చంటి పిల్లాడు.. పాము మృతి.. బాబు సేఫ్



**పాట్నా-నవభూమి:** బీహార్‌లోని పశ్చిమ చంపారన్ జిల్లా బేతియా నగరంలో ఓ అద్భుతం జరిగింది. కాటేసేందుకు వచ్చిన నాగుపామును ఓ ఏడాది పసిబిడ్డ కొరకడంతో ఆ పాము అక్కడికక్కడే మరణించింది. ఆ తర్వాత స్పృహ తప్పిన పిల్లాడిని దవాఖానకు తీసుకెళ్లి చికిత్స అందచేయడంతో అతడు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.తన ఇంటి సమీపంలో నేల మీద ఆడుకుంటున్న ఏడాది బాలుడు గోవింద చేతిని నాగుపాము చుట్ట చుట్టుకుంది. తన ముఖానికి అత్యంత సమీపంలో ఉన్న ఆ నాగుపామును చూసి ఏదో ఆట వస్తువనుకుని ఆ పిల్లాడు తన పదునైన దంతాలతో దాన్ని కొరికాడు. దీంతో అక్కడికక్కడే పాము చనిపోయింది.



# ఎరుపెంతో ఘనం!

అరటి పండు గురించి తొక్క ఒలిచి పెట్టినట్టు వివరించాల్సిన అవసరం లేదు. కానీ, అరటిపండు అంటే పసుపు రంగులో ఉండే పండు అని స్థిరపడిపోయిన భావన ఇప్పుడు మారిపోతున్నది. మార్కెట్లో పసుపు రంగులో ఉండే అరటిపళ్ల పక్కన లేత ఎరుపు రంగువీ కనిపిస్తున్నాయి. ఆరోగ్య ప్రయోజనాల కోసం అరటిపండు తినాలంటారు. ఇది వినడానికి బాగానే ఉన్నా కొనడానికి కొంచెం కష్టంగా ఉంటున్నది. ఎందుకంటే? ఆ ఆరోగ్య ప్రయోజనాలు పసుపు రంగు పండు తింటే దక్కుతాయో? ఎరుపు రంగు పండు తింటే వస్తాయో తెలియట్లేదు. ఈ సందేహాన్ని పోషకాహార నిపుణుల్ని నివృత్తి చేయమని అడిగితే.. రెండు రకాలూ పోషకాల గనులే అని చెబుతున్నారు. అయితే, ఎరుపు రంగు అరటిపండులో పోషకాలు కాస్త ఎక్కువగా ఉంటాయని సెలవిస్తున్నారు.

అయితే, ఈ రెడ్ బనానాలు హైబ్రిడ్ బాపతని కొందరి అపోహ! కొత్తరంగును చూసి హైబ్రిడ్ అనుకోవద్దని చెబుతున్నారు. ఈ రెడ్ బనానాలో విటమిన్ సి, యాంటి ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. తియ్యదనం కలిగించే ట్లైసెమిక్ ఇండెక్స్ (జీఐ) మాత్రం తక్కువగా ఉంటుంది. అందుకే డయాబెటిస్ రోగులకు, ఊబకాయులు ఎరుపు రంగు అరటిపళ్లు ఎంచుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. విటమిన్ బీ6, మెగ్నీషియం, బీటా కెరోటినాయిడ్లు కూడా ఇందులో అధికంగానే ఉంటాయట!



# ఆమే అతడి ధైర్యం



దాదాపు పాతికేళ్ళ క్రితమే తెర మీద నుంచి తప్పుకున్నా... భర్త అజిత్‌ను వెన్నంటి ప్రోత్సహించి... ఆయన విజయాలకు ప్రేరణనిస్తున్నారు షాలినీ. ఆడంబరాలకు దూరంగా ఉండే ఈ కోలీవుడ్ సెలబ్రిటీ జంట... దుబాయ్‌లో జరిగిన '24 హెచ్ కార్ రేసింగ్'లో సందడి చేసింది. షాలినీపై అజిత్ ప్రశంసలు, రేస్ అనంతరం ఆమెను హత్తుకున్న అతని ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. 'సఖి'గా యువ హృదయాలను దోచిన షాలినీ ఇప్పుడు భర్త కెరీర్‌కు, అభిరుచులకు అండగా నిలుస్తున్నారు.

"షాలూ! నన్ను రేస్‌లో పాల్గొననిచ్చినందుకు ధన్యవాదాలు..." దుబాయ్‌లో ఈ నెల రెండో వారంలో జరిగిన '24 హెచ్ కార్ రేసింగ్'లో తమ జట్టు మూడో స్థానంలో నిలిచిన తరువాత... తమిళ్ స్టార్ హీరో అజిత్ వేదిక పైనుంచి చెప్పిన ఈ మాటలకు ఆ హాల్ అంతా కరతాళ ధ్వనులతో మార్మోగింది. ముందు వరుసలో నిలబడిన అజిత్ భార్య షాలినీ చిరునవ్వుతో ప్రతిస్పందించారు. అంతకుముందు రేస్ పూర్తయ్యాక... జనంలోకి వచ్చిన అజిత్... షాలినీని చుంబించిన దృశ్యం క్షణాల్లో సోషల్ మీడియా అంతటా వైరల్ అయింది. 24 గంటలసేపు కొనసాగే ఈ రేస్... ఇటు రేసర్ సహనానికీ, అటు వాహనం సామర్థ్యానికీ పెద్ద పరీక్ష. పదిహేనేళ్ళ తరువాత రేస్ ట్రాక్ మీద సొంత టీమ్ తరఫున దిగిన అజిత్ తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకొని మరీ... టాప్-3లో నిలిచారు. అజిత్ హీరో, రేసర్ మాత్రమే కాదు, ఎన్నో పోటీల్లో పతకాలు గెలుచుకున్న షూటర్ కూడా! బైక్ మీద దేశం చుట్టేస్తూ ఉంటారు. డ్రోన్ టెక్నాలజీ లాంటి అభిరుచులు చాలా ఉన్నాయి. ప్రాణాలకు తెగించే సాహసాలంటే అతనికి ప్రాణం. "యాభై మూడేళ్ళ వయసులోనూ ఇవన్నీ చెయ్యగలుగుతున్నానంటే ఇల్లాలి ప్రోత్సాహమే కారణం. ఈ ఏడాది ఏప్రిల్‌కు పాతికేళ్ళు నిండే మా వైవాహిక జీవితంలో... షాలినీ చేసిన త్యాగాలే ఎక్కువ. ఆమే నా ధైర్యం" అంటారు అజిత్.

**మొదట్లో ఒప్పుకోలేదు...**

షాలినీ... ఒకప్పుడు దక్షిణాదిలో, ప్రధానంగా తమిళంలో అగ్రశ్రేణి బాలతార. నాలుగేళ్ళ వయసులోనే తెరంగేట్రం చేశారు. ఆమె తండ్రి దాస్‌కు సినిమాలంటే ఆసక్తి. నటుడు కావాలనుకున్న తన అభిరుచిని తన కుమార్తెలైన షాలినీ, షామిలీ, కుమారుడు రిచర్డ్ రిషి ద్వారా నెరవేర్చుకున్నారు. వారిలో తొలుత తెరంగేట్రం చేసిన షాలినీ.... తమిళ, కన్నడ, మలయాళ, హిందీ చిత్రాలతో పాటు 'బంధం', 'జైలుపక్షి', 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' తదితర తెలుగు చిత్రాల్లోనూ ఆకట్టుకున్నారు. ఆరేళ్ళ విరామం తరువాత హీరోయిన్‌గా రీఎంట్రీ ఇచ్చారు. వరుసగా సినిమాలు చేస్తున్న సమయంలో... అజిత్ హీరోగా 'అమర్కాలం' చిత్రాన్ని తీయాలనుకున్న దర్శకుడు శరణ్... కథానాయిక పాత్ర కోసం షాలినీని సంప్రతించారు. కానీ ప్లస్-2 పరీక్షలకు సిద్ధం అవుతున్న షాలినీ ఆ ఆఫర్‌ను తిరస్కరించారు. ఆ పాత్రను షాలినీతోనే చేయించాలనుకున్న శరణ్... మూడు నెలలపాటు తీవ్రంగా ప్రయత్నించి మరీ ఆమెను ఒప్పించారు.

**గాయంతో మొదలైన ప్రేమ**

ఆ సినిమా సెట్‌లోనే అజిత్‌కు, షాలినీకి పరిచయమైంది. షూటింగ్‌లో అనుకోని సంఘటన జరిగింది. అది షాలినీని అజిత్ కత్తితో బెదిరించే సన్నివేశం. అజిత్ కత్తిని పొరపాటున విదిలించడంతో... షాలినీ చేతికి గాయమై, రక్తస్రావమైంది. అజిత్ వెంటనే షూటింగ్ ఆపించి... ఆమెకు ప్రథమ చికిత్స చేయించారు. ఆ తరువాత ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. ఆ సమయంలో అజిత్ చూపిన శ్రద్ధకు ఫిదా అయిపోయానంటారు షాలినీ. "నా కారణంగా షాలినీకి గాయం కాగానే నాకు దిక్కు తోచలేదు. ఆమెకు ఎలాంటి ప్రమాదం లేదని తెలిశాక నా మనసు కుదుటపడింది. నేను ఆమెను ప్రేమిస్తున్నాననే విషయం కూడా అప్పుడే నాకు అర్థమైంది" అంటారు అజిత్. షూటింగ్ విరామంలో ఒకరికొకరు రహస్యంగా కాల్స్ చేసుకొనేవారు. ఈ ఇద్దరి ప్రణయం గురించి తమిళ పత్రికలు అప్పట్లో విస్తృతంగా రాశాయి కూడా. ఇలా కొన్ని నెలల డేటింగ్ తరువాత... ఇరు కుటుంబాలనూ ఒప్పించి, పెళ్ళి చేసుకున్నారు.

అది ఎంత కష్టమో తెలుసు...

మణిరత్నం దర్శకత్వంలో షాలినీ నటించిన 'అలై పాయుదే' (తెలుగులో 'సఖి') చిత్రం 2000 ఏప్రిల్ 14న విడుదలైంది. అదే నెల 24న అజిత్, షాలినీల వివాహం జరిగింది. అప్పటికే నటిస్తున్న మరో చిత్రాన్ని పూర్తి చేసిన షాలినీ ఇరవై రెండేళ్ళకే నటనకు స్వస్తి చెప్పి, గృహిణిగా స్థిరపడిపోయారు. ఇరవై నాలుగేళ్ళుగా మళ్ళీ తెరపై కనిపించలేదు. 'సఖి' చిత్రంతో ఆమె నటన సర్వత్రా ప్రశంసలందుకుంది. తమిళనాడు ప్రభుత్వం నుంచి ఉత్తమనటిగా ప్రత్యేక బహుమతి కూడా ఆమె అందుకున్నారు. ఈ క్రమంలో ఎన్నో ఆఫర్లు వచ్చినా ఆమె అంగీకరించలేదు. "ఎంతో మంది హీరోయిన్లు పెళ్ళయ్యాక కూడా నటిస్తున్నారు. మీకు ఆ ఆలోచన రాలేదా? అనే ప్రశ్న నాకు చాలాసార్లు ఎదురయింది. నటించడం అంటే నాకు ఎంతో ఇష్టం. కానీ అజిత్ నా ప్రాణం. సినిమాలను, ఇంటినీ బ్యాలెన్స్ చేసుకోవడం ఎంత కష్టమో నాకు తెలుసు. అలాంటి సమయాల్లో దేనికీ న్యాయం చెయ్యలేను. అందుకే ఇల్లు, సంసారం నా ప్రాధాన్యం అనుకున్నాను. దానికే కట్టుబడ్డాను" అని ఒక ఇంటర్వ్యూలో చెప్పారు షాలినీ. "ఆమె తీసుకున్న ఈ నిర్ణయం నా అదృష్టం. నా విజయాలన్నిటి వెనుక ఆమె ఉంది" అంటారు అజిత్. మళ్ళీ కార్ రేసుల్లోకి రావాలనే ఆలోచనతో 'అజిత్ కుమార్ రేసింగ్ టీమ్'ను ఆయన ప్రారంభించినప్పుడు... దాని బ్రోచర్ స్క్రీన్ షాట్‌ను షాలినీ షేర్ చేస్తూ "నిన్ను మళ్ళీ రేసింగ్ డ్రైవర్‌గా చూస్తున్నందుకు, నువ్వు ఇష్టపడేది నువ్వు చేస్తున్నందుకు ఎంతో సంతోషంగా అనిపిస్తోంది. భవిష్యత్తులో నీకు, నీ టీమ్‌కు సురక్షితమైన, విజయవంతమైన రేసింగ్ కెరీర్ లభించాలని కోరుకుంటున్నాను" అని ట్వీట్ చేశారు.

**ఆ క్రెడిట్ ఆమెదే...**

ఈ దంపతులకు ఒక అమ్మాయి, ఒక అబ్బాయి. వారి బాగోగులు చూసుకుంటూనే... 'మోహిని-మణి ఫౌండేషన్' బాధ్యతల్లో కూడా షాలినీ క్రియాశీలకంగా ఉన్నారు. తన తల్లితండ్రుల పేరిట అజిత్ ఏర్పాటు చేసిన ఈ లాభాపేక్షలేని సంస్థ... వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహనను, పౌర స్పృహను పెంపొందించడంతో సహా పలు కార్యక్రమాలను చేపడుతోంది. "ఆడంబరాలకు, వివాదాలకు దూరంగా ఉండే అజిత్-షాలినీది ఆదర్శప్రాయమైన జంట" అంటారు సినీ అభిమానులతో పాటు సినీ ప్రముఖులు కూడా. "ఈ క్రెడిట్‌లో అధిక శాతం షాలినీకే చెందాలి" అంటారు అజిత్. సక్సెస్‌లో ఉన్నప్పుడే సినీ రంగం నుంచి తప్పుకొని... భర్త విజయానికి అండగా నిలుస్తున్న షాలినీ... అజిత్‌తో పాటు దాదాపు ప్రతి రేస్‌కూ, పోటీకీ హాజరవుతారు. ప్రేక్షకుల గ్యాలరీలో కూర్చొని... ఆయనలో ఉత్సాహాన్ని నింపుతూ ఉంటారు. ప్రస్తుతం అజిత్ పూర్తి చేసిన రెండు సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. ఆ తరువాత ఆయన మరే చిత్రానికీ సంతకం చెయ్యలేదు. తన రేసింగ్ కెరీర్, టీమ్ మీదే ప్రధానంగా దృష్టి పెడుతున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో రేసింగ్ సీజన్ పూర్తయ్యాక... మళ్ళీ సెట్స్ పైకి వస్తారు. తదుపరి రేసులకు సిద్ధమవుతున్న అజిత్ నటననూ, అభిరుచినీ సమతుల్యం చేసుకోవడంలో షాలినీ ముఖ్యపాత్ర పోషిస్తున్నారు.

# మెనోపాజ్ డేంజరా?



మహిళల్లో సాధారణంగా జరిగే ప్రక్రియ.. మెనోపాజ్. అయితే, ఇది కేవలం హార్మోన్లపైనే ప్రభావం చూపించడం లేదట. అనేక ఆరోగ్య సమస్యలనూ మోసుకొస్తున్నదట. తాజా పరిశోధన ప్రకారం.. మెనోపాజ్ దశకు చేరుకున్న వారిలో గుండె వ్యాధుల ప్రమాదం పెరగడంతోపాటు కీళ్ల నొప్పులు, బ్రెయిన్ ఫాగ్ లాంటి మరిన్ని సమస్యలూ కనిపిస్తున్నాయట. మెనోపాజ్ దశకు చేరుకున్న మహిళల్లో సాధారణంగా ఈస్ట్రోజెన్ హార్మోన్లు తగ్గుముఖం పడుతాయి. అదే సమయంలో సైటోకిన్ల స్థాయులు పెరుగుతాయి. ఈ మార్పు.. రక్తనాళాలపై ప్రభావం చూపి, హృదయ సంబంధ సమస్యలకు దారి తీస్తుందని పరిశోధకులు చెబుతున్నారు.

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ ప్రకారం.. మెనోపాజ్‌కు చేరుకోని అదే వయసు గల స్త్రీలతో పోలిస్తే.. మెనోపాజ్‌కు గురైన మహిళల్లో హృదయ సంబంధ వ్యాధులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉన్నదని అధ్యయనాలు నిరూపించాయి. కీళ్ల ఆరోగ్యాన్ని కాపాడటంలో ఈస్ట్రోజెన్ కీలకపాత్ర పోషిస్తుంది. ఈ హార్మోన్లు తగ్గడం వల్ల కీళ్ల వాపు పెరుగుతుంది. ఆస్టియో ఆర్థరైటిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్ వంటి సమస్యలు దాడిచేస్తాయి. అప్పటికే ఉన్నవారిలో మరింత తీవ్రమవుతాయి. ఇక న్యూరో ఇన్‌ఫ్లమేషన్‌పైనా.. మెనోపాజ్ ప్రభావం గురించి అనేక పరిశోధనలు కొనసాగుతున్నాయి. వయసు పెరగడం, ఈస్ట్రోజెన్ స్థాయులు తగ్గడం వల్ల.. ఇతర కణజాలాల మాదిరిగానే మెదడు కూడా ప్రభావితం అవుతుంది. ఈ న్యూరో ఇన్‌ఫ్లమేషన్.. బ్రెయిన్ ఫాగ్‌తోపాటు జ్ఞాపకశక్తినీ దెబ్బతీస్తుంది. పెరిమెనోపాజ్-మెనోపాజ్ సమయంలో కనిపించే మార్పులు.. వివిధ శారీరక వ్యవస్థలపై ప్రభావం చూపుతాయనీ, గుండె జబ్బులు, కీళ్ల నొప్పులతోపాటు జీర్ణ సమస్యలు, చర్మ సమస్యలకు కారణమవుతాయనీ 'హార్వర్డ్ హెల్త్' చెబుతున్నది. ఈ సమస్యలను నివారించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలనీ, సమతుల ఆహారం తీసుకోవడం, క్రమంతప్పని వ్యాయామం చేయడంతోపాటు తగినంత నిద్రపోవాలని సూచిస్తున్నది.

# నోటి దుర్వాసన పోవాలంటే



కొందరికి ఎప్పుడూ నోరు దుర్వాసన వస్తూ ఉంటుంది. దంతాలు, చిగుళ్ల సమస్యలు, సరిగ్గా బ్రష్ చేయకపోవడం, కొన్ని రకాల ఆహార పదార్థాలు తినడం.. వంటి కారణాలు కూడా దుర్వాసనకు కారణం. దీనివలన నలుగురిలో మాట్లాడడం చాలా ఇబ్బందికరంగా మారుతుంది. మరి ఈ దుర్వాసనను ఎలా తగ్గించుకోవచ్చో తెలుసుకుందాం..దంతాల మధ్యలో ఇరుక్కున్న ఆహార పదార్థాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.

భోజనం తరువాత మర్చిపోకుండా నోటిని నీరుతో పుక్కిలించాలి. అలాగే రోజూ రెండుసార్లు పళ్లు తోముకోవాలి.

నోటి దుర్వాసనకు ప్రధాన కారణం బ్యాక్టీరియా. ఉప్పు నీటితో నోటిని పుక్కిలిస్తే ఆ బ్యాక్టీరియాను నిర్మూలించవచ్చు.

కొత్తిమీర, పుదీనా నమిలినా నోటి దుర్వాసన సమస్య తగ్గుతుంది.

బేకింగ్‌సోడాలో యాంటీ బ్యాక్టీరియా లక్షణాలు ఉన్నాయి. దీనిని మౌత్‌వాష్‌గా ఉపయోగించినా మంచి ఫలితాలు ఉంటాయి. యాపిల్, క్యారెట్, పుచ్చకాయ, పైనాపిల్ వంటి పళ్లు నోటి దుర్వాసన తగ్గించడంలో బాగా సహాయపడతాయి. నోరు పొడిబారడం కూడా దుర్వాసనకు కారణం. కాబట్టి తరచూ నీరు తాగుతూ నోరు ఆరిపోకుండా చూసుకోవాలి.

# భలే భలే బుగాడి



బుగాడి అనేది సంప్రదాయ చెవి ఆభరణం. తెలుగు రాష్ట్రాలతోపాటు దేశంలోని చాలా ప్రాంతాల్లో సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా ఈ బుగాడికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా దీన్ని స్త్రీత్వానికి, సౌందర్యానికి ప్రతీకగా భావిస్తుంటారు. రవివర్మ చిత్రాల్లో కూడా మహిళలు బుగాడిని అలంకరించుకుని ఉండడం కనిపిస్తుంది. ఇలా ఒకప్పుడు స్త్రీలు సంప్రదాయంగా ధరించిన బుగాడి నేడు సరికొత్త హంగులతో ట్రెండింగ్‌లోకి వచ్చేసింది.

**బుగాడి ప్రత్యేకత:** చెవి పైన వెలుపలి భాగంలో అంచుకు పెట్టుకునే ఆభరణమే బుగాడి. ఇలా రెండు చెవులకూ పెట్టుకుంటారు. కొన్ని వర్గాలవారు అయిదారు బుగాడిలు అలంకరించుకుంటూ ఉంటారు. బుగాడిలు పెట్టుకోవడానికి వీలుగా చెవుల అంచుల మీద సన్నని తీగతో గుచ్చి రంధ్రాలు చేస్తారు. ఇలా చెవులు కుట్టడం వల్ల ముఖ్యమైన ఆక్యుపంక్చర్ పాయింట్లు ఉత్తేజితమై పలు అనారోగ్య సమస్యలను దూరం చేస్తాయని అప్పటివారు నమ్మేవారు. అంతేకాదు బుగాడి.. ప్రతికూల శక్తులనుంచి కాపాడుతుందని మహిళలు విశ్వసించేవారు. బుగాడిని సాధారణంగా బంగారం లేదా వెండితో తయారు చేస్తారు. సన్నని బంగారు తీగలకు చిన్న ముత్యాలు లేదా ఎర్రని రాళ్లు ఎక్కించి చిన్న రింగుల మాదిరి చుట్టేవారు. కెంపులు, పచ్చలు లాంటి రత్నాలు పొదిగి చిన్న దిద్దుల లాంటివి కూడా తయారు చేసేవారు. మెరిసే రాయి, చిన్న స్క్రూతో ముక్కపుడకలా ఉండే బుగాడిలను మహిళలు ఎక్కువగా ధరించేవారు. క్రమంగా ఇవి రూపాంతరం చెంది సరికొత్త డిజైన్లలో విభిన్న రూపాల్లో అందుబాటులోకి వచ్చేశాయి.

**అందమైన బుగాడిలు**

**లవంగ బుగాడి:** ఇది ఎక్కువగా తమిళనాడు ప్రాంతాల్లో కనిపిస్తుంది. దీనికి లవంగం మాదిరి పుల్ల, మొగ్గ ఉంటాయి. మొగ్గ స్థానంలో అందమైన దిద్దులను జతచేస్తారు. వీటిమీద ముత్యాలు, రాళ్లు, రంగుల పూసలు, బంగారు గుళ్లు పొదుగుతారు. పుల్ల చివరలో చిన్న స్క్రూని ఏర్పాటు చేస్తారు.

**కష్టీ బుగాడి:** బంగారం లేదా వెండి తీగను చిన్న రింగులా చుట్టి దానికి చిన్న లాకెట్‌ను జతచేస్తారు. ఈ లాకెట్ మీద కుందనాలు, సీజెడ్‌లు, కెంపులు, పచ్చలు పొదుగుతారు. దీనికి చిన్న ముత్యాలను వేలాడదీస్తారు. ఈ రకం బుగాడి చూడడానికి గ్రాండ్‌గా కనిపిస్తుంది.

**కలాషిన్ బుగాడి:** దీనికి రెండు చివర్లలో అందమైన కలశం ఆకృతులు ఉంటాయి. వీటిని స్క్రూ పద్ధతి ద్వారా అమరుస్తారు. ఈ కలశాల మీద చక్కని డిజైన్లు రూపొందించి వాటి మధ్యలో ముత్యాలు, రత్నాలు పొదుగుతారు.

మోతీ బుగాడి: ఇది పూర్తిగా ముత్యాలతో నిండి ఉంటుంది. వివాహితలు, నాట్య కళాకారిణులు ఎక్కువగా ఈ రకం బుగాడిలను ధరిస్తుంటారు.

**జుమ్కీ బుగాడి:** దీనికి చివరన అందమైన జుమ్కీ లేదా డాంగ్లర్ వేలాడుతూ తళుక్కుమని మెరుస్తూ ఉంటుంది. మువ్వలతో కూడిన బుట్టలు, చాంద్‌బాలీలను కూడా జతచేస్తూ ఉంటారు.


డిస్క్ బుగాడి: దీనికి చివరలో గుండ్రని బిళ్ల ఉంటుంది. ఈ బిళ్ల మీద పువ్వులు, లతలు, హంసలు, నెమళ్లు, లక్ష్మీదేవి బొమ్మలు చెక్కుతారు.

**ధరించాలంటే...**

ట్రెండింగ్‌లో ఇలా: ప్రస్తుతం బుగాడి.. సంప్రదాయ సరిహద్దులు దాటి ఫ్యాషన్ ప్రపంచంలోకి అడుగు పెట్టింది. వారసత్వ విలువలను కాపాడుకుంటూనే యువతులు దీన్ని యాక్సెసరీగా ధరించడం మొదలుపెట్టారు. ఇప్పుడు బుగాడి ధరించాలంటే చెవులు కుట్టించుకోనక్కర్లేదు. క్లిప్ ఆన్, స్క్రూ బ్యాక్, కఫ్ స్టయిల్ రకాలు అందుబాటులోకి వచ్చేశాయి. దీంతో సందర్భానికి తగ్గట్టు రకరకాల బుగాడిలు పెట్టుకోవడానికి సౌలభ్యం ఏర్పడింది. చీరలు, లెహంగాలు లాంటి సంప్రదాయ దుస్తులతోపాటు జీన్స్, స్కర్ట్ లాంటి ఇండో వెస్ట్రన్ ఫ్యాషన్ వేర్ మీద కూడా బుగాడిలు పెళ్లికూతురి అలంకరణలో కూడా బుగాడి ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ముక్కుపుడక, పాపిడి బిళ్ల, జుంకీలకు మ్యాచ్ అయ్యేలా వీటిని ఎంపిక చేసుకుంటున్నారు.

ట్రెండింగ్‌లో ఇలా: ప్రస్తుతం బుగాడి.. సంప్రదాయ సరిహద్దులు దాటి ఫ్యాషన్ ప్రపంచంలోకి అడుగు పెట్టింది. వారసత్వ విలువలను కాపాడుకుంటూనే యువతులు దీన్ని యాక్సెసరీగా ధరించడం మొదలుపెట్టారు. ఇప్పుడు బుగాడి

# నేను సగం.. నువ్వు సగం!



ఆభరణాలు ధరించడంలో అందం ఉంది, ఆనందమూ ఉంది. స్నేహితులు, ప్రేమికులు, భార్యాభర్తలు, తల్లీకొడుకులు, తండ్రీకూతుళ్లు.. ఒక్కో బంధానిది ఓ ప్రత్యేకత. ఆ అనుబంధంతో ముడిపడిన జ్ఞాపకాలను ఆభరణాలుగా మలుచుకుంటున్నారు చాలామంది. ఈ నగలు ఫ్రెండ్స్ జువెలరీ, కపుల్ జువెలరీ, బెస్టీ జువెలరీ పేరున అలరిస్తున్నాయి.

పెండ్లి, ఉద్యోగం, వ్యాపారం.. ఇలా రకరకాల కారణాలతో స్నేహితులు, తోబుట్టువులు, ప్రేమికులు, కొన్నిసార్లు దంపతులు కూడా దూరంగా బతకాల్సి వస్తున్నది. 'భౌతికంగా మనమధ్య ఎడబాటు అనివార్యమైనా, మానసికంగా మాత్రం అతిదగ్గరగా ఉంటున్నాం' అని చాటుకోవడానికి 'సగం..సగం' తరహా నగలను ఎంచుకుంటున్నారు చాలామంది. నువ్వు సగం, నేను సగం.. అన్న విషయాన్ని ప్రతీకాత్మకంగా చాటుకోవడానికి ఒకే నగను రెండు ముక్కలుగా చేసుకుని.. చెరొకటి ధరిస్తున్నారు. పేర్లు, పదాల లాకెట్స్ కూడా వస్తున్నాయి.

సీతాకోక చిలుక, తాళంచెవి, పూలు, ఆకులు.. ఇలా రకరకాల డిజైన్లతో పెండెంట్లు వస్తున్నాయి. ఎన్ని ఉన్నా ఈ జువెలరీలో హృదయాకారానిదే హవా. స్నేహితులంటే ఇద్దరే కాకపోవచ్చు. ముగ్గురు, నలుగురు కూడా ఉండవచ్చు. ఆ మిత్రబృందం కోసం కూడా అందమైన పెండెంట్లు లభిస్తున్నాయి. ఉంగరాలు, బ్రేస్‌లెట్లు, గాజుల్లోనూ ఈ చిహ్నాలు ఒదిగిపోతున్నాయి. బంగారం, వెండి, ప్లాటినం వంటి ఖరీదైన లోహాల్లోనే కాదు, ఈతరానికి నప్పేలా.. థ్రెడ్, ఫ్యాబ్రిక్, లైట్‌వెయిట్, వన్‌గ్రామ్ గోల్డ్ వంటి వాటిలోనూ అందుబాటులో ఉన్నాయి.. ఫిఫ్టీ ఫిఫ్టీ ఆభరణాలు.




## సరికొత్త విజన్‌తో ముందుకొచ్చిన ఎన్ఐఏటీ..



**న్యూఢిల్లీ-నవభూమి:**ఇండియాలో ప్రతి సంవత్సరం లక్షల మంది విద్యార్థులు గ్రాడ్యుయేట్స్ అవుతున్నారు. 2024 ఆర్థిక సర్వేలో కేవలం 51 శాతం గ్రాడ్యుయేట్స్‌కి మాత్రమే ఉద్యోగావకాశాలు వచ్చినట్లు తేలింది. అందుకే ఇప్పుడు ఇండియాలో చాలా యూనివర్సిటీలు ఒక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నాయి. కొలాబరేట్ అవ్వడం, నెక్స్ట్ వేవ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్సడ్ టెక్నాలజీస్ ఓ చక్కటి విజన్‌తో స్టార్ట్ అయిందివేలకు పైగా కంపెనీలకు అసలు ఎలాంటి అద్భుతాలు కావాలి.. వారిలో ఏ స్కిల్స్ ఉండాలని ఇన్‌సైట్స్‌ని రిపోర్టుగా చేసి యూనివర్సిటీలకు ఇస్తోంది. ఇలాంటి మరిన్ని సొల్యూషన్స్ కోసం.. యూనివర్సిటీలతో కొలాబరేట్ అవుతోంది. తెస్తున్న ఈ సొల్యూషన్స్‌కు.. ఎడ్యుకేషన్ సెక్టార్స్‌లో ఎంతో పేరు తెచ్చిన సందీప్ సన్‌శెట్టి కూడా అభినందించారు. విద్యారంగంలో ఇలాంటి మార్పు రావాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం 2020లో పాలసీ ప్రవేశ పెట్టింది. ఈ కొలబరేషన్స్‌లో భారత దేశం టెక్ ఫ్యూచర్‌కు ఒక మంచి స్టార్ లభించింది.


నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

11 హైదరాబాద్ సోమవారం 28 । జులై । 2025



## మైనర్లకూ పాన్ కార్డు ఇస్తారని తెలుసా.. ఎలా అప్లై చేసుకోవాలంటే..




**న్యూఢిల్లీ-నవభూమి:** పాన్ కార్డు అంటే కేవలం పెద్దలకు సంబంధించిన విషయం మాత్రమే కాదు. ఇది పిల్లలకూ కీలకమే. ఆర్థిక వ్యవహారాల్లో అడ్డంకులు లేకుండా ఉండేందుకు పాన్ కార్డు అవసరం. పిల్లల భవిష్యత్తు కోసం మంచి ప్రణాళికకు పాన్ కార్డు అవసరమని నిపుణులు చెబుతున్నారు. ఇన్‌కమ్ ట్యాక్స్ చట్టం ప్రకారం, మైనర్లూ పాన్ కార్డు పొందొచ్చు.సాధారణంగా పిల్లల ఆదాయాన్ని ఇన్‌కమ్ ట్యాక్స్ పరంగా చాలా సందర్భాల్లో పెద్దల ఆదాయంలో కలిపి చూపించినప్పటికీ కొన్ని సార్లు పిల్లల పాన్ కార్డులు కూడా అక్కరకు వస్తాయి. మ్యూచువల్ ఫండ్స్, స్టాక్స్, ఇతర పెట్టుబడి సాధనాల్లో పిల్లలను నామినీగా చేర్చాలనుకుంటే పాన్ కార్డు అవసరం. నటన, స్పోర్ట్స్, ఇతర వ్యాపకాల ద్వారా పిల్లలకు ఆదాయం వస్తుంటే ట్యాక్స్ మేనేజ్‌మెంట్ కోసం పాన్ కార్డు తప్పనిసరి. కొన్ని రకాల స్కాలర్‌షిప్ అభ్యర్థులకు పాన్ కార్డు తప్పనిసరి.

ఇక 18 ఏళ్ల లోపు ఉన్న వారి కోసం పాన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలంటే కొన్ని డాక్యుమెంట్స్ రెడీ చేసుకోవాలి. పిల్లల తల్లిదండ్రులు లేదా సంరక్షకుల అడ్రస్ ప్రూఫ్, గుర్తింపు కార్డు, చిన్నారి అడ్రస్ ప్రూఫ్, గుర్తింపు కార్డు ఉండాలి. అప్లికేషన్‌లో రాసిన వివరాలకు ఈ డాక్యుమెంట్స్‌లోని వివరాలకు మధ్య ఎలాంటి తేడా ఉండకూడదు. ఇక మైనర్ల పాన్ కార్డు దరఖాస్తు కోసం ఎన్ఎస్‌డీఎల్ వెబ్‌సైట్‌ను సందర్శించాలి. ఇందులో 'కొత్త పాన్' ఆప్షన్‌ను ఎంచుకోవాలి. మైనర్ దరఖాస్తుదారుడి పూర్తి పేరు, పుట్టిన తేదీ, మొబైల్ నెంబర్, ఈమెయిల్ ఐడీని అప్లికేషన్ ఫార్మ్‌లో నింపాలి. క్యాప్చా ఎంటర్ చేశాక సబ్మిట్ బటన్‌ను క్లిక్ చేయాలి. అన్నీ మరోసారి సరిచూసుకున్నాక 'ప్రొసీడ్ విత్ పాన్ అప్లికేషన్ ఫార్మ్' ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. మీ వద్ద ఉన్న డాక్యుమెంట్ ప్రూఫ్స్, ఆధార్ వివరాలను కూడా జత చేయాలి. అనంతరం ఆన్‌లైన్‌లో ఫీజు కూడా చెల్లించాలి. ఇలా దరఖాస్తు చేసుకున్నాక, వెరిఫికేషన్ జరుగుతుంది. ఆ తరువాత 15 రోజుల లోపు కార్డు జారీ అవుతుంది.

## గుడ్ న్యూస్.. మళ్లీ లక్ష రూపాయల దిగువకు వచ్చిన పసిడి



**బెంగళూరు-నవభూమి:** 24 క్యారెట్ల బంగారం రూ.99,930, 22 క్యారెట్ల బంగారం రూ.91,600, వెండి రూ.1,16,000.

ఈ ధరలు స్థానిక పన్నులు, రవాణా ఖర్చులు, మార్కెట్ డిమాండ్‌పై ఆధారపడి నగరాల మధ్య స్వల్ప వ్యత్యాసాలను చూపిస్తాయి.

**ధరల తగ్గుదలకు కారణాలు**

గ్లోబల్ మార్కెట్‌లో బంగారం ధరలు ఒడిదుడుకులకు లోనయ్యాయి. అమెరికన్ డాలర్ బలపడటం వల్ల బంగారం ధరలు తగ్గాయి. ఎందుకంటే బంగారం ధరలు సాధారణంగా డాలర్‌తో విలోమానుపాతంలో ఉంటాయి. డాలర్ విలువ పెరగడం వల్ల బంగారం కొనుగోళ్లు తగ్గాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్, ఇతర సెంట్రల్ బ్యాంకుల వడ్డీ రేట్ల నిర్ణయాలు బంగారం ధరలపై ప్రభావం చూపాయి. అధిక వడ్డీ రేట్లు బంగారం వంటి దిగుబడి లేని ఆస్తుల ఆకర్షణను తగ్గిస్తాయి. ఫలితంగా డిమాండ్ తగ్గుతుంది. ఇటీవలి వాణిజ్య ఒప్పందాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కూడా ఈ ధోరణికి దోహదపడ్డాయి.

**వెండి డిమాండ్ తగ్గుదల**

వెండి ధరలు పారిశ్రామిక డిమాండ్ తగ్గడం వల్ల ప్రభావితమయ్యాయి. వెండి ఎక్కువగా పారిశ్రామిక అవసరాలకు ఉపయోగపడుతుంది. కాబట్టి గ్లోబల్ ఉత్పాదన క్షీణించడం దీని ధరలు తగ్గుముఖం పట్టాయని నిపుణులు చెబుతున్నారు.

## బిజినెస్ క్రెడిట్ కార్డుల ఉపయోగాలు

బ్యాంకులు వివిధ రకాల క్రెడిట్ కార్డులు ఇస్తుంటాయి. అయితే, వీటిలో బిజినెస్ క్రెడిట్ కార్డుల పాత్ర చాలా ఎక్కువ. వ్యాపార ఖర్చులను నిర్వహించడానికి, రివార్డ్‌లు సంపాదించడానికి, క్యాష్ ఫ్లోను మెరుగుపరచడానికి, వ్యాపార సంబంధిత ప్రయోజనాలను పొందడానికి బిజినెస్ క్రెడిట్ కార్డులు సహాయపడతాయి. ఈ కార్డులు స్టార్టప్‌లు, చిన్న, మధ్య తరహా వ్యాపారాలు, స్వయం ఉపాధి వ్యక్తులు, ఇంకా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉంటాయి. ఈ ఏడాది మరిన్ని సదుపాయాలతో బిజినెస్ క్రెడిట్ కార్డులను ఆయా బ్యాంకులు సరికొత్త కార్డ్స్ ప్రవేశపెడుతున్నాయి.

**ఎక్స్‌పెన్స్ ట్రాకింగ్ :**

ఈ సౌలభ్యం వ్యాపార ఖర్చులను వ్యక్తిగత ఖర్చుల నుండి వేరు చేస్తుంది. టాక్స్ ఫైలింగ్, ఆడిట్‌ను సులభతరం చేస్తుంది.

ఆన్‌లైన్ ఎక్స్‌పెన్స్ మేనేజ్‌మెంట్ టూల్స్ :


ఉదాహరణకు ద్వారా రియల్-టైం ట్రాకింగ్ అండ్ రిపోర్టింగ్ సౌలభ్యం ఉంటుంది. దీంతోపాటు, బిల్ చెల్లింపులు, వెండర్ చెల్లింపులను ట్రాక్ చేయడానికి సహాయపడుతుంది.

**క్యాష్ ఫ్లో మేనేజ్‌మెంట్ :**20-55 రోజుల వడ్డీ రహిత క్రెడిట్ పీరియడ్, తక్షణ నగదు ఖర్చు లేకుండా వ్యాపార ఖర్చులను నిర్వహించడానికి దోహదపడతాయి. ఉదాహరణకు చెల్లింపులపై 55 రోజుల వడ్డీ రహిత క్రెడిట్‌ను అందిస్తుంది. అంతేకాకుండా ఆప్షన్లు ఉపయోగించుకుని పెద్ద మొత్తంలోని ట్రాన్సాక్షన్స్ కన్వర్ట్ చేసుకునే వీలుంటుంది.

**రివార్డ్ పాయింట్లు, క్యాష్‌బ్యాక్ :**బిజినెస్ ఖర్చులపై (టాక్స్, బిల్‌లు, ట్రావెల్, డైనింగ్) అధిక రివార్డ్ రేట్‌లు అందుబాటులో ఉన్నాయి. రివార్డ్ పాయింట్లను ఎయిర్ మైల్స్, హొటల్ బుకింగ్‌లు, క్యాష్‌బ్యాక్ లేదా గిఫ్ట్ వోచర్‌ల కోసం రిడీమ్ చేయవచ్చు. ఉదాహరణకు **YES Prosperity Card** ట్రావెల్, ఇంకా డైనింగ్‌పై 4ఎక్స్ రివార్డ్ పాయింట్లు లేదా రూ.100 అందిస్తుంది.

**ట్రావెల్ ప్రయోజనాలు :**ఉచిత ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్ (దేశీయ, అంతర్జాతీయ) ఉంటుంది. అంతేకాకుండా విదేశీ లావాదేవీలపై తక్కువ ఫారెక్స్ మార్కప్ ఫీస్ (0% నుండి 2.5%) వరకూ వెసులుబాటు పొందొచ్చు.

## బ్యాంకులకు 9 రోజులు సెలవులు




**న్యూఢిల్లీ-నవభూమి:**మీరు తరుచూ బ్యాంకుకు వెళ్తుంటారా? ఆర్థిక లావాదేవీలు నిర్వహించేందుకు బ్యాంకులకు వెళ్లే వారందరికీ బిగ్ అలర్ట్. మీరు మీ వ్యక్తిగత, వ్యాపార అవసరాల కోసం బ్యాంకులకు వెళ్తుంటే బ్యాంకుల పని వేళల గురించి కచ్చితంగా తెలుసుకోవాలి. ఎందుకంటే తీరా బ్యాంకు వద్దకు వెళ్లాక మూసి ఉంటే నిరాశ చెందాల్సి వస్తుంది. కొన్నిసార్లు అత్యవసర పనులు ఆగిపోయి ఇబ్బందులు తలెత్తుతుంటాయి. సాధారణంగా బ్యాంకులకు ఆది వారాలు, పండగల రోజుల్లో సెలవు ఉంటుంది. అయితే, రాష్ట్రాల వారీగా సెలవులు మారుతుంటాయి. స్థానిక పండుగలు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఉంటాయి.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సర్క్యులర్ ప్రకారం వచ్చే ఆగస్టు, 2025 నెలలో బ్యాంకులకు భారీగా సెలవులు ఉన్నాయి. జాతీయ పండుగలు, రాష్ట్ర పండుగలతో పాటు రెండో, నాలుగో శనివారం, ఆదివారాలు బ్యాంకులు మూసి ఉంటాయి. అందుకే బ్యాంకుకు వెళ్లి పూర్తి చేయాల్సిన పనులు ఉండే వారు పని వేళలను బట్టి ప్లాన్ చేసుకోవడం చాలా అవసరం. ఈ క్రమంలో ఆగస్టు, 2025లో బ్యాంక్ సెలవుల జాబితా ఓసారి తెలుసుకుందాం.

ఆగస్టు 8వ తేదీ శుక్రవారం: టెండాంగ్‌లో రమ్ ఫండ్ (సిక్కిం, ఒడిశా) ప్రాంతాల్లో బ్యాంకులకు సెలవు ఉంటుంది. ఈ రెండు రాష్ట్రాల్లో గిరిజన పండుగ జరుపుతారు.

ఆగస్టు 9వ తేదీ శనివారం: రక్షా బంధన్ వస్తోంది. సాధారణంగా హిమాచల్ ప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఒడిశా, మధ్య ప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో బ్యాంకులు మూసి ఉంటాయి. అయితే, రెండో శనివారం కావడంతో దేశవ్యాప్తంగా బ్యాంకులు మూసి ఉంటాయి.

ఆగస్టు 10వ తేదీ ఆదివారం: దేశవ్యాప్తంగాగా బ్యాంకులు మూసి ఉంటాయి.

ఆగస్టు 13వ తేదీ బుధవారం: దేశ భక్తి దివస్ సందర్భంగా మణిపూర్‌లో రాష్ట్ర స్థాయి పండుగ జరుపుతారు.

ఆగస్టు 15వ తేదీ శుక్రవారం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బ్యాంకులకు దేశవ్యాప్తంగా సెలవు ఉంటుంది.

ఆగస్టు 16వ తేదీ శనివారం: జన్మాష్టమి, పార్సీ నూతన సంవత్సరం కారణంగా గుజరాత్, మధ్య ప్రదేశ్, మిజోరాం, తమిళనాడు, చండీగఢ్, సిక్కిం, తెలంగాణ, జమ్మూకశ్మీర్, రాజస్థాన్, బిహార్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, మేఘాలయ, ఏపీలో బ్యాంకులకు సెలవు ఉంటుంది.

ఆగస్టు 17వ తేదీ ఆదివారం: ఆదివారం సందర్భంగా బ్యాంకులకు దేశ వ్యాప్తంగా సాధారణ సెలవు ఉంటుంది.

ఆగస్టు 19వ తేదీ మంగళవారం: మహారాజా బీర్ బిక్రమ్ కిషోర్ మాణిక్య బహదూర్ జన్మదినం సందర్భంగా త్రిపురలో బ్యాంకులు మూసి ఉంటాయి.

ఆగస్టు 23వ తేదీ శనివారం: నెలలో వచ్చే నాలుగో శనివారం కారణంగా దేశవ్యాప్తంగా బ్యాంకులకు సెలవు

ఆగస్టు 24వ తేదీ ఆదివారం: దేశవ్యాప్తంగా బ్యాంకులకు సాధారణ సెలవు

ఆగస్టు 25వ తేదీ సోమవారం: శ్రీమంత శంకరదేవుని తిరుభావ తిథి కారణంగా అసోంలో బ్యాంకులకు సెలవు

ఆగస్టు 27వ తేదీ బుధవారం: గణేష్ చతుర్థి సందర్భంగా తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక, ఒడిశా, గుజరాత్, తమిళనాడు, గోవా, మహారాష్ట్ర ప్రాంతాల్లో బ్యాంకులకు సెలవు ఉంటుంది.

ఆగస్టు 28వ తేదీ గురువారం: నువాఖై, గణేష్ చతుర్థి సందర్భంగా ఒడిశా, గోవా ప్రాంతాల్లో సెలవు

ఆగస్టు 31వ తేదీ ఆదివారం: దేశవ్యాప్తంగా బ్యాంకులకు సెలవు ఉంటుంది.

## ఆర్‌బీఐ చెప్పినా ఆ బ్యాంకులు వినట్లే




**న్యూఢిల్లీ-నవభూమి:** ఈ ఏడాది వరుసగా మూడు ద్వైమాసిక సమావేశాల్లో వడ్డీ రేట్లను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తగ్గించిన సంగతి తెలిసిందే. 25 బేసిస్ పాయింట్లు, 25 బేసిస్ పాయింట్లు, 50 బేసిస్ పాయింట్ల చొప్పున మొత్తంగా 100 బేసిస్ పాయింట్లు తగ్గించేసింది. దీంతో రెపో రేటు 5.50 శాతానికి దిగివచ్చింది. ఈ ప్రయోజనాన్ని కస్టమర్లకు బదిలీ చేయాలని ఆర్‌బీఐ బ్యాంకులను ఆదేశించింది. దీంతో ప్రభుత్వ రంగంలోని దిగ్గజ బ్యాంకులు వివిధ రుణాల వడ్డీ రేట్లను తగ్గించినట్లు ప్రకటించాయి. అయితే, ప్రైవేట్ రంగంలోని చాలా బ్యాంకులు వడ్డీ రేట్లను తగ్గించడంలో ఆలస్యం చేస్తున్నాయట.రెపో రేటు తగ్గించిన ప్రయోజనాన్ని వెహికల్ లోన్స్ తీసుకున్న కస్టమర్లకు బదిలీ చేయడంలో ప్రైవేట్ రంగంలోని చాలా బ్యాంకులు ఆలస్యం చేస్తున్నట్లు వాహన డీలర్ల సంఘాల సమాఖ్య ఆరోపించింది. ఈ విషయంలో రిజర్వ్ బ్యాంక్ జోక్యం చేసుకోవాలని కోరింది. ఈ మేరకు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రాకు ఫాడా లేఖ రాసింది. వెహికల్ లోన్ తీసుకున్న వారికి వడ్డీ రేట్లను వెంటనే తగ్గించేలా ప్రైవేట్ బ్యాంకులుక ఆదేశాలు ఇవ్వాలని ఆర్‌బీఐకి విజ్ఞప్తి చేసింది.' మీ నాయకత్వంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చరిత్రలోనే అత్యంత వేగంగా రెపో రేటును తగ్గించి, ఆర్థిక వ్యవస్థకు సానుకూల సంకేతాలు అందించింది. అయినప్పటికీ వాహన రిటైల్ రంగానికి ఈ ప్రయోజనం పూర్తి స్థాయిలో అందడం లేదు. ప్రభుత్వ రంగంలోని బ్యాంకులు రెపో రేటు తగ్గింపు ప్రయోజనాన్ని తక్షణమే తమ ఖాతాదారులకు చేసినప్పటికీ ప్రైవేట్ రంగంలోని బ్యాంకులు ఆలస్యం చేస్తున్నాయి' అని లేఖలో పేర్కొన్నారు ఫాడా ఉపాధ్యక్షుడు సాయి గిరిధర్. ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ప్రైవేట్ బ్యాంకుల్లో వాహన రుణాలు తీసుకున్న వారిపై అదనపు భారం పడుతోందని, ఇప్పటికీ ఈఎంఐలు ఎక్కువగా చెల్లించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ ఏడాది 2025లోనే వడ్డీ రేట్లు సవరించడం మూడోసారి. ఫిబ్రవరిలో 25 బేసిస్ పాయింట్లు, ఏప్రిల్‌లో మరో 25 పాయింట్లు కోత పెట్టగా.. జూన్ నెలలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. దీంతో రెపో రేటు చాలా రోజుల తర్వాత 6 శాతం కిందకు దిగివచ్చింది. దీంతో రుణాలపై వడ్డీ రేట్లు తగ్గుతున్నాయి. అయితే, డిపాజిట్లపైనా వడ్డీ రేట్లు తగ్గడం డిపాజిటర్లకు వచ్చే రాబడి తగ్గిపోతుంది. దీంతో చాలా మంది ఇతర మార్గాల్లో ఇన్వెస్ట్ చేయాలి చూస్తున్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసే వారికి ఇది సరైన సమయం కాదనే చెప్పాలి.

## వామ్మో.. ఏడాదికి రూ.1250 కోట్లా?



**న్యూఢిల్లీ-నవభూమి:** వంద కోట్లకు ఎన్ని సున్నాలుంటాయో లెక్కబెట్టేందుకే మనకు కాస్త సమయం పడుతుంది. అలాంటిది వందల కోట్లు జీతాలంటే నోరెళ్లబెట్టాల్సిందే. భారతీయుల్లో చాలా మంది రూ. 20 వేలు, రూ. 30 వేలలోపు జీతాలతోనే పని చేస్తున్నారు. కొద్ది మంది మాత్రమే కోట్లలో అందుకుంటున్నారు. అయితే ఏడాదికి వందల కోట్లు జీతం అందుకునే భారతీయులు సైతం ఉన్నారని మీకు తెలుసా? ఏడాదికి రూ. 1250 కోట్లు, రూ. 1200 కోట్లు, రూ. 800 కోట్లు అంటూ జీతాలు అందుకునే మల్టీ మిలియన్ డాలర్ జీతాలు అందుకునే భారతీయుల గురించి తెలుసుకుందాం.ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచాన్ని శాసిస్తోంది. ఏఐ వచ్చాక టెక్నాలజీ నిపుణుల కోసం కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నాయి కంపెనీలు. ప్రస్తుతం ఫేస్‌బుక్ అధినేత మార్క్ జుకర్‌బర్గ్ సూపరింటెలిజెన్స్ టీమ్ కోసం నియామకాలు చేపట్టారు. ఆ టీమ్‌లో వినిపిస్తున్న పేరు భారతీయ యువకడు త్రపిత్ బన్సల్. ఈ యువకుడికి రూ.800 కోట్ల జీతం ఆఫర్ చేసి తన టీమ్ లోకి జుకర బర్గ్ తీసుకున్నట్లు సమాచారం. 35 ఏళ్ల త్రపిత్ ఐఐటీ కాన్పూర్‌లో పట్టా అందుకున్నాడు. మసాచుసెట్స్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ పీహెచ్‌డీ చేశాడు. ఓపెన్ ఏఐ సంస్థలో రిసెర్చ్ సైంటిస్ట్‌గా పని అనుభవం ఉంది. ఓ సిరీస్ వంటి ప్రాజెక్టులకు పని చేశాడు. ఈ అర్హతలతోనే మెటా డ్రీమ్ టీమ్‌లోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. 'అంకుల్ నన్ను కాపాడండి ప్లీజ్..' టిప్పర్ టైర్ల కింద ఇరుక్కొని బీటెక్ విద్యార్థిని ఆర్తనాదాలు మరోవైపు.. దిగ్గజ కంపెనీల్లో సీఈఓ, సీఎఫ్ఓ, సీఓఓ అనే సీ-సూట్ స్థాయిలు, వైస్ ప్రెసిడెంట్స్, డైరెక్టర్స్ వంటి వీ, డీ సూట్ స్థాయిల్లోనూ భారతీయులు రాణిస్తున్నారు. వీరి జీతాలూ భారీగానే ఉన్నాయి. పాలో ఆల్టో నెట్‌వర్క్ సంస్థ సీఈఓ నికేష్ అరోరాకు ప్రస్తుతం రూ.1250 కోట్లు శాలరీ ఇస్తున్నట్లు తెలుస్తోంది. పంజాబీ కుటుంబంలో జన్మించిన నికేష్ బెనారస్ హిందూ యూనివర్శిటీ నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చేశారు. అమెరికాలోని బోస్టన్ కాలేజీ నుంచి ఎంఎస్ ఫైనాన్స్ పట్టా అందుకున్నారు. గూగుల్‌లో కొంత కాలం పని చేసి ఆ తర్వాత పాలో ఆల్టో నెట్‌వర్క్ సంస్థను లీడ్ చేస్తున్నారు.అత్యధిక జీతం అందుకుంటున్న భారతీయుల్లో ఇటీవల వినిపిస్తున్న పేరు వైభవ్ తనేజా. ఎలాన్ మస్క్ నేతృత్వంలోని టెస్లా కార్ల సంస్థ సీఎఫ్ఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం ఆయన జీతం రూ.1200 కోట్లుగా ఉంటుందని సమాచారం. ఢిల్లీ యూనివర్సిటీలో బీకామ్ పూర్తి చేసిన వైభవ్ ఆపై సీఏ చేశారు. అమెరికా వెళ్లి టెస్లాలో అత్యదిక జీతం అందుకుంటున్నారు. సిలికాన్ వ్యాలీ బోర్డు రూమ్ సభ్యుల్లో ఒకడిగానూ ఉన్నారు. ఎలాన్ మస్క్ పెడుతున్న అమెరికన్ పార్టీలో ట్రెజరర్‌గానూ అవకాశం అందుకోనున్నాడని తెలుస్తోంది.ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీ ఎన్విడియాలో వరల్డ్ వైడ్ గ్లోబల్ ఆపరేషన్స్ వైస్ ప్రెసిండెంట్‌గా ఉన్న అజయ్ పురి రూ.185 కోట్ల జీతం తీసుకుంటున్నారట. అలాగే హాట్ స్పాట్ అనే సాఫ్ట్ వేర్ సంస్థకు సీఈఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న యామినీరంగన్ రూ.200 కోట్లు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇలా వందల కోట్లు జీతం అందుకుంటున్న భారతీయుల సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతూనే ఉంది. ప్రపంచ స్థాయి కంపెనీల్లో ఉన్నత స్థానాల్లో కొనసాగుతూ ఈ మేర రాణిస్తున్నారు.

## స్థిర ఆదాయానికి భరోసా సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్



**న్యూఢిల్లీ-నవభూమి:**దేశంలో వడ్డీ రేట్లు పడిపోతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక రెపో వడ్డీ రేటు ఒక శాతం తగ్గించింది. దీంతో బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)పై వడ్డీ రేట్లు కుదిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సీనియర్ సిటిజన్ల పరిస్థితి ఏంటి? స్థిర ఆదాయం కోసం వారు వేటిని ఆశ్రయిస్తే మంచిది. ఆ వివరాలు మీకోసం..

జూన్ నెల రిటైల్ ద్రవ్యోల్బణం ఆరేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. దీంతో వచ్చే నెలలో జరిగే ద్రవ్య పరపతి విధాన సమీక్ష (ఎంపీసీ) భేటీలో ఆర్‌బీఐ కీలక రెపో వడ్డీ రేటును మరింత తగ్గించే సూచనలు కనిపిస్తున్నాయి. అదే జరిగితే బ్యాంకులు ఎఫ్‌డీలపై వడ్డీ రేట్లు మరింత తగ్గించడం ఖాయం. ఇప్పటికే స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు తప్ప ఏ బ్యాంక్ కూడా సీనియర్ సిటిజన్లతో పాటు ఎవరికీ వారి ఎఫ్‌డీలపై 8 శాతానికి మించి వడ్డీ చెల్లించడం లేదు.

**ఏమిటి మార్గం?**

వడ్డీ రేట్లు తగ్గుతున్న ఈ పరిస్థితుల్లో సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్ఎస్) ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ఈ పథకం కింద చేసిన డిపాజిట్లపై 8.2 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నారు. పోస్టాఫీసుల్లో పొదుపు ఖాతా ఉన్న వారికి ఈ ఎస్.సి.ఎస్.ఎస్. అందుబాటులో ఉంటుంది. లేదంటే కొత్తగా ఖాతా తెరవవచ్చు. అయితే ఈ వడ్డీ రేటును ప్రభుత్వం అక్టోబరు 1 నుంచి సవరించే అవకాశం ఉంది. అయినా బ్యాంక్ ఎఫ్‌డీలతో పోలిస్తే ఎస్‌సీఎస్ఎస్ సురక్షితమైన, స్థిర ఆదాయ పెట్టుబడి అని చెప్పవచ్చు.

ఎస్‌సీఎస్ఎస్ అందరికీ వర్తించదు. 60 సంవత్సరాలు నిండిన భారత పౌరులకు మాత్రమే వర్తిస్తుంది. ప్రత్యేక లేదా సాధారణ వీఆర్ఎస్ తీసుకున్న వ్యక్తులు, రిటైర్ అయిన సైనిక సిబ్బంది వయస్సు 60 ఏళ్ల కంటే తక్కువ ఉన్నా.. ఈ పథకానికి అర్హులే.

**వడ్డీ చెల్లింపు**

ఎస్‌సీఎస్ఎస్ డిపాజిట్లపై వడ్డీని మూడు నెలలకు ఒకసారి చొప్పున చెల్లిస్తారు. దీనివల్ల సీనియర్ సిటిజన్లకు మార్కెట్ ఆటుపోట్లతో సంబంధం లేకుండా స్థిరమైన ఆదాయం అందుతుంది.

భద్రత:ఎస్‌సీఎస్ఎస్.. బ్యాంక్ ఎఫ్‌డీల కంటే సురక్షితమైనది. ఎందుకంటే ఈ పథకం అసలు, వడ్డీ చెల్లింపులకు కేంద్ర ప్రభుత్వ హామీ ఉంటుంది. అందుకే జీవిత చరమాంకంలో ఉన్న పండుటాకులకు, ఇది అత్యంత భద్రతతో కూడిన పెట్టుబడిగా చెబుతారు.

**అకౌంట్ క్లోజింగ్**

ఈ పథకం కాలపరిమితి ఐదేళ్లు. కావాలంటే మరో మూడేళ్లు పొడిగించుకోవచ్చు. పాస్‌బుక్, అప్లికేషన్ ఫారం పూర్తి చేసి పోస్టాఫీసలో ఇస్తే.. అప్పటి వరకు మన ఖాతాలో జమ అయిన మొత్తాన్ని ఖాతాదారుడికి చెల్లిస్తారు.

**ముందే మరణిస్తే?**

ఒకవేళ ఖాతాదారుడు మెచ్యూరిటీకి ముందే మరణిస్తే.. చనిపోయిన తేదీ నుంచి పోస్టాఫీస్ పొదుపు ఖాతాపై చెల్లించే వడ్డీ రేటు చెల్లిస్తారు. చనిపోయిన వ్యక్తి ఎస్‌సీఎస్ఎస్ ఖాతా తెరిచేటప్పుడే జీవిత భాగస్వామిని జాయింట్ హోల్డర్ లేదా నామినీగా పేర్కొంటే పథకం మెచ్యూరిటీ వరకు అదే వడ్డీ రేటు కొనసాగుతుంది.

**పెట్టుబడుల పరిమితి**

ఈ పథకంలో ఏటా కనీసం రూ.1,000, గరిష్ఠంగా రూ.30 లక్షల వరకు మదుపు చేయవచ్చు. అదే పదవీ విరమణ చేసిన వారయితే తమ రిటైర్మెంట్ మొత్తం లేదా రూ.30 లక్షలు.. ఇందులో ఏది తక్కువైతే దాన్ని పెట్టుబడిగా ఆమోదిస్తారు. రిటైర్మెంట్ ప్రయోజనాలు అందిన నెల రోజుల్లోపే ఈ పెట్టుబడి పూర్తి చేయాలి.

పన్ను ప్రయోజనాలు..ఎస్.సి.ఎస్.ఎస్. డిపాజిట్లపై ఆదాయ పన్ను (ఐటీ) చట్టం కింద పన్ను ప్రయోజనాలు కూడా లభిస్తాయి. ఈ పథకంలో ఏటా చేసే డిపాజిట్లలో రూ.1.5 లక్షల వరకు సెక్షన్ 80సీ కింద ఆదాయ మినహాయింపు లభిస్తుంది. వడ్డీ ఆదాయానికి మాత్రం ఎలాంటి పన్ను మినహాయింపు ఉండదు. అయితే సెక్షన్ 80 టీటీబీ కింద సీనియర్ సిటిజన్లు వడ్డీ ఆదాయంలోనూ రూ.50,000 వరకు పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు.

## ట్రావెల్ క్రెడిట్ కార్డ్స్, వాటి ఉపయోగాలు



**న్యూఢిల్లీ-నవభూమి:** మన దేశంలో క్రెడిట్ కార్డులు దైనందిన జీవితాలలో భాగం అయిపోయాయి. అయితే, వీటిలో పలు రకాల కార్డులు వివిధ రకాల ప్రయోజనాలు కల్పిస్తుంటాయి. ఏయే సమయాల్లో ఏ రకమైన కార్డులు ఉపయోగిస్తే లాభదాయకమో వినియోగదారులకు ఒక ఐడియా ఉంటే మెరుగైన బెనిఫిట్స్ అందిపుచ్చుకోవచ్చు.

ఎక్కువగా ప్రయాణాలు, టూరిజం ఆసక్తి ఉన్నవాళ్లకి ప్రత్యేకంగా భారతదేశంలో వివిధ రకాల ట్రావెల్ క్రెడిట్ కార్డులు అందుబాటులో ఉన్నాయి. ఆయా బ్యాంకులు ఇచ్చే ట్రావెల్ క్రెడిట్ కార్డులు వివిధ రకాల బెనిఫిట్స్‌ను యూజర్లకు అందిస్తున్నాయి. ముఖ్యంగా తరచూ ప్రయాణం చేసే వారికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. రివార్డ్ పాయింట్లు, ఎయిర్ మైల్స్, లాంజ్ యాక్సెస్, ట్రావెల్ ఇన్సూరెన్స్ వంటి

## చిన్న ట్రిక్స్‌తో పెద్ద పొదుపు.. ఇలా ఈజీగా నెలకు రూ. 10 వేలు ఆదా చేయొచ్చు తెలుసా..!



**న్యూఢిల్లీ-నవభూమి:** డబ్బు సంపాదించడం ఒక ఎత్తయితే.. దానిని పొదుపు చేయడం మరో ఎత్తు. చాలా మంది ఇదే చెబుతుంటారు. కానీ పొదుపు చేసినప్పుడే.. డబ్బు విలువ తెలుస్తుంది. ఇక్కడ మరీ ఎక్కువగా రాజీ పడకుండా కొన్ని చిట్కాలతో డబ్బులు నెల నెలా ఆదా చేసుకోవచ్చు. నెలా రూ. 10,000 ఆదా చేయడానికి కొన్ని తెలివైన మార్పులు చేసుకోవడం ద్వారా ఇలా చేయొచ్చని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఇంటి భోజనం, సబ్‌స్క్రిప్షన్‌లను తగ్గించడం, తెలివిగా ప్రయాణించడం, ఆటోమేటెడ్ సేవింగ్స్ వంటి మార్గాల ద్వారా డబ్బు ఆదా చేయొచ్చు.ఆన్‌లైన్‌లో ఆహారం ఆర్డర్ చేయడం లేదా తరచుగా బయట తినడం వల్ల జేబుకు చిల్లు పడుతుంది. అందుకే మరీ ఎక్కువగా బయట తినకుండా వారానికి 5 రోజులు సాధారణంగా ఇంట్లో వండిన భోజనం తినడం ద్వారా నెలకు రూ. 2,000 నుంచి రూ. 3 వేల వరకు సులభంగా ఆదా చేయొచ్చు. మనం ఉపయోగించని సేవలకు కూడా డబ్బులు చెల్లిస్తుంటాం. ఇక్కడ మనం వాటిని నిజంగా ఎంత వరకు ఉపయోగిస్తున్నాం అనేది ఆలోచించాలి. వీటిని సమీక్షించి వాడని వాటిని రద్దు చేసుకోవడం ముఖ్యం. ఈ ఖర్చులను తగ్గించడం ద్వారా మన జీవనశైలిని ప్రభావితం చేయకుండానే నెలకు రూ. 1,000 లేదా అంతకంటే ఎక్కువ ఆదా చేసుకోవచ్చు.సోలో క్యాబ్ రైడ్‌ల కంటే మెట్రోలు, బస్సులు లేదా కార్‌పూల్‌లను ఎంచుకోవడం ద్వారా, నెలవారీ ప్రయాణ ఖర్చులను రూ. 3,000 వరకు తగ్గించవచ్చు.జీతం వచ్చిన వెంటనే ఆటోమేటిక్ సిప్ లేదా రికరింగ్ డిపాజిట్‌ను ఏర్పాటు చేయడం ద్వారా, అనవసరమైన కొనుగోలు చేసే ముందు 24 గంటలు ఆలోచించడం ద్వారా మిగిలిన రూ. 3,000 లేదా అంతకంటే ఎక్కువ ఆదా చేయొచ్చు.డబ్బు ఆదా చేయడం ద్వారా భవిష్యత్తులో ఉపయోగపడుతుంది.

మలి వయసులో ఆర్థికంగా స్థిరంగా ఉండొచ్చు. డబ్బు ఆదా చేయడం ద్వారా మన కలలను నెరవేర్చుకోవచ్చు. ఇదొక మంచి అలవాటు. మన జీవితాన్ని మెరుగుపరుచుకోవచ్చు. మన కుటుంబానికి సహాయపడొచ్చు. డబ్బు ఆదా చేస్తూ సమాజానికి సహాయపడొచ్చు. డబ్బు ఆదా చేయడం ద్వారా దేశానికి సహాయపడొచ్చు. డబ్బు ఆదా చేయడం ఒక బాధ్యత. ఇదొక కర్తవ్యం.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 | హైదరాబాద్ | సోమవారం | 28 । జులై । 2025


# మళ్లీ మెగాఫోన్ పడుతున్న పోసాని కృష్ణమురళి



తెలుగు చలనచిత్ర పరిశ్రమలో రచయితగా, నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా తనదైన ముద్ర వేసిన పోసాని కృష్ణమురళి చాలా రోజుల తర్వాత మరోసారి దర్శకుడిగా మెగాఫోన్ పట్టుకోబోతున్నారు. గతంలో 'ఆపరేషన్ దుర్యోధన' శ్రావణమాసం, రాజావారి చేపల చేరువు, వంటి శక్తివంతమైన చిత్రాలకి దర్శకత్వం వహించి విమర్శకుల ప్రశంసలు అందుకున్న పోసాని, ఇప్పుడు తన కొత్త ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు.తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, పోసాని కృష్ణమురళి దర్శకత్వం వహించబోయే ఈ కొత్త చిత్రానికి 'అరుణారెడ్డి' లేదా 'ఆపరేషన్ అరుణారెడ్డి' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. పోసాని గతంలో దర్శకత్వం వహించిన చిత్రాలు వాణిజ్యపరంగా విజయాలు సాధించడమే కాకుండా, విమర్శకుల నుంచి కూడా మంచి ఆదరణ పొందాయి. ముఖ్యంగా, 2007లో విడుదలైన 'ఆపరేషన్ దుర్యోధన' సినిమా రాజకీయ నేపథ్యంలో సామాజిక సమస్యలను చర్చించి, ప్రేక్షకులతో పాటు విమర్శకులను కూడా ఆలోచింపజేసింది.పోసాని కొత్త ప్రాజెక్ట్‌పై పరిశ్రమలో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా 'ఒసేయ్ రాములమ్మ' తరహాలోనే ఉంటుందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ చిత్రంలో పోసాని కృష్ణమురళి హీరోగా, విలన్‌గా ద్విపాత్రాభినయం చేయనున్నారని తెలుస్తోంది. పోసాని మార్క్, సామాజిక సమస్యలతో కూడిన శక్తివంతమైన కథాంశంతో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందని టాక్. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే వెల్లడయ్యే అవకాశం ఉంది.

నవచిత్ర



## 'వార్-2'లో ఆలియా.. నిజమేనా..



బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్, ఇటు టాలీవుడ్ హీరో ఎన్టీఆర్ అభిమానులు ఎంతో ఆతురతగా ఎదురుచూస్తున్న చిత్రం 'వార్ 2'. ఇందులో కియారా అడ్వాణీ కథానాయిక. అయాన్ ముఖర్జీ దర్శకుడు. యశ్‌రాజ్ సంస్థ నిర్మిస్తోంది. ఈ చిత్రంలో మరో బ్యూటీ కూడా స్క్రీన్ షేర్ చేసుకోబోతున్నట్లు సమాచారం. ఆలియా భట్ ఈ చిత్రంలో గెస్ట్ రోల్ చేస్తున్నట్లు చాలాకాలంగా వార్తలొస్తున్నాయి. దీనికి ఆమె తాజాగా పెట్టిన పోస్ట్ మరింత బలానిచ్చింది.'వార్ 2', 'ఆల్ఫా' ఈ రెండు చిత్రాలను యశ్‌రాజ్ సంస్థ నిర్మిస్తోంది. 'ఆల్ఫా?'లో అలియాకు గురువుగా హృతిక్ రోషన్ కనిపించనున్నట్లు గతంలో వార్తలొచ్చాయి. దీంతో 'వార్ 2'లో హృతిక్, అలియాకు మధ్య చిన్న సన్నివేశం ఉండనున్నట్లు బాలీవుడ్ మీడియా కోడై కూస్తోంది. సోసల్ మీడియాలో ఈ సినిమా ట్రైలర్‌ను షేర్ చేసిన అలియా ఆసక్తికరమైన క్యాప్షన్ ఇచ్చారు. "ఇది అద్భుతంగా ఉండనుంది. ఆగస్టు 14న థియేటర్‌లలో కలుద్దాం' అని క్యాప్షన్ పెట్టారు. దీంతో ఆలియా కూడా ఈ సినిమాలో భాగంగా కానుందని అభిమానులు భావిస్తున్నారు.

## జెనీలియా నేషనల్ పుట్ బాల్ ప్లేయర్!



అందాల నటి జెనీలియా టాలీవుడ్ లో ఓ వెలుగు వెలిగిన సంగతి తెలిసిందే. సత్యంతో పరిచయమైన అమ్మడు సాంబ సైనా అల్లుడుహ్యాపీ బొమ్మరిల్లు లాంటి ఎన్నో సినిమాల్లో నటించింది. నటిగా తనకంటూ ఓ ఇమేజ్ ని క్రియేట్ చేసుకుంది. అప్పటి యువతలో ఓ కలల రాణిగా వెలిగిపోయింది. ఈ సినిమాలన్నింటి కంటే ముందే బోయ్స్ చిత్రంలో నటించింది. అటుపై బాలీవుడ్ కి వెళ్లిన తర్వాత తెలుగు సినిమాలకు దూరమైంది. రితీష్ దేశ్ ముఖ్ తో వివాహం తర్వాత సినిమాలంటే ఆసక్తి కూడా తగ్గించింది. 13 ఏళ్ల తర్వాత ఇటీవలే మళ్లీ -జూనియర్- సినిమాతో కంబ్యాక్ అయిన సంగతి తెలిసిందే. ఇందులో జెనీలియా కీలక పాత్రలో ప్రేక్షకుల్ని అలరించింది. తెరపై కనిపించినంత సేపు సీరియస్ పాత్రలో ఎంగేజ్ చేసింది. కంబ్యాక్ పరంగా జెనీలియాకు మంచి రోల్ పడిందని చెప్పొచ్చు. మరి నటిగా కొనసాగుతుందా? లేదా? అన్నది అమ్మడి చేతుల్లోనే ఉంది. జెనీలియాకు మాత్రం టాలీవుడ్ మంచి అవకాశాలు ఇచ్చే ఛాన్స్ ఉంది. అక్క..వదిన పాత్రలకు జెనీలియా నవతరం హీరోల సినిమాల్లో పర్ఫెక్ట్ సూటవుతుంది. స్టార్ హీరోల చిత్రాలకు పర్ఫెక్ట్ ఛాయిస్ గా చెప్పొచ్చు. కానీ ఛాన్స్ తీసుకోవడమా? లేదా? అన్నది ఆమె చేతుల్లో పనే. ఆ సంగతి పక్కన బెడితే జెనీలియా మంచి పుట్ బాల్ ప్లేయర్ అన్న సంగతి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని తానే స్వయంగా రివీల్ చేసింది. చిన్నప్పటి నుంచి పుట్ బాల్ ఆడే అలవాటు ఉంది. ఆ అలవాటు కేవలం టైంపాస్ గా మాత్రమే కాకుండా సీరియస్ ప్రయత్నాలు చేసి జాతీ య స్థాయిలో పుట్ బాల్ ప్లేయర్ గా ఎదిగిందిట. ఇంటర్మీడియట్ లో పాకెట్ మనీ కోసం మోడలింగ్ లోకి వచ్చిందిట. ఆ తర్వాత నటిగా కెరీర్ అనుకోకుం డానే మొదలైందని తెలిపింది. అలాగే జెనీలియా టాలీవుడ్ లో నటించిన మూడవ చిత్రం కూడా స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ సినిమాతోనే తెరకెక్కింది.

## ఇట్స్ రైడ్ టైం.. కారు కొన్న కోర్ట్ హీరోయిన్ శ్రీదేవి



కోర్టు సినిమాతో సూపర్ క్రేజ్ సంపాదించుకుంది యువ నటి శ్రీదేవి నాని నిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.60 కోట్లు వసూళ్లు చేసింది. ఈ సినిమా సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న శ్రీదేవి ఇటీవలే క్లాసీ ఎంజీ హెక్టార్ కారును కొనుగోలు చేసింది. ఈ విషయాన్నితెలియజేస్తూ సెల్ఫీలు, గ్లింప్స్‌ను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా షేర్ చేసింది.తన కుటుంబసభ్యులు కారుకు పూజలు చేస్తున్న ఫొటోలను షేర్ చేయడంతో.. నెటిజన్లు శుభాకాంక్షలు తెలియజేస్తూ సందేశాలను పంపిస్తున్నారు. ఇప్పుడీ స్టిల్స్, శ్రీదేవి తమిళంలో డెబ్యూ ప్రాజెక్టుకు ఇటీవలే సంతకం చేసింది. కోలీవుడ్ యువ నటుడు కోటపడి జే రాజేశ్ హీరోగా నటిస్తున్నాడు. శ్రీదేవి తెలుగులో మరోవ కొత్త సినిమా ప్రకటించలేదు. కొత్త కారు కొన్న శ్రీదేవి తనకిష్టమైన ఫన్ రైడ్‌ను ఎంజాయ్ చేయాలని అంటున్నారు ఫాలోవర్లు.

## శాన్వీ మేఘన ఇంట్లో వరలక్ష్మీ వ్రతం వేడుక!



తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన నటి శాన్వీ మేఘన తన ఇంట్లో వరలక్ష్మీ వ్రతం వేడుకను ఘనంగా నిర్వహించుకుంది. ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో పౌర్ణమి ముందు జరుపుకునే ఈ పండుగను శాన్వీ తన కుటుంబ సభ్యులతో కలిసి ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించింది.వరలక్ష్మీ వ్రతం సందర్భంగా తన ఇంట్లో అలంకరించిన అమ్మవారి మండపం, పూజా కార్యక్రమాలకు సంబంధించిన అందమైన ఫొటోలను శాన్వీ తన ఇన్‌స్టాగ్రామ్‌తో పాటు ఎక్స్‌లో పంచుకుంది. ముఖ్యంగా, పూజానంతరం ఫొటోలను షేర్ చేస్తూ, "అందరూ హారతి తీసుకోండి" అని క్యాప్షన్ ఇచ్చారు. శాన్వీ పోస్ట్ చేసిన ఈ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆమె అభిమానులు, నెటిజన్లు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ కామెంట్లు పెడుతున్నారు.శాన్వీ మేఘన తెలుగులో పిట్టకథలు, పుష్పక విమానం, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ వంటి చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇటీవల తమిళంలో వచ్చిన కుడుంబస్తాన్ సినిమాలో కథానాయికగా నటించి అందరిని మెప్పించింది.

## అతను వీడియో కాల్‌లో బట్టలు విప్పమన్నాడు




ఇండస్ట్రీలో క్యాస్టింగ్ కౌచ్ ను ఎదుర్కోకుండా బయటపడిన ఒక్క హీరోయిన్ లేదు అంటే అతిశయోక్తి కాదు. కొత్తగా ఇండస్ట్రీకి వచ్చినవారైనా.. స్టార్ హీరోయిన్లు అయినా ఏదో ఒక సమయంలో ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొన్నవారే. స్టార్ హీరో సరసన నటించే ఛాన్స్ కావాలంటే కమిట్ మెంట్ ఇవ్వాలి. మొదటి హీరోయిన్ గా ఛాన్స్ కావాలలంటే నిర్మాత రూమ్ కి వెళ్లాలి. అందంగా చుపించాలంటే సినిమాటోగ్రాఫర్ దగ్గరకు వెళ్లాలి.. అసలు ఇండస్ట్రీలో అవకాశం రావాలన్నా రూమ్ కి వెళ్ళాలి.
ఇక్కడితో ఆగాయా అంటే లేదు. లైంగిక వేధింపులు.. షూటింగ్స్ లో, ఆడిషన్స్ లో ప్రెస్ మీట్ లలో ఇలా ఎక్కడా ఆడదానికి భద్రత లేదు. ఇది కేవలం ఇండస్ట్రీకి వచ్చే కొత్తవారికే కాదు. నట వారసురాళ్లకు కూడా తప్పడం లేదు. బాలీవుడ్ స్టార్ కమెడియన్ జానీ లివర్ కుమార్తె జామీ లివర్ సైతం క్యాస్టింగ్ కౌచ్ ఇబ్బందులను ఎదుర్కొన్నట్లు చెప్పడం ప్రస్తుతం సెన్సేషన్ గా మారింది. తండ్రి బాటలోనే కామెడీ నటిగా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకుంది జామీ. తెలుగులో ఆమె ఆ ఒక్కటి అడక్కు అనే సినిమాలో నటించింది. నరేష్, ఫరియా జంటగా నటించిన ఈ చిత్రంలో నరేష్ కు వదినగా ఆమె నవ్వులు పూయించింది. బాలీవుడ్ సినిమా థియేటర్ టిక్కెట్లు
ప్రస్తుతం బాలీవుడ్ లో వరుస సినిమాలతో బిజీగా ఉన్న జామీ తాజాగా ఒక ఇంటర్వ్యూలో తాన్ క్యాస్టింగ్ కౌచ్ సంఘటనను బయటపెట్టింది. ' కెరీర్ ప్రారంభంలో నాకు మేనేజర్ అంటూ ఎవరూ ఉండేవారు కాదు. ఎవరు ఆడిషన్ కు పిలవాలన్నా నా నాకే ఫోన్ వచ్చేది. ఒకసారి ఒక ఇంటెర్నేషనల్ సినిమాలో ఛాన్స్ అని ఒక వ్యక్తి వీడియో కాల్ చేశాడు. నేను కూడా కథ బాగా అర్థం కావాలని ఇలా ఎదురెదురు కూర్చొని మాట్లాడతాడేమో అని అలాగే ఉండిపోయాను. అతని ముఖం నాకు కనిపించడం లేదు. నన్ను మాత్రం అతను చూస్తున్నట్లు చెప్పాడు.కథ మొత్తం వివరిస్తూ.. చాలా మంచి పాత్ర. కామెడీతో పాటు చాలా బోల్డ్ గా ఉంటుంది అని చెప్పాడు. ఆ తరువాత నీ ముందు ఒక 50 ఏళ్ల వ్యక్తి ఉన్నట్లు ఊహించుకో.. నెమ్మదిగా బట్టలు విప్పు అన్నాడు. నేను షాక్ అయ్యా. వీడియో కాల్ లో ఇలాంటివి నాకు సౌకర్యంగా ఉండవు. బోల్డ్ పాత్ర అయితే నేను సీన్ లో చేస్తాను అని చెప్పాను. అతను వినకుండా ఇది చాలా పెద్ద ప్రాజెక్ట్. ఆ పాత్రకు నువ్వు సెట్ అవుతావో లేదో చూడాలి కదా. పర్లేదు బట్టలు విప్పు అన్నాడు. వెంటనే నేను నాకు ఇలా చేయడం సౌకర్యంగా లేదు అని టక్కున కాల్ కట్ చేశాను. అప్పటివరకు నాకు క్యాస్టింగ్ కౌచ్ అంటే ఏంటో తెలియదు. ఇండస్ట్రీలో నా తండ్రి ఉండడం అదృష్టం. అప్పటివరకు ఇలాంటి ఇబ్బందులు ఉంటాయన్న మాటే కానీ, నెప్పుడు అనుభవించలేదు. ఇక నా వరకు వచ్చాక తెలిసింది' అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం జామీ వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఇక జామీ వ్యాఖ్యలు విన్న నెటిజన్స్.. బయటవారికే కాదు .. స్టార్ వారసులకు కూడా క్యాస్టింగ్ కౌచ్ ఇబ్బందులు ఉంటాయా.. ఆశ్చర్యంగా ఉందే అని కామెంట్స్ పెడుతున్నారు.

## హీరో సుదీప్‌తో బిగ్‌బాస్ బ్యూటీకి గొడవ ఏంటి.. క్లారిటీ ఇచ్చిన శోభాశెట్టి



కన్నడ, తెలుగు టెలివిజన్ ఇండస్ట్రీలో తనదైన గుర్తింపు తెచ్చుకున్న నటి శోభా శెట్టి.. "కార్తీక దీపం" సీరియల్‌లో 'మోనిత' పాత్రతో తెలుగు ప్రేక్షకుల మనసు దోచుకుంది. ఆ తర్వాత బిగ్‌బాస్ తెలుగు సీజన్ 7 ద్వారా మరింత పాపులారిటీ సంపాదించుకుంది. అనంతరం కన్నడ బిగ్‌బాస్ సీజన్ 11లో కూడా పాల్గొంది. అయితే, ఆ షోలో హోస్ట్ కిచ్చా సుదీప్‌తో తలెత్తిన ఘర్షణపై ఇటీవల ఆమె ఓ ఇంటర్వ్యూలో స్పందించింది. నాకు మొదట బిగ్‌బాస్ కన్నడ కోసం అడిగినప్పుడు, నేను ఇప్పటికే తెలుగు బిగ్‌బాస్ చేశానుగా అని మానుకున్నాను. కానీ తర్వాత వైల్డ్ కార్డ్ ఎంట్రీగా అవకాశం ఇచ్చారు. అప్పట్లో నాకు కన్నడలో ఆఫర్లు తగ్గిపోయి, నేను ఖాళీగా ఉండడంతో ఒప్పుకున్నాను. కానీ హౌజ్‌లోకి వెళ్లిన రెండు వారాల తర్వాత హెల్త్ ఇష్యూస్ వచ్చాయి. దాంతో నేను స్వయంగా ఎలిమినేట్ కావాలని నిర్ణయం తీసుకున్నాను. ఇలా షో నుంచి నిష్క్రమించాలనుకున్నపుడు సుదీప్ సర్ ఫైర్ అయ్యారు. 'మీరు టాప్ 2లో ఉన్నారు, మీకు ఓట్ వేసిన ప్రేక్షకులను ఎలా నిరాశపరుస్తారు?' అంటూ ప్రశ్నించారు. కానీ నేను స్పష్టంగా చెప్పాను. నా ఆరోగ్యం నాకు ముఖ్యమని. డబ్బు, ఫేమ్ తర్వాత వస్తాయి, కానీ ఆరోగ్యం ఉంటేనే అది అన్నీ సాధ్యమవుతాయి. నేను ఫిజికల్‌గా, మెంటల్‌గా స్ట్రాంగ్‌గా లేను, అందుకే కొనసాగలేను అని చెప్పుకొచ్చాను. బిగ్‌బాస్ టీమ్ కూడా నన్ను మెచ్చుకుని షోలో ఉండాలని అన్నారు. కాని నేను ఒప్పుకోలేదు.అయితే ఆ సమయంలో నేను లోపల ఎక్కువ రోజులు ఉండటం మానసికంగా నన్ను తీవ్రంగా ప్రభావితం చేసింది. సుదీప్ సర్ చెప్పింది తప్పు కాదు, కానీ నా పరిస్థితులు నాకే తెలుసు. బయటకు వచ్చిన తర్వాత ఈ వ్యవహారం గురించి చాలా బాధపడిపోయాను. అప్పుడు యశ్వంత్ (నా కాబోయే భర్త) నన్ను మళ్లీ మానసికంగా బలంగా తయారుచేశాడు, అని శోభా తన మనసులోని బాధను చెప్పుకొచ్చింది. బిగ్‌బాస్ షోలో ఫిజికల్, మెంటల్ స్టైయిన్స్ గురించి ఆమె చెప్పుకు రాగా, ఆమె చెప్పిన మాటలు ప్రస్తుతం నెట్టింట్లో చర్చనీయాంశంగా మారాయి. అయితే శోభా కొనసాగి ఉంటే ఆమె తప్పక టాప్ 3లో నిలిచేది అని కొందరు కామెంట్స్ చేస్తున్నారు.

## విలువైన సమయాన్ని గడుపుతున్నా.. విజయ్



రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ జులై 31న కింగ్‌డమ్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం తప్పక విజయం సాధిస్తుందనే కాన్ఫిడెంట్‌తో ఉన్నాడు. అయితే రిలీజ్ డేట్ దగ్గర పడుతుండడంతో మేకర్స్ ప్రమోషన్ స్పీడ్ పెంచారు. విజయ్ దేవరకొండ కూడా పలు ఇంటర్వ్యూలలో పాల్గొంటూ తన సినిమా విషయాలతో పాటు వ్యక్తిగత జీవితం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ఒక రిలేషన్‌షిప్‌లో ఉన్నానని స్పష్టం చేసి అందరికి షాక్ ఇచ్చారు. గతంలో వ్యక్తిగత జీవితం గురించి ఎప్పుడు స్పందించని విజయ్, ఈసారి మాత్రం తల్లిదండ్రులు, గర్ల్‌ఫ్రెండ్‌తో కలిసి విలువైన సమయం గడుపుతున్నానని తెలిపారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.విజయ్ ప్రస్తావించిన గర్ల్‌ఫ్రెండ్ ఎవరో చెప్పకపోయినా, నెటిజన్స్, ఫ్యాన్స్ మాత్రం ఆమె రష్మిక మందన్నే అని అనుకుంటున్నారు. గతంలో ఎన్నోసార్లు వారిద్దరి మధ్య రిలేషన్‌షిప్ ఉందని వార్తలు వచ్చాయి. అయితే, వీరిద్దరూ ఎప్పుడూ దాన్ని అంగీకరించలేదు. ఇటీవల వారు ఒకే కారులో వెళ్లడం, వార్షిక వేడుకల్లో కలిసి కనిపించడం తో, ఈ వార్తలకు బలం చేకూరినట్టు అయింది. ఇటీవల ఇంటర్వ్యూలో విజయ్ మాట్లాడుతూ, "35 ఏళ్ల వయసులో నేను జీవితం గురించి స్పష్టంగా ఆలోచిస్తున్నా" అని చెప్పుకొచ్చాడు. దీంతో పెళ్లి గురించి ఆయన మైండ్ సెట్టైపోయినట్టు అర్థం చేసుకుంటున్నారు అభిమానులు. అయితే ఇప్పుడు పెళ్లికి "విజయ్ సిద్ధంగా ఉన్నాడు, మరి రష్మికేనా డిలే చేస్తుందా?" అనే చర్చ మొదలైంది.ఇక రష్మిక మందన్న విషయానికొస్తే, ప్రస్తుతం ఆమె పాన్ ఇండియా సినిమాలతో బిజీగా ఉంది.

## ఎ తొలి సెషన్‌లో షాకిచ్చిన స్టోక్స్.. సెంచరీ చేజార్చుకున్న రాహుల్



**లండన్-నవభూమి:** మాంచెస్టర్ టెస్టులో పట్టుదలగా ఆడుతున్న కేఎల్ రాహుల్(90) కీలక ఇన్నింగ్స్‌కు తెరపడింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(90 నాటౌట్)తో కలిసి జట్టును ఆదుకునే పనిలో ఉన్న అతడిని బెన్ స్టోక్స్ వెనక్కి పంపాడు. ఎల్బీగా ఔట్ చేసి భారత్‌ను దెబ్బ కొట్టాడు. దాంతో, మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ప్రస్తుతం వాషింగ్టన్ సుందర్(2 నాటౌట్) జతగా గిల్ స్కోర్ బోర్డును నడిపిస్తున్నడు. భారత్ స్కోర్.. 191/3. ఇంకా తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా 120 పరుగులు వెనకబడి ఉంది.అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీలో కీలకమైన మాంచెస్టర్ టెస్టులో భారత జట్టు పోరాడుతోంది. నాలుగో రోజు ఆఖరి సెషన్‌లో ఇంగ్లండ్ బౌలర్లను సమర్ధంగా ఎదుర్కొన్న కెప్టెన్ గిల్(90 నాటౌట్), కేఎల్ రాహుల్(90)లు వికెట్ పడనీయలేదు. ఓపికగా ఆడిన ఈ ఇద్దరూ 173 పరుగుల భాగస్వామ్యంతో డ్రాపై అంచనాలు పెంచారు. అయితే.. ఓవర్ నైట్ స్కోర్‌తో ఐదో రోజు ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్‌కు బెన్ స్టోక్స్ ఊహిచని షాక్ ఇచ్చాడు. లో బౌన్స్ అయిన బంతితో రాహుల్‌ను ఎల్బీగా ఔట్ చేశాడు.తొలి ఇన్నింగ్స్‌లో జో రూట్(150), బెన్ స్టోక్స్(141) విధ్వంసక శతకాలతో ఇంగ్లండ్ భారీ స్కోర్ చేసింది. భారత బ్యాటర్లు తడబడిన చోట రన్ ఫెస్ట్ చేసుకున్న ఆతిథ్య జట్టు.. 311 పరుగుల ఆధిక్యం సంపాదించింది. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభంలోనే క్రిస్ వోక్స్ ధాటికి మొదటి ఓవర్లోనే రెండు వికెట్లు కోల్పోయింది టీమిండియా. వరుస బంతుల్లో యశస్వీ జైస్వాల్(0), సాయి సుదర్శన్(0)లను డకౌట్ చేసి.. ఇంగ్లండ్‌ను జోష్‌లో నింపాడు. అదే ఉత్సాహంతో మరో రెండు వికెట్లు తీయాలనుకున్న.. స్టోక్స్ బృందం ఆశలపై రాహుల్, గిల్ సమయోచిత బ్యాటింగ్‌తో నీళ్లు చల్లారు.

## సచిన్ టెస్ట్ రికార్డుపై జో రూట్ రియాక్షన్..! నేను అభిమానిని అంటూనే..!



**లండన్-నవభూమి:** ఇంగ్లండ్‌కు చెందిన బ్యాట్స్‌మెన్ జో రూట్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. టెస్ట్ క్రికెట్‌లో పరుగుల వరద పారిస్తూ రికార్డులను తిరగరాస్తున్నాడు. దిగ్గజ బ్యాట్స్‌మెన్ సచిన్ టెండూల్కర్ రికార్డుకు చేరువయ్యాడు. ప్రస్తుత ఫామ్‌ను చూస్తుంటే రాబోయే సచిన్ రికార్డును అధిగమించే అవకాశాలున్నాయి. టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్లలో సచిన్ తొలి స్థానంలో ఉన్నాడు. సచిన్ 200 టెస్టుల్లో 15,921 పరుగులు చేయగా.. ఆ తర్వాతి స్థానంలో జో రూట్ నిలిచాడు. ప్రస్తుతం రెండోస్థానంలో ఉన్న రూట్. 157 టెస్టుల్లో 13,409 పరుగులు చేశాడు. 2512 పరుగుల దూరంలో ఉన్నాడు. భారత్‌తో జరిగిన మాంచెస్టర్‌తో సెంచరీ చేసి రికార్డులకెక్కాడు. ప్రస్తుత ఫామ్‌ను చూస్తుంటే రెండు మూడేళ్లలో సచిన్ రికార్డును అధిగమించే అవకాశాలున్నాయి.

నవక్రీడ

## ఐదోరోజు రిషబ్ పంత్ బ్యాటింగ్‌కు వస్తాడు.. వెల్లడించిన బ్యాటింగ్ కోచ్..!



**లండన్-నవభూమి:** ఇంగ్లండ్‌తో జరుగుతున్న నాలుగో టెస్టులో ఐదో రోజు రిషబ్ పంత్ బ్యాటింగ్‌కు వస్తాడని భారత బ్యాటింగ్ కోచ్ సితాన్షు కొటక్ వెల్లడించాడు. తొలి ఇన్నింగ్స్‌లో క్రిస్ వోక్స్ వేసిన యార్కర్‌ను రివర్స్ స్వీప్ చేయడానికి ప్రయత్నించిన సమయంలో పంత్ పాదానికి గాయమైంది. బంతి లోపలి అంచుకు వెళ్లి షూ ముందుభాగంలో తాకింది. తీవ్రమైన నొప్పితో బాధపడ్డ పంత్ ఆ తర్వాత ఫిజియోను సంప్రదించాడు. చివరకు మైదానాన్ని వీడాడు. కుడి పాదం వాచిపోయి రక్తస్రావమైంది. స్కానింగ్‌లో ఫ్రాక్చర్ ఉన్నట్లు తేలింది. ఆరువారాలు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. అయితే, తొలి ఇన్నింగ్స్‌లో ఫ్రాక్చర్ ఉన్నా పంత్ బ్యాటింగ్‌కు వచ్చి హాఫ్ సెంచరీ చేశాడు. అయితే, బొనటవేలు గాయానికి చికిత్స తీసుకునే ముందు మ్యాచ్ ఫలితం వరకు వేచి ఉండాలని నిర్ణయించుకున్నట్లు సితాన్షు కొటక్ తెలిపాడు. ఇంగ్లండ్ విధించిన భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా సున్నా స్కోర్‌కే రెండు కీలక వికెట్లు కోల్పోయింది. శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్ మరో వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డారు. ఈ జోడీని బ్యాటింగ్ కోచ్ ప్రశంసించాడు. బ్యాటింగ్ చేసిన విధానం చాలా అద్భుతంగా ఉందని చెప్పుకొచ్చాడు.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**